అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 26-1-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 25 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి

చైర్మెన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి

- సభ్యులుగా అనితా రాజేంద్ర, అమీర్ ఉల్లాఖాన్, యాదయ్య, రామ్మోహన్‌రావు, పాల్వాయి రజనీకుమారి
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలకమండలిని నియమించింది. చైర్మెన్‌గా మాజీ డీజీపీ పి మహేందర్‌రెడ్డి నియామకమయ్యారు. సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనితా రాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో రిటైర్డ్ అధికారి అమీర్ ఉల్లాఖాన్, జేఎన్టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, యరబాది రామ్మోహన్‌రావు, పాల్వాయి రజనీకుమారిని ప్రభుత్వం నియమించింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించి పంపిన ఈ నియామకాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. గతంలో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో టీఎస్‌పీఎస్సీ అభాసుపాలైంది. నిరుద్యోగులు, రాజకీయ పార్టీల నాయకుల నుంచి తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. అందులో భాగంగా ఐఏఎస్ అధికారులు అనితా రామచంద్రన్, వాణీప్రసాద్ బృందాలు కేరళ పీఎస్సీ, ఢిల్లీలో యూపీఎస్సీని సందర్శించి పలు విషయాలను అధ్యయనం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా ఢిల్లీ పర్యటనలో భాగంగా యూపీఎస్సీ చైర్మెన్‌తో భేటీ అయ్యారు. అనంతరం టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ...13లో

కష్టపడండి... గెలుపు మనదే



బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కలిసినా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేవు...

- 'ఇండియా' కూటమి అధికారంలోకి రాబోతోంది
- మోడీ హామీలకు గ్యారంటేదీ?
- బీజేపీ వైపే కేసీఆర్ చూపు
- ప్రజల సొమ్ముతో మోడీ వ్యక్తిగత ప్రచారమా? : కాంగ్రెస్ బూత్‌స్థాయి కన్వీనర్ల సమావేశంలో ఖర్గే
- ప్రభుత్వాలను కూల్చే బీజేపీతో జాగ్రత్త అంటూ రేవంత్‌కు సలహా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశం కోసం, రాజ్యాంగ రక్షణ కోసం కష్టపడి పని చేయాలనీ, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసినా తమ పార్టీని ఏమీ చేయలేవని ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'ఇండియా' కూటమి దేశంలో అధికారంలోకి రాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ ప్రజల సొమ్ముతో వ్యక్తిగత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చినమేరకు రెండు కోట్ల ఉద్యోగాలకు, ప్రతి ఖాతాలో రూ 15 లక్షలు జమ చేస్తామన్న హామీలకు గ్యారంటీ ఏది? అంటూ మోడీని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక రాష్ట్ర ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేసిందన్నారు. బీజేపీతో జర జాగ్రత్త అంటూ రేవంత్‌కు సూచించారు. మోడీ బెదిరింపులకు కాంగ్రెస్ భయపడబోదని హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ...13లో

టీఎస్‌పీఎస్సీ ముందు సవాళ్లెన్నో...

పారదర్శకంగా నియామకాల ప్రక్రియ సాగేనా?

- పార్లమెంటు ఎన్నికల కోడ్‌లోపు నోటిఫికేషన్లు వస్తాయా...
- మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న కాంగ్రెస్
- నిరుద్యోగుల ఎదురుచూపు
- త్వరలో గ్రూప్-1,2,3 రాతపరీక్షల తేదీలు ఖరారు
- గ్రూప్-4 ఫలితాల వెల్లడికి మార్గం

వివరాలు 3లో..

కేసీఆర్ కాస్కో...వస్తున్నా...

- ఇది ఇంటర్వెల్ మాత్రమే
- ఫిబ్రవరి మొదటివారంలో మరో రెండు గ్యారంటీల అమలు : సీఎం రేవంత్‌రెడ్డి



వివరాలు 5లో

కొడతామంటే కాంగ్రెస్ కార్యకర్తలు చేతులు ముడుచుకోరు

వివరాలు 5లో

- వారు కన్నెర్ర చేస్తే బీఆర్ఎస్ మిగలదు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఇప్పుడమెందుకు? చూడాలనిపిస్తే చెప్ప !

- మంత్రి కేటీఆర్‌కు పొన్నం సెటైర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే నడిరోడ్డుపై కాంగ్రెస్ నేతల బట్టలిప్పి నిలబెడతామంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు ...13లో

వివరాలు 13 రెండు నిమిషాలకే ముగిసిన గవర్నర్ ప్రసంగం - కేరళ శాసనసభ సమావేశాలు ప్రారంభం

వివరాలు 5 34 మందికి పద్మశ్రీ అవార్డులు - అందులో ముగ్గురు తెలుగువాళ్లు - చిరంజీవి,వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ్

వివరాలు 13 అన్యాయంపై ఇండియా పోరాటం : రాహుల్ - ఎన్నికల తర్వాత రాహుల్ అరెస్ట్ : అసోం సీఎం బిశ్వ శర్మ

రాజకీయ పునరావాస కేంద్రంగా రేవంత్ ప్రభుత్వం

ఐదేండ్లపాటు ఒక్కరినే సీఎంగా కొనసాగించిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదు



(ఫైల్)

- దావోస్ వేదికగా పచ్చి అబద్ధాలు మాట్లాడిన సీఎం
- 45 రోజుల్లో ఆయన సాధించింది ఢిల్లీకి పోవటమొక్కటే
- బేషజాల వల్లే ప్రగతి భవన్‌ను వాడటం లేదు
- ప్రభుత్వం మారినప్పుడల్లా కొత్త భవనాలు కడతామంటే ఎలా..?
- మీడియాతో ఇష్టాగోష్టిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఒకే వ్యక్తిని ఐదేండ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగించిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇంకా ప్రారంభానికే నోచుకోని రైతు భరోసా గురించి దావోస్ వేదికగా సీఎం పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. ఆ పథకాన్ని ఇప్పటికే ప్రారంభించామని చెప్పటంపై ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి ...5లో

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా

కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్

- గవర్నర్ తమిళిసై ఆమోదం



వివరాలు 6లో..

శివబాలకృష్ణ కేసుతో ఆ మాజీ మంత్రికి షాక్

- ఐఏఎస్ అధికారికీ లింక్ ?
- విచారణలో మరికొందరు
- బయటకొచ్చే అవకాశం

వివరాలు 5లో..

ఎంసెట్ ఇక ఈఏపీసెట్

- మే 9 నుంచి 13 వరకు రాతపరీక్షలు
- అదేనెల 6న ఈసెట్, 23న ఎడ్‌సెట్
- ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు
- విడుదల చేసిన బుర్రా వెంకటేశం, లింబాద్రి

వివరాలు 13లో

ప్రొఫెసర్ కోదండరాంకు టీఎన్జీవో సంఘం అభినందనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంకు టీఎన్జీవో సంఘం అభినందనలు తెలిపింది. గవర్నర్ కోటాలో ఆయన ఎమ్మెల్సీ అయిన నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, పర్వతాలు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జ్ఞానేశ్వర్, లక్షణ్ తదితరులు కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుని సేవలను గుర్తించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర ఉద్యోగులు, ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మిత్రపక్షాలనే ఒప్పించలేదు..దేశాన్ని ఎలా రక్షిస్తారు..?

- కాంగ్రెస్‌పై కేటీఆర్ సెటైర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోసం కాంగ్రెస్ నైజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎక్స్ వేదికగా ఆయన ఆ పార్టీపై విరుచుకుపడ్డారు. నయవంచనకు నిలువెత్తు రూపం కాంగ్రెస్ అనీ, అందుకే ఆదిలోనే ఇండియా కూటమికి బీటలు వారిందని తెలిపారు. మిత్రపక్షాలను ఒప్పించలేని కాంగ్రెస్ దేశ ప్రజలను ఏం మెప్పిస్తుంది? అని ప్రశ్నించారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉందాం

- గవర్నర్ తమిళిసై గణతంత్ర శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ రాష్ట్ర ప్రజలకు 75వ గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి బేధం లేకుండా రాజ్యాంగం అందరికి హక్కులను అందించిందని ఆమె గుర్తుచేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి విలువలు కలిగి ప్రజాస్వామ్య దేశంగా ఉండేలా రాజ్యాంగం రూపొందించడమనేది డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ లాంటి దార్శనికుల ఘనతేనని ఆమె తెలిపారు. ఆ విలువల కోసం మనందరం పునరంకితమవ్వాలని సూచించారు.

సమ్మయ్యకు పద్మశ్రీ రావడం పట్ల పల్లా హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు కేంద్రం పద్మశ్రీ ప్రకటించడం పట్ల జనగామ ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేసారు. దేశ వ్యాప్తంగా 34 మంది పద్మ, పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. కేంద్రం పద్మ అవార్డులు ప్రకటించిన వారిలో రాష్ట్రం నుంచి నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామానికి చెందిన దాసరి కొండప్పకు, ఆంధ్రప్రదేశ్ నుంచి హరికథ కళాకారిణి ఉమా మహేశ్వరి ఉన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడటమే లక్ష్యంగా జీవిస్తున్న కళాకారులకు కేంద్రం పద్మశ్రీ ప్రకటించడం, అందులో జనగామ ప్రాంతానికి చెందిన గడ్డం సమ్మయ్య ఉండటంపై ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం రాత్రి సమ్మయ్యకు ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ నేతపై చర్యలేవి ?

ప్రశ్నించిన బాంబే హైకోర్టు

ముంబయి : గత సంవత్సరం సెప్టెంబరులో ఓ మసీదుపై జరిగిన దాడితో సంబంధం ఉన్న బీజేపీ సీనియర్ నేత విక్రమ్ పావస్కార్‌పై తీసుకున్న చర్యలను వివరిస్తూ రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని బాంబే హైకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పావస్కార్‌పై చర్యకు డిమాండ్ చేస్తూ బాంబే హైకోర్టులో గతంలో రిట్ పిటిషన్ దాఖలైంది. వాస్తవానికి రాష్ట్రంలో విద్వేష ప్రసంగాలు చేసిన వారి పైన తరచుగా ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. పోలీసులు కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ వాటిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్రమ్ పావస్కార్ తరచూ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతుంటారు. ఆయనపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా, ఎఫ్ఐఆర్‌లు నమోదైనా చర్యలు మాత్రం శూన్యం. ఈ నేపథ్యంలో పలువురు పిటిషనర్లు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్‌పై తక్షణమే చర్య తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. మసీదుపై దాడి చేసిన కేసులో గత సంవత్సరం డిసెంబర్ 18న తుది ఛార్జిషీటు దాఖలైంది. అయితే ఆశ్చర్యకరంగా అందులో పావస్కార్ పేరు లేదు. దీనిపై కూడా న్యాయస్థానం పోలీసులకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌కు, సాక్షులకు రక్షణ కల్పించాలని ఆదేశించింది.

టీఎస్‌పీఎస్సీ ముందు సవాళ్లెన్నో...

పారదర్శకంగా నియామకాల ప్రక్రియ సాగేనా?

- పార్లమెంటు ఎన్నికల కోడ్‌లోపు నోటిఫికేషన్లు వస్తాయా...
- మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న కాంగ్రెస్
- నిరుద్యోగుల ఎదురుచూపు



త్వరలో గ్రూప్-1,2,3 రాతపరీక్షల తేదీలు ఖరారు

గ్రూప్-4 ఫలితాల వెల్లడికి మార్గం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలకమండలిని నియమించడంతో నియామకాల ప్రక్రియ ముందుకు సాగేందుకు మార్గం సుగమమైంది. దీంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురించాయి. అయితే బీఆర్ఎస్ హయాంలో ప్రశ్నాపత్రాల లీకేజీతో టీఎస్‌పీఎస్సీ అభాసుపాలైంది. నిరుద్యోగులు, రాజకీయ పార్టీల నాయకుల నుంచి పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ వైఫల్యాలను ఎత్తిచూపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల నియామకం నుంచి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎంతో పారదర్శకంగా చేపడతామని పలుమార్లు ప్రకటించింది. దీంతో కొత్త పాలకమండలిపై మరింత బాధ్యత పెరిగింది. పారదర్శకంగా నియామకాల ప్రక్రియను చేపట్టడం వారి ముందు ప్రధాన సవాల్‌గా ఉన్నది. ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందులో టీఎస్‌పీఎస్సీ ద్వారానే ఎక్కువ ఉద్యోగాలు భర్తీ అయ్యే అవకాశమున్నది. అయితే ఫిబ్రవరి లేదా మార్చిలో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ రానుంది. అది వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. అప్పుడు నియామకాల ప్రక్రియను చేపట్టేందుకు అవకాశముండదు. దీంతో ఎన్నికల కోడ్ రావడానికి ముందే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అవుతాయా? అన్నది అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. కొత్త పాలకమండలి రావడంతో ఉద్యోగాల భర్తీ కోసం నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొత్త పాలకమండలి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి. రాష్ట్రంలో తొలిసారిగా ప్రకటించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ రాతపరీక్షలు రెండు సార్లు రద్దయ్యాయి. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022, ఏప్రిల్ 26న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. కొత్త పాలకమండలి ఏర్పాటు కావడంతో గ్రూప్-1 ప్రిలిమ్స్ రాతపరీక్షలను ఖరారు చేయాల్సి ఉంటుంది. ఈనెల ఆరు, ఏడు తేదీల్లో నిర్వహించతలపెట్టిన గ్రూప్-2 రాతపరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. గ్రూప్-2 రాతపరీక్షలను ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి రావడంతో రాతపరీక్షల తేదీలను ఖరారు చేస్తుంది.

తెలంగాణ తొలి గ్రూప్-3 ద్వారా 1,388 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గ్రూప్-3 రాతపరీక్షల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్ష గతేడాది జులై ఒకటిన నిర్వహించిన విషయం తెలిసిందే. పేపర్-1కు 7,62,872 మంది, పేపర్-2కు 7,61,198 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం 2022, డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే కొత్త పాలకమండలి గ్రూప్-4 మెరిట్ జాబితాను విడుదల చేయాల్సి ఉన్నది. దీనికోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.



తమ్మినేనిని పరామర్శించిన విజయ రాఘవన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏఐజి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న తమ్మినేని వీరభద్రంను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజయ రాఘవన్ గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. విజయ రాఘవన్‌తో పాటు పార్టీ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నవీన్, కుమారుడు సంఘమిత్ర, కుమార్తె శృతి ఉన్నారు. 'ఆస్పత్రిలో బుధవారం తమ్మినేనికి మైనర్ ఆపరేషన్ చేసి గుండె వద్ద పేస్ మేకర్ అమర్చారు. ప్రస్తుతం తమ్మినేని ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్నది. పార్టీ కార్యకర్తలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మరి కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉంది. తమ్మినేనిని పరామర్శించటానికి ఎవరూ ఆసుపత్రికి రావద్దని డాక్టర్లు చెబుతున్నారు. పార్టీ కార్యకర్తలు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకొని సహకరించాలి' అని పోతినేని విజ్ఞప్తి చేశారు.



విప్లవ కాంతి శిఖరం లెనిన్

- మార్క్సిజం-లెనినిజం శాస్త్రీయమైన సిద్ధాంతం
- విశ్వాసాలు, మతాన్ని రాజకీయాలకు వాడుతున్న బీజేపీ
- దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఐక్య పోరాటాలు
  ప్రజలకు అండగా నిలిచేది ఎర్రజెండానే
- వర్తమాన పరిస్థితులు-లెనిన్ ప్రాధ్యాన్యత'
  సెమినార్‌లో ఎస్.వీరయ్య

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

విప్లవోద్యమాల కాంతి శిఖరం లెనిన్ స్ఫూర్తితో కార్మికులు, కర్షకులు, శ్రామికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో గురువారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన 'వర్తమాన పరిస్థితులు-లెనినిజం ప్రాధాన్యత' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు వీరయ్య మాట్లాడారు. శ్రామికవర్గ రాజ్యం సోవియట్ యూనియన్‌ను సాధించిన ఘనత లెనిన్ నాయకత్వానికి దక్కుతుందన్నారు. భారత దేశ వర్తమాన పరిస్థితుల్ని పరిశీలిస్తే.. 2024 అనేది రెండు పరస్పర వైరుధ్య దృక్పథాలతో మొదలైందన్నారు. అందులో ఒకటి ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా పరిశ్రమలు, ఇతర అనేక రంగాల్లో సమ్మె జరగనుందని, అదే రోజున 500పైగా రైతు, వ్యవసాయ, కూలీ సంఘాల పిలుపులో భాగంగా జాతీయ గ్రామీణ బంద్ కూడా జరగనుందన్నారు. శ్రామికుల హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ, లౌకిక విలువ కోసం దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటం జరగబోతుందన్నారు. శ్రామిక వర్గాల పోరాటాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మోడీ ప్రభుత్వం శత విధాలా ప్రయత్నిస్తుందన్నారు. ఇందుకోసం ఇటు కేంద్ర ప్రభుత్వం అటు బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకత్వాలు మత విశ్వాసాలను రాజకీయం చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. అయోధ్యలో రామాలయ ప్రారంభాన్ని మతపరమైన కార్యక్రమంగా కాకుండా ప్రభుత్వ కార్యక్రమంగా మార్చి ప్రధాని మోడీ చుట్టు తిప్పడం అప్రజాస్వామిక చర్య అన్నారు. వ్యక్తిగత విశ్వాసాలు, మతపరమైన విషయాల్ని స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడం దుర్మార్గమన్నారు.

తమ జీవితాలు మెరుగుపడాలన్నా.. సమస్యలు పరిష్కారం కావాలన్నా శ్రామిక వర్గ ప్రజలు ఐక్యంగా పోరాడాలన్నారు. మత విశ్వాసాలు, శ్రామిక ప్రజల పోరాటాల గురించి లెనిన్ శాస్త్రీయమైన మార్క్సిస్టు దృక్పథంతో మార్గదర్శకం చూపారన్నారు. పాలకవర్గాలు పెట్టుబడిదారుల దోపిడీని కాపాడటం కోసం శ్రామిక ప్రజలు పోరుబాట పట్టకుండా జోకొట్టేందుకు ప్రయత్నిస్తాయన్నారు. మభ్యపెట్టే పెట్టుబడిదారుల కుయుక్తులను గమనించి కార్మికులు, కర్షకులు, శ్రామికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుత సంకట పరిస్థితుల్ని శాస్త్రీయ మైన మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాల ఆధారంగా అధ్యయనం చేసి విప్లవ పార్టీని బలోపేతం చేసుకోవాలన్నారు. మత విశ్వాసాల నుంచి ప్రజలు బయటపడి తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాల్లోకి వస్తారని, ఆ ప్రజలకు నాయకత్వం వహించేది ఎర్రజెండా మాత్రమేనని స్పష్టం చేశారు. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మె, గ్రామీణ బంద్‌లో శ్రామిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బీరం మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మాణిక్యం, జి.సాయిలు, ప్రవీణ్‌కుమార్, నర్సింహులు, యాదగిరి, యాదవరెడ్డి, రేవంత్‌కుమార్, మహిపాల్, నాగేశ్వర్‌రావు, అశోక్, కృష్ణ, రాజయ్య, బాబారావు, రమేష్, రమేష్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎర్రవల్లిలో

బీఆర్ఎస్ పార్లమెంటు స్థాయి సమావేశం

50 రోజుల తర్వాత బయటకు రానున్న కేసీఆర్

నవ తెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లిలో గల తన వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖరరావు నేతృత్వంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్లమెంటు స్థాయి సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి ఎంపీలతో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, సీనియర్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరుకానున్నట్టు సమాచారం. వారం రోజుల కిందటే కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న విషయం తెలిసిందే. అదేవిధంగా పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థులపై చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాల నుంచి సమాచారం. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల విషయంపై చర్చించి కొలిక్కి తెచ్చే అవకాశం ఉందని కేసీఆర్ సన్నిహితుల ద్వారా తెలిసింది. మెదక్ పార్లమెంట్ స్థానం వంటేరు ప్రతాప్ రెడ్డికి ఖాయమైనట్టు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య నేతలను, మెదక్ పార్లమెంటు పరిధిలో ఉన్న ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సమావేశానికి పిలిచే అవకాశం ఉంది. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కూడా సమావేశానికి వెళ్లే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం సుమారు 50 రోజుల తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కేసీఆర్ ఆ తర్వాత రాజకీయ సమావేశాల్లో పాల్గొనలేదు.

నవతెలంగాణ

దేశాభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు,
ప్రతి పౌరుని నైతికాభివృద్ధి - డా॥ బి.ఆర్. అంబేద్కర్

శుక్రవారం 26 జనవరి 2024
www.navatelangana.com

సంపాదకీయం

సైనికులను చంపుకున్న ఉక్రెయిన్!

ప్రపంచ మిలిటరీ చరిత్రలో అనూహ్యమైన మరో దారుణం జరిగింది. ఉక్రెయిన్-రష్యా మధ్య కుదిరిన యుద్ధ ఖైదీల మార్పిడి ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి వస్తున్న ఒక మిలిటరీ రవాణా విమానాన్ని క్షిపణులతో ఉక్రెయిన్ కూల్చివేసింది. అరవై అయిదు మంది ఉక్రెయిన్ సైనికులతో పాటు ఆరుగురు విమాన సిబ్బంది, ముగ్గురు రష్యన్ సైనికులు కూడా దుర్మరణం చెందారు. పరస్పర బందీల మార్పిడి అవగాహన మేరకు వారిని ఉక్రెయిన్‌కు తీసుకు వస్తుండగా ఈ దారుణం జరిగింది. ఒక విధంగా తన వారిని తానే జెలెన్‌స్కీ పొట్టనబెట్టుకున్నట్లయింది. సరి హద్దులోని రష్యా భూభాగం బెల్‌గోరోడ్ ప్రాంతంలో విమానం కూలింది. దాన్ని ఉక్రెయినే కూల్చిందని, చర్చించాలని రష్యా భద్రతా మండలిని కోరింది. ఇది రాసిన సమయానికి విమానాన్ని తామే కూల్చినట్లుగానీ లేదని గానీ ఉక్రెయిన్ నిర్ధారించ లేదు గాని దాని పనే అనే సూచనలు వెలువడ్డాయి. అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అధికార యంత్రాంగం స్పందించిన తీరును బట్టి ఆ దుర్మార్గానికి బాధ్యత వారిదే అనుకోవాలి. పథకం ప్రకారమే ఖైదీలతో వస్తున్న విమానాన్ని కూల్చినట్లు గ్రహించిన రష్యా, దాని వెనుకనే మరో 80 మంది ఖైదీలతో వస్తున్న విమానాన్ని వెనక్కు మళ్లించింది.

> ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమై గురువారం నాటికి 701 రోజులు.2022 ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్యను ప్రారంభించింది. తొలి రోజుల్లో రాజీకి జెలెన్‌స్కీ సుముఖత చూపినప్పటికీ అమెరికా, బ్రిటన్ నేతలు అడ్డుకొని ముందుకు సాగకుండా చేశారు. తాము అందచేసే ఆధునిక ఆయుధాలతో రష్యాను ఓడించవచ్చని వేసుకున్న పశ్చిమదేశాల అంచనాలు ప్రారంభంలోనే తప్పాయి.ప్రారంభం నుంచి జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే జెలెన్‌స్కీని ఒక కీలుబొమ్మగా మార్చి పశ్చిమ దేశాలే వెనుక ఉండి కథ నడిపిస్తున్నట్లు స్పష్టమైంది.

రష్యా విమానంలో ఎవరు ఉన్నదీ తమకు సమగ్ర, నిర్ధారిత సమాచారం లేదని ఉక్రెయిన్ గూఢచార డైరెక్టరేట్ పేర్కొన్నది. బుధవారం నాడు ఖైదీల మార్పిడి జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, తమ వైపు నుంచి పంపిన రష్యన్ ఖైదీలు సురక్షితంగా ఉన్నారని వెల్లడించింది. గతంలో మాదిరి ఈ సారి గగనతల రక్షణ ఏర్పాట్లు చేయాలని తమను కోరలేదని ఆరోపించింది. ఈ కారణంగానే తమ దేశంలో పరిస్థితిని అస్థిర పరిచేందుకు, అంతర్జాతీయంగా తమకు వస్తున్న మద్దతును తగ్గించేందుకు పథకం ప్రకారం జరిపిన చర్య ఇదని కూడా ఆరోపించింది. దానికి అనుగుణ్యంగానే జెలన్‌స్కీ కూడా




మాట్లాడాడు. ఖైదీల ప్రాణాలు, వారి బంధువులు, తమ సమాజ మనోభావాలతో రష్యా ఆడు కుంటున్నదని ఆరోపించాడు. ఈ వివరణ, ప్రకటన నమ్మ శక్యంగా లేదు. నిర్ణీత కార్యక్రమం ఉందని తెలిసినప్పటికీ ఆ ప్రాంతానికి ఒక మిలిటరీ రవాణా విమానం ఎందుకు వస్తున్నదో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉక్రెయిన్ మీద కూడా ఉంది. దానికి హెచ్చరికలు చేసినట్లు అది చెప్పలేదు. ఉపరితలం నుంచి గగనతలంలోకి క్షిపణులను ప్రయోగించేవారికి ఎదుటివైపు నుంచి వస్తున్నది మిలిటరీ విమానాలా హెలికాప్టర్లా అన్నది తెలుసుకోవటం కష్టమేమీ కాదని సైనిక నిపుణులు స్పష్టంగా చెప్పారు. విమాన కూల్చివేత తమపనేనని ఉక్రెయిన్ మిలిటరీ సూచించిందని ఉక్రెయినస్కా ప్రావదా అనే పత్రిక సైనిక వర్గాలను ఉటంకిస్తూ ఒక వార్తను వెల్లడించింది.

రష్యా ఎస్-300 రక్షణ వ్యవస్థలకు అవసరమైన క్షిపణులను ఆ విమానం తరలిస్తున్నదని కూడా రాసిన వార్తను తరువాత వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ఇలాంటి అనేక విమానాలు తమ సరిహద్దులవైపు వస్తున్నట్లు గమనించామని, తమ మీద దాడులకోసమే క్షిపణులు తెస్తున్నట్లు భావించామని ఉక్రెయిన్ వర్గాలు చెప్పాయి. ఖైరకోవ్ ప్రాంతం నుంచి ప్రయోగించిన క్షిపణుల కారణంగానే విమానం కూలిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీలావరోవ్ చెప్పాడు. ఇది ఉగ్రవాద చర్య అని, ఉక్రెయిన్ తన నిజరూపాన్ని వెల్లడించుకున్నదని ఐరాసలో విలేకర్లతో చెప్పాడు. తమ విమానాన్ని కూల్చి వేసేందుకు అమెరికా లేదా జర్మనీ అందచేసిన మూడు క్షిపణులను ప్రయోగించినట్లు రష్యన్ నిపుణులు చెప్పారు.

ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమై గురువారం నాటికి 701 రోజులు.2022 ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్యను ప్రారంభించింది. తొలిరోజుల్లో రాజీకి జెలెన్‌స్కీ సుముఖత చూపినప్పటికీ అమెరికా, బ్రిటన్ నేతలు అడ్డుకొని ముందుకు సాగకుండా చేశారు. తాము అందచేసే ఆధునిక ఆయుధాలతో రష్యాను ఓడించవచ్చని వేసుకున్న పశ్చిమ దేశాల అంచనాలు ప్రారంభంలోనే తప్పాయి. ప్రారంభం నుంచి జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే జెలెన్‌స్కీని ఒక కీలుబొమ్మగా మార్చి పశ్చిమదేశాలే వెనుక ఉండి కథ నడి పిస్తున్నట్లు స్పష్టమైంది. గతంలో చమురు- గాస్ పైప్‌లైన్ల విధ్వంసం, క్రిమియా వంతెన, రష్యన్ నౌకలపై దాడి సందర్భంగా కూడా ఉక్రెయిన్ తొలుత బుకాయించినా తరువాత అదే చేసిందని వాటి వెనుక పశ్చిమ దేశాలు ఉన్నట్లు నిర్ధారణైంది. తాజా విమాన కూల్చివేత వెనుక కూడా వారి పథకం, హస్తం లేదని చెప్పలేము.

"పూర్ణ స్వరాజ్" సాధించామా?





ఆర్. రఘు
9490098422

స్వరాజ్యం (స్వాతంత్ర్యం) కచ్చితంగా సాధించాం. అది సంపూర్ణమా, అసంపూర్ణమా అనేది చర్చనీయాంశమే. మన వర్గ దృక్పథాలను బట్టి సమాధానాలు భిన్నంగా వుంటాయి. పూర్ణ స్వరాజ్ నినాదాన్ని ఏ వర్గాల ప్రతినిధులు యిచ్చారు? పూర్ణ స్వరాజ్యం అంటే వారు ఏమి చెప్పారు? ఆ చెప్పిన దాంట్లో 75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం ఏ మేరకు సాధించగలిగాము? ఇంకా సాధించాల్సింది ఎంత ఉంది? ఏమి ఉంది? స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు వారు చెప్పిందే ఎందుకు సంపూర్ణంగా సాధించలేకపోతున్నారు? ఇక చివరిగా పూర్ణ స్వరాజ్‌ను ఎవరు (ఏ వర్గాలు) ఎప్పటికి, ఎలా సాధించగలుగుతారు అన్న కీలకమైన ప్రశ్నలను చరిత్ర మన ముందుంచింది.

1930 జనవరి 26న నాడు స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రధాన నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య దినంగా జరుపుకోవాలని 1929 లాహోర్ నగరం (ప్రస్తుత పాకిస్తాన్)లో జరిగిన కాంగ్రెస్ మహాసభ పిలుపునిచ్చింది. అందుకు ఒక స్పష్టమైన తీర్మానాన్ని రూపొందించి (26జనవరి 1930)న దేశవ్యాప్తంగా వేలాది పట్టణ, పల్లెల్లో బహిరంగంగా లక్షలాది మంది జనంతో చదివించింది. దానికి నాలుగైదేండ్ల ముందు మత కలహాల వల్ల ఏర్పడ్డ వైషమ్యాలను పక్కకు నెట్టి అపూర్వమైన ఐక్యతతో హిందూ, ముస్లిం ప్రజలు ఈ ఘటనలో ఒక్కటయ్యారు. వెనువెంటనే దేశవ్యాప్తంగా శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభమైంది. ఈ వరుస ఘటనలతో బ్రిటిష్ ప్రభుత్వం గడగడలాడింది.

'పూర్ణ స్వరాజ్' నినాదమా? లక్ష్యమా?

1930 నాటికి నడిచిన మహత్తర స్వాతంత్రోద్యమ చరిత్రను పరిశీలిస్తే పూర్ణ స్వరాజ్ నినాదాన్ని ప్రకటించిన వారి దృష్టిలో అది ప్రజలను మరింత ఉధృతంగా కదిలించడానికి ఇచ్చిన నినాదం కావచ్చు. కానీ అశేష భారతీయులు అది ఒక ఉన్నతమైన, పవిత్రమైన లక్ష్యంగా భావించారు. 1920 నుండి 1930 వరకు గడచిన పదేండ్ల కాలంలో స్వాతంత్రోద్యమంలో ప్రజలు పాల్గొన్న తీరు, సాగిన ఉద్యమాల ఉధృతి పర్యవసానమే ఆ పిలుపు. క్లుప్తంగా చెప్పాలంటే అనేక ఘటనల ఆధారంగా కొనసాగుతున్న స్వాతంత్ర్య పోరాటాన్ని 1920వ దశకం అద్యాంతం కుదిపేసింది. పెషావర్ నుండి కన్యాకుమారి వరకు, బెలుచిస్తాన్ నుండి కలకత్తా వరకు (ఇవి దాదాపు ఆనాటి మన దేశం ఎల్లలు) కోటానుకోట్ల మంది జనం 1919 జలియన్ వాలాబాగ్‌లో జరిగిన మారణఖాండతో కోపోద్రిక్తులై రోడ్ల మీదకొచ్చారు. ఈ పోరాటాలకు లాహోర్ నగరం ఒక బలమైన కేంద్రం. 1921లో అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో అప్పుడే పుట్టిన కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైన (కాంగ్రెస్ సభ్యుడు కూడా) సయ్యద్ ఫజల్ ఉల్ హసన్ (కలం పేరు హజ్రత్ మోహానీ) సంపూర్ణ స్వాతంత్ర తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. నాటి ఆ కాంగ్రెస్ మహాసభ తీర్మానాన్ని ఆమోదించే ధైర్యం చేయకపోయినా అది ప్రజా నినాదంగా తయారయింది. భారత ప్రజల కోపోద్రేకాలను దృష్టిలో పెట్టుకొని గాంధీజీ 1920 సహాయ నిరాకరణకు పిలుపునిచ్చారు. ఖిలాఫత్ ఉద్యమ పిలుపు భారతదేశంలో అందుకున్న ముస్లిం మతస్తులు ముఖ్యంగా యువకులు పెద్దఎత్తున బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న సహాయ నిరాకరణకు సంఘీభావంగా నిలబడ్డారు. ఆ కాలంలోనే 1917రష్యాలో జయప్రదమైన కార్మిక వర్గ మహా విప్లవం, అది నిర్మిస్తున్న సమసమాజం ప్రపంచ వ్యాప్తంగా పీడిత జనాన్ని ఆకట్టుకోవడంలో భాగంగానే 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక వర్గ పోరాటాల సమన్వయం కోసం సాగిన దశాబ్దాల కృషి ఫలించి 1920లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఏర్పడింది.

పరాయి పాలనకు వ్యతిరేకంగా వెల్లువెత్తున్న స్వాతంత్రోద్యమం సాంఘిక ఉద్యమాలకు తెరలేపింది. సాంఘిక ఉద్యమాలు ముఖ్యంగా అంటరానితనానికి వ్యతిరేకంగా, బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా శూద్రఉద్యమాలు వూపందుకున్నాయి. డా.బిఆర్ అంబేద్కర్ 1927లో ప్రారంభించిన 'మహాద్' పోరాటం అందుకు నిదర్శనం. ఉక్కిరిబిక్కిరి అయిన బ్రిటిష్ ప్రభుత్వం ఓ పక్కన ఉద్యమాలను పాశవికంగా అణిచే ప్రయత్నం సాగిస్తూనే మరో పక్క కంటితుడుపుగా సైమన్ కమిషన్ వేసింది. ఆ కమిషన్‌లో ఒక్క భారతీయుడు కూడా లేకపోవడంతో పుండుమీద కారం రాసినట్లు భావించిన ప్రజలు సైమాన్ గోబ్యాక్ నినాదంతో హోరెత్తించారు. ఈ సందర్భంగానే జరిగిన మరో ప్రముఖమైన ఘటన ఇక్కడ పేర్కొనాలి. "1928లో కలకత్తాలో కాంగ్రెస్ మహాసభ జరిగింది. ట్రాంవేమెన్స్ యూనియన్, బెంగాల్ జూట్ వర్కర్స్ యూనియన్, ఈస్ట్ ఇండి యా రైల్వే లేబర్ యూనియన్‌ల సంయుక్త పిలుపు మేరకు నాటి కమ్యూనిస్టు నాయకులు ముజఫర్ అ హ్మద్, బంకిం ముఖర్జీ తదితరుల నాయకత్వాన 30 వేల మంది కార్మికులు కాంగ్రెస్ మహాసభలోకి చొర బడి మీటింగ్ జరిపి సంపూర్ణ స్వరాజం కావాలని తీర్మానించారు. ఆ తీర్మానంలో 'కార్మికులు, రైతుల మైన మేము సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించేవరకు పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద దోపిడీ అంతం అయ్యే వరకు విశ్రమించలేము. ఈ కాంగ్రెస్ మహాసభ ఆ లక్ష్యాన్ని దేశం ముందు వుంచి తన సర్వశక్తులు ఒడ్డాలని అర్థిస్తున్నాము' అని ప్రకటించారు. భారత కార్మిక వర్గం సంపూర్ణ స్వాతంత్ర్యం గురించి, అది సభలో ఎలా స్పష్టంగా ప్రకటించిన ఏడాది తరువాత 1929 లాహోర్ మహాసభలో కాని కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్ అది కూడా మరో ఏడాది తరువాత 1930 జనవరి 26కి ప్రకటించలేక పోయింది". ("సుకోమల్‌సేన్ - భారత కార్మికోద్యమ చరిత్ర)

కార్మికవర్గ తీర్మానానికి "పూర్ణ స్వరాజ్' తీర్మానానికి ఎంత తేడా?

".......భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వం భారత ప్రజల స్వాతంత్రం గుంజుకోవడమే కాకుండా ప్రజలను దోచుకోవడం మీద కేంద్రీకరించి దేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, నైతికంగా సర్వనాశనం చేసింది. అందువలన భారతదేశం బ్రిటీష్ సంబంధాన్ని తెంచుకుని పూర్ణ స్వరాజ్యం సాధించుకోవాలని మేము తీర్మానించుకున్నాము.

"......ఇటువంటి నాలుగు రంగాల్లోనూ మా దేశాన్ని ధ్వంసం చేసిన దేశం ముందు ఇంకా ఏ మాత్రం తలొగ్గివున్నా అది మనిషికి, భగవంతుని కూడా అపరాధం చేసినట్లు అవుతుందని మేము భావిస్తున్నాము అయితే హింస పద్ధతుల ద్వారా మాత్రం కాదు. బ్రిటిష్ ప్రభుత్వానికి మేము స్వచ్ఛందంగా చేస్తున్న సహకారాలన్నిటినీ ఉపయోగించుకోవడం ద్వారా, పన్నుల నిరాకరణతో సహా శాసనోల్లంఘన ద్వారా ఇది సాధిస్తాం. ఈ అమానుష పాలన అంతం చేయడానికి కాంగ్రెస్ ఇచ్చే ప్రతి పిలు పునూ జయప్రదం చేస్తూ తద్వారా పూర్ణస్వరాజ్ సాధించుకుంటాం." ఇది క్లుప్తంగా పూర్ణస్వరాజ్ తీర్మాన సారాంశం. 1928లో కార్మికవర్గం కలకత్తాలో చేసిన తీర్మానానికి 1930 కాంగ్రెస్ పెట్టుబడిదారీ వర్గ దృక్పథంతో చేసిన తీర్మానానికి మధ్య వ్యత్యాసం స్పష్టం.

'1930-47ల మధ్య పెల్లుబికిన ఉద్యమాలు

1930 జనవరి 26 పూర్ణ స్వరాజ్ పిలుపు భారత ప్రజల్ని మరింత ఉన్నత పోరాటాలకు పురికొల్పింది. శాసనోల్లంఘన బ్రిటిష్ ప్రభుత్వాన్ని మెడలు వంచింది. బ్రిటీష్ పాలకులు చర్చల వైపు కాంగ్రెస్‌ను శాశ్వతంగా లాగేసారు. దాదాపు పన్నెండేండ్లు కాంగ్రెస్ అధికారికంగా ఎటువంటి భారీ పిలుపులివ్వలేదు. 1942 ఆగస్టులో మరల క్విట్ ఇండియా పిలుపునిచ్చే వరకు కాంగ్రెస్ అధినేతలు చర్చల్లో మునిగిపోయారు. కానీ మరోపక్క కార్మికవర్గ పోరాటాలు, రైతాంగ పోరాటాలు వెల్లువెత్తాయి. 1930 చిట్టగాంగ్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) సాయుధ తిరుగుబాటు, పున్న ప్రా-వాయిలార్ (కేరళ), తెభాగా (బెంగాల్), సుర్మావ్యాలి (అస్సాం), షోలపూర్‌లో జరిగిన రైతుల,కార్మికుల, ప్రజల తిరుగుబాటు అన్నిటికీ పరాకాష్టగా, వీరతెలంగాణ రైతాంగ సాయుధ తిరుగుబాటు, రాయల్ ఇండియన్ నేవీలో సైనికుల తిరుగుబాటుతో దేశం అట్టుడికిపోయింది. ఈ పోరాటాలన్నింటా సామ్రాజ్యవాద దోపిడీతో పాటు పెట్టుబడిదారి/ భూస్వామ్య దోపిడీ అంతం అయితేనే నిజమైన 'ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, నైతికంగా' అభివృద్ధి చెందిన పూర్ణ స్వరాజ్ సాధించగలుగుతున్నామన్న సందేశం కనబడుతుంది.

> బ్రిటీష్ పాలకులు చర్చల వైపు కాంగ్రెస్‌ను శాశ్వతంగా లాగేసారు. దాదాపు పన్నెండేండ్లు కాంగ్రెస్ అధికారికంగా ఎటువంటి భారీ పిలుపులివ్వలేదు. 1942 ఆగస్టులో మరల క్విట్ ఇండియా పిలుపునిచ్చే వరకు కాంగ్రెస్ అధినేతలు చర్చల్లో మునిగిపోయారు. కానీ మరో పక్క కార్మిక వర్గ పోరాటాలు, రైతాంగ పోరాటాలు వెల్లువెత్తాయి. 1930 చిట్టగాంగ్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) సాయుధ తిరుగుబాటు, పున్న ప్రా-వాయిలార్ (కేరళ), తెభాగా (బెంగాల్), సుర్మావ్యాలి (అస్సాం), షోలపూర్‌లో జరిగిన రైతుల,కార్మికుల, ప్రజల తిరుగుబాటు అన్నిటికీ పరాకాష్టగా, వీరతెలంగాణ రైతాంగ సాయుధ తిరుగుబాటు, రాయల్ ఇండియన్ నేవీలో సైనికుల తిరుగుబాటుతో దేశం అట్టుడికి పోయింది.

చరిత్ర చెబుతున్నది కూడా అదే !

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం 1857తో ముగిసింది. అణిచివేయబడింది. ఆ పోరాటానికి నాయకత్వం వహించింది ప్రధానంగా ఫ్యూడల్ ప్రభువులు. ప్రజలు పెద్ద ఎత్తున కదిలినా నామమాత్రం. ఈ పోరాటం ఝాన్సీ లక్ష్మీబాయి,తాంతియాతోపే వంటి నాయకత్వం వారిది. వారు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను ఓడించి తరతరాల క్రూరమైన వర్గ వ్యవస్థను ఫ్యూడల్ సంస్థానాలని నిలబెట్టుకోవాలని కోరుకున్నారు. కానీ రెండు దశాబ్దాల తరువాత భారత పెట్టుబడిదారి వర్గం నాయకత్వాన (కాంగ్రెస్ 1885) ప్రారంభమైన స్వాతంత్ర్య పోరాటం నూతన, ప్రగతిశీల, లౌకిక, ప్రజాతంత్ర దేశంగా తీర్చదిద్దబడుతుందన్న నమ్మకాన్ని ప్రజలకు అందించ కలిగింది. క్రమంగా దేశమంతా కదిలింది. కానీ ధీరోదాత్తులైన అసంఖ్యాకదేశభక్తులు కోరుకున్న విధంగా స్వాతంత్రం రాలేదు. ఆర్థిక, రాజకీయ,సాంస్కృతిక రంగాలపై విదేశీ ఆధిపత్యం పూర్తిగా తొలగలేదు. అంతేకాదు భారత పెట్టుబడిదారి వర్గం పాతకాలపు సాంఘిక వ్యవస్థను పూర్తిగా అంతం చేయలేదు. పైగా దానితో రాజీ పడింది అని ఈఎంఎస్ నంబూద్రిపాద్ రాశారు. (భారత స్వాతంత్రోద్యమ చరిత్ర)

ఇక బాధ్యత విప్లవ కార్మికోద్యమానిదే!

సామ్రాజ్యవాదం నుండి విముక్తి కోసం మొదట ఫ్యూడల్ ప్రభువుల నాయకత్వాన ఆ తరువాత పెట్టుబడిదారుల నాయకత్వాన జరిగిన స్వాతంత్రోద్యమాలు ముగిశాయి. పరాయి పాలన పోయింది. కానీ ఆ మహోన్నత ఉద్యమాలు ముందుకు తెచ్చిన స్వావలంబన, లౌకికతత్వం, సామాజికన్యాయం, జాతీయ సమైక్యత సమస్యలు శాశ్వత పరిష్కారానికి ఈ 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో కూడా నోచుకోవడం లేదు. ఏకంగా లౌకిక రాజ్యాంగాన్ని సంబరాల పేరిట రామమందిర ప్రారంభోత్సవం (జనవరి 22) నుండి మహాత్ముని వర్ధంతి (30 జన వరి) వరకు వారోత్సవాలకి మోడీ పిలుపునివ్వడం చూస్తే ఇప్పుడు మన దేశం, ప్రపంచంలోని అనేక దేశాల మాదిరిగానే పచ్చి మితవాద ఫాసిస్టు తరహా శక్తుల చేతుల్లోకి వెళ్లినట్టైంది. కార్పొరేట్ బడా పెట్టు బడి, ఫాసిస్టు హిందుత్వ శక్తుల కలయిక రాజ్యం ఏలుతున్నది. ఈ పరిస్థితులలో కార్మికవర్గ నాయకత్వాన దేశం మొత్తాన్ని నడిపించడం ద్వారా భారత సమాజాన్ని విప్లవాత్మకంగా మార్చడం ద్వారా మాత్రమే పూర్ణ స్వరాజ్యమనేది నిజంగా సాకల్యం కాగలదు. ఈ జనవరి 26 కేవలం రాజ్యాంగ దినంగా మాత్రమే కాకుండా పూర్ణ స్వరాజ్యం లక్ష్యం వైపు మళ్లించాలి. అందుకు వామపక్ష శక్తులు పూనుకోవాలి.

> మహోన్నత ఉద్యమాలు ముందుకు తెచ్చిన స్వావలంబన, లౌకిక తత్వం, సామాజిక న్యాయం, జాతీయ సమైక్యత సమస్యలు శాశ్వత పరిష్కారానికి ఈ 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో కూడా నోచుకోవడం లేదు.లౌకిక రాజ్యాంగాన్ని సంబరాల పేరిట రామమందిర ప్రారంభోత్సవం (జనవరి22) నుండి మహాత్ముని వర్ధంతి (30 జనవరి) వరకు వారోత్సవాలకి మోడీ పిలుపునివ్వడం చూస్తే ఇప్పుడు మన దేశం, ప్రపంచం లోని అనేక దేశాల మాదిరిగానే పచ్చి మితవాద ఫాసిస్టు తరహా శక్తుల చేతుల్లోకి వెళ్లినట్టైంది. కార్పొరేట్ బడా పెట్టుబడి, ఫాసిస్టు హిందుత్వ శక్తుల కలయిక రాజ్యం ఏలుతున్నది. ఈ పరిస్థితులలో కార్మిక వర్గ నాయకత్వాన దేశం మొత్తాన్ని నడిపించడం ద్వారా భారత సమాజాన్ని విప్లవాత్మకంగా మార్చడం ద్వారా మాత్రమే పూర్ణ స్వరాజ్యమనేది నిజంగా సాకల్యం కాగలదు.

దేశభక్తికి మతానికీ సంబంధం లేదు!



డాక్టర్ దేవరాజు మహారాజు

భారత స్వాతంత్ర్య పోరాటం కోసం ముస్లిం లు చేసిన త్యాగాలు ఉద్దేశ పూర్వకంగా దాచి పెట్టడం జరిగింది. ఒక్కసారి చరిత్రలోకి తొంగి చూసిన వారికి నిజాలు అవగతమౌతాయి. ఇవి దాచేస్తే దాగేవికావు. "భారత స్వాతంత్ర్యం ముస్లింల రక్తంతో రాయబడిందని, ముస్లింల జనాభా కన్నా, స్వాతంత్ర్య పోరాటంలో వారి భాగస్వామ్య శాతం ఎక్కువనీ"- ప్రఖ్యాత జర్నలిస్ట్ కుష్వంత్ సింగ్ నిర్ధారించారు. భారత స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై తొలిసారి కత్తిదూసింది హైదర్ అలీ, అతని కుమారుడు టిప్పూసుల్తాన్. 1780-90లలో ఈ తండ్రీ కొడుకులిద్దరూ బ్రిటీష్ వారితో జరిగిన యుద్ధాల్లో ఇనుముతో తయారైన మైసూరియన్ రాకెట్లు (ఇనుప గుండ్ల తోపులు) విజయవంతంగా ప్రయోగించారు. భారతదేశ చరిత్రలో ఇది తొలి ప్రయత్నం. బ్రిటీష్ వారిపై తెగించి పోరాడిన రాజు. చిట్టచివరి మొఘల్ చక్రవర్తి బహద్దూర్ షా జఫర్.



ఆయన ప్రయత్నం వల్లనే 1857లో ప్రప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి ఒక పునాది ఒక నేపథ్యం ఏర్పడింది. బాధాతప్త హృదయంతో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ బహద్దూర్ షా జఫర్ సమాధి వద్ద ఇలా రాశారు.- "ప్రప్రథమ భారత స్వాతంత్ర్య యుద్ధ స్మారక చిహ్నం ముందు నేను శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. మీరు (బహద్దూర్ షా జఫర్) భారతదేశ మీద ఇంత చోటుకి నోచుకోలేకపోయారు. కానీ, ఈ దేశ ప్రజల మనసుల్లో మీకు చోటు ఉంది. మీ పేరు చిరస్మరణీయం"-అంటూ జరిగిన తప్పిదానికి తాను క్షమాపణలు కోరుతున్నట్టుగా శ్రద్ధాంజలి ఘటించారు.

బహద్దూర్ షా జఫర్ ఏర్పరిచిన ఆ పునాదిని ఆసరాగా చేసుకుని ఆ తర్వాత మళ్ళీ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి నిర్వహించింది. మౌల్వీ అహమదుల్లా షా ఆయన పేరును కావాలని దాచేశారు. ఆ ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో అమరులయిన వారిలో 90 శాతం మంది ముస్లింలే, అన్నది కూడా ప్రాధాన్యత సంతరించుకోలేదు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నాడన్న అభియోగంతో ఇరవై ఏడేళ్ళ వయసులో ఉరికంబమెక్కిన మొట్టమొదటి అమరుడు అష్ఫాఖుల్లా ఖాన్ ఇలాంటి వారిని ఈ దేశ ప్రజలూ, ప్రభుత్వం ఎందుకు స్మరించుకోవడం లేదో ఆలోచించుకోవాలి!

> నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'ని తయారు చేశాడని అందరికీ తెలుసు, కానీ, అందులో ముఖ్య భూమికను పోషించిన కమాండర్లు-ఆఫీసర్లు అంతా ముస్లింలేనన్నది చాలా కొద్ది మందికే తెలుసు. ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఉన్న పందొమ్మిది మంది ముఖ్యమైన కమాండర్లలో - అయిదుగురు ముస్లింలే. అందులో మన హైద్రాబాద్‌కు చెందిన ఆబిద్ హెస్సేని సఫ్రానీ ముఖ్యుడు. ఎందుకంటే, 'జై హింద్' నినాదాన్ని రూపొందించింది ఆయనే. సఫ్రానీ-అంటే కాషాయరంగు. హిదువుల కాషాయాన్ని తన పేరు చివర చేర్చుకుని పరమత సహనానికి ఒక నిర్వచనంగా నిలిచిన వాడాయన! నేటి కుహనా దేశ భక్తులు 'జై హింద్' వాడుకుంటారు. కానీ, అది రూపొందించిన వాణ్ణి గుర్తించరు.

తన రాజ్యం తన దత్త పుత్రునికే సంక్రమించాలన్న పట్టుదలతో ఝాన్సీరాణి బ్రిటీష్ వారిపై యుద్ధం ప్రకటించిందని మనం చరిత్రలో చదువుకున్నాం. కానీ, అంతే వీరోచితంగా పోరాడిన బేగం హజ్రత్ మహల్ (అవధ్ రాణి)- చరిత్రలో ప్రాధాన్యత సంతరించుకోలేదు. ఇది అన్యాయం! 1857 జూన్ 30న ప్రప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో చిన్ హట్ వద్ద బ్రిటీష్ పాలకుడు సర్ హెన్రీ లారెన్‌ను తుపాకితో చంపి, బ్రిటీష్ సైన్యాన్ని చిత్తు చిత్తుగా ఓడించిన బేగం హజ్రత్ మహల్‌ను ఎందుకు కీర్తించగూడదూ? ఆమె, కేవలం ముస్లిం మహిళ అయినందుకేనా? ఆమె చూపిన తెగువకూ, శౌర్యానికీ విలువే లేదా? మనిషి విలువను మనిషే గుర్తించక పోతే ఎలా? సమాజాన్ని అంతటి హీన స్థాయికి దిగజార్చింది ఎవరూ? వారిని మనుష లనే అందామా?

భారత స్వాతంత్ర్య పోరాటం కోసం ముస్లింలు తమ మసీదులను యుద్ధ స్థావరాలుగా ఉపయోగించారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక మసీదులో ఒక ఇమామ్ స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రసంగిస్తూ ఉండగా బ్రిటీష్ సైన్యం మసీదులో ఉన్న వారిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపింది. అప్పుడు చిందిన ఆ స్వాతంత్ర్య సమరయోధుల నెత్తుటి చారల-ఎండిన మరకలు ఇప్పటికీ మనం ఆ మసీదు గోడలపై చూడొచ్చు. ముస్లింలు భారతదేశాన్ని సుమారు 300 ఏళ్ల పరిపాలించారు. ఇక్కడే బతికారు. ఇక్కడే మరణించారు. ఇది తమ స్వంత నేల అనుకున్నారు. అంతే గాని, ఇక్కడి నుంచి వారు ఏదీ కొల్లగొట్టుకుని పో లేదు. అలా కొల్లగొట్టుకుని పోయే పని బ్రిటీష్ వారు చేశారు. డచ్ వారు, ఫ్రెంచ్ వారు చేశారు. నిజా యితీ పరులు రాసిన చరిత్ర చదివితే నిజాలు తెలు స్తాయి. మొఘలులు ఇక్కడి చిన్న చిన్న రాజ్యాలను ఐక్యం చేసి, విశాలమైన ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించారు. విద్య, సాహిత్యం, కళలు, భవన నిర్మాణ రంగాల్లో దేశాన్ని తలమానికం చేశారు. న్యాయ, రాజకీయ, పరిపాలనా నిర్వహణ వ్యవస్థల్ని అభివృద్ధి చేశారు.

> భారత స్వాతంత్ర్య పోరాటం కోసం ముస్లింలు తమ మసీదులను యుద్ధ స్థావరాలుగా ఉపయోగించారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక మసీదులో ఒక ఇమామ్ స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రసంగిస్తూ ఉండగా బ్రిటీష్ సైన్యం మసీదులో ఉన్న వారిపై నిర్దాక్షి ణ్యంగా కాల్పులు జరిపింది. అప్పుడు చిందిన ఆ స్వాతంత్ర్య సమర యోధుల నెత్తుటి చారల-ఎండిన మరకలు ఇప్పటికీ మనం ఆ మసీదు గోడలపై చూడొచ్చు. ముస్లింలు భారతదేశాన్ని సుమారు 300 ఏళ్లు పరిపాలించారు. ఇక్కడే బతికారు. ఇక్కడే మరణిం చారు. ఇది తమ స్వంత నేల అనుకున్నారు. అంతే గాని, ఇక్కడి నుంచి వారు ఏదీ కొల్లగొట్టుకుని పోలేదు. అలా కొల్లగొట్టుకుని పోయే పని బ్రిటీష్ వారు చేశారు.

న్యూఢిల్లీలోని ఇండియా గేట్ మీద 95,300 మంది సమరయోధుల పేర్లు రాయబడి ఉంటే, అందులో 61,945 మంది పేర్లు ముస్లిం యోధులవే! ఈ విషయాన్ని అందరూ గమనించాలి. ఇందులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకుల, వ్యాపార దిగ్గజాల పుర్వీకుల పేర్లు ఎవరివీ లేవు- అనేది కూడా గుర్తుంచుకోవాల్సిన విషయం! తమిళనాడులో ఇస్మాయిల్ సాహెబ్- మరుదానాయగం అనే ఇద్దరు వ్యక్తులు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా నిరంతరం ఏడు సంవత్సరాలు పోరాడారు. చివరికి వారి పేరు వింటేనే బ్రిటీష్ వారికి చెమటలు పట్టేవి. బ్రిటీష్ వారు అంతగా హడలెత్తి పోయారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా, బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా ఓడ నడిపిన మొట్టమొదటి నావికుడు-కప్పలో తియ తమిల్ జన్ (VOC). ఇతని గురించి కొంత మందికి తెలిసి ఉంటుంది. కానీ, అతను నడిపిన ఓడను విరాళంగా ఎవరిచ్చారో చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. అంత విలువైన ఓడను దేశం కోసం విరాళంగా ఇచ్చింది. ఫకీర్ మహ్మద్ రౌథర్. ఇకపోతే, ఈ కప్పలో తియ తమిల్ జన్ అరెస్ట్ అయినప్పుడు, అతణ్ణి విడుదల చేయాలని ఒక స్వాతంత్ర్య సమర యోధుడు ధర్నా చేశాడు. అతని పేరు మహ్మద్ యాసీన్. ధర్నా చేసి నందుకు మహ్మద్ యాసీన్‌ను బ్రిటీష్ సైనికులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. పోరాటంలో ప్రాణాలు త్యాగం చేయ్యటం ముస్లిం యోధులకు తెలుసు. వారికి ఎవరూ దేశభక్తి గురించి ఉప న్యాసాలిచ్చే అవసరం లేదు. తిరుప్పూర్ (కోడికట) కుమారన్ స్వాతంత్ర్య పోరాటంలో అరెస్టయ్యాడు. ఆయనతో పాటు, అబ్దుల్ లతీఫ్, అక్బర్ అలీ, మొహిద్దీన్ ఖాన్, అబ్దుల్ రహీం, వావు సాహెబ్,(మరో) అబ్దల్ లతీఫ్, షేక్ బాబా సాహెబ్ - అనే మరో ఏడుగురు స్వాతంత్ర్య యోధులు కూడా అరెస్టయ్యారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'ని తయారు చేశాడని అందరికీ తెలుసు, కానీ, అందులో ముఖ్య భూమికను పోషించిన కమాండర్లు-ఆఫీసర్లు అంతా ముస్లింలేనన్నది చాలా కొద్దిమందికే తెలుసు. ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఉన్న పందొమ్మిది మంది ముఖ్యమైన కమాండర్లలో - అయిదుగురు ముస్లింలే. అందులో మన హైద్రాబాద్‌కు చెందిన ఆబిద్ హెస్సేని సఫ్రానీ ముఖ్యుడు. ఎందుకంటే, 'జై హింద్' నినాదాన్ని రూపొం దించింది ఆయనే. సఫ్రానీ-అంటే కాషాయరంగు. హిందువుల కాషాయాన్ని తన పేరు చివర చేర్చుకుని పరమత సహనానికి ఒక నిర్వచనంగా నిలిచిన వాడాయన! నేటి కుహనా దేశ భక్తులు 'జై హింద్' వాడుకుంటారు. కానీ, అది రూపొందించిన వాణ్ణి గుర్తించరు. పైగా ముస్లింల ఇళ్ళ పైకి డబులింజన్ బుల్‌డోజర్లు తోలుతారు? అదేం దేశ ప్రేమ? నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఛీఫ్ కమాండరే ఒక ముస్లిం! ఆయన పేరు షా నవాజ్ ఖాన్ !!

మోమన్ అబ్దుల్ హబీబ్ యూసుఫ్ మార్ఫానీ అనే అతను తన యావదాస్తి నేతాజీ ఇండియన్ నేష నల్ ఆర్మీకి దానం చేశాడు. ఆ రోజుల్లోనే ఆ ఆస్తి విలువ కోటి రూపాయలకన్నా ఎక్కువ. ఇప్పటి లెక్క ల్లో అయితే ఎన్ని బిలియన్లవుతాయో? ఆ రోజుల్లోనే యం.కె.యం. అమీర్ హంజా ఎన్నో లక్షల రూపాయలు నేతాజీ ఆర్మీకి విరాళంగా ఇచ్చాడు. ఆయన కుటుంబీలు తర్వాత కాలంలో నిరుపేదలుగా బతికారు. తమిళనాడు -రామనాథపురంలో చిన్న అద్దె ఇంట్లో నానాయతనా అనుభవించారు. బీవమ్మ - అనే ఒక ముస్లిం తల్లి బిడ్డల కోసం దాచిపెట్టకుండా తనకున్న ముప్పయి లక్షల ఆస్తిని భారత స్వాతంత్ర్య పోరాటం కోసం విరాళంగా ఇచ్చింది. వీరివి త్యాగాలు కావు. వీరిది దేశభక్తి కాదు.వీరిని వీరి త్యాగ నిరతిని ఎవరూ గుర్తుచేసుకోగూడదు. హిందూత్వ పేరుతో ఈ రోజుల్లో జై శ్రీరామ్ నినాదాలిచ్చే వారిదే దేశభక్తి. వారే దేశ ప్రేమికులు మనం వాళ్లలో చేరి చెవుల్లో కమలాలు పెట్టుకుంటేనే మన ప్రాణాలకు రక్షణ ఉంటుంది. మిత్రో-

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఈ దేశంలో పుట్టిన ఒక గొప్ప మేధావి. స్వాతంత్ర్య పోరాట కాలంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో సీనియర్ ముస్లిం నాయకుడు. గాంధీజీతో పాటు సారా వ్యతిరేకోద్యమంలో పాల్గొన్నవాడు. ఆ ఉద్యమంలో ఉన్న 19 మందిలో 10 మంది ముస్లింలే. తర్వాత కాలంలో స్వతంత్ర్య భారతదేశంలో తొలి విద్యామంత్రి అబ్దుల్‌కలాం ఆజాదే! 'ఆజాద్' (స్వేచ్ఛ) కలం పేరుతో పలు రచనలు చేసిన రచయిత ఈయనే! 1940-45 ప్రాంతంలో 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. సెక్యులరిజం స్థాపన కోసం, దేశంలో హిందూ-ముస్లింల ఐక్యత కోసం అహరహం కృషి చేసినందుకు- మరణా నంతరం ఈయనకు 'భారతరత్న' బిరుదునిచ్చి భారత ప్రభుత్వం గౌరవించుకుంది.

మనువాదులైన హిందూమత దురభిమానులు, జాత్యహంకారులు చాలా నిజాల్ని దాచేస్తున్నా తరుణంలో-వాస్తవాల్ని వక్రీకరిస్తున్న తరుణంలో-వచ్చే తరాలకు నిజాలు తెలియకుండా పాలకులే కుట్రలు చేస్తున్న తరుణంలో-బాధ్యతగల పౌరులంతా వివేకంతో వ్యవహరించాల్సి ఉంది. నిజాలకు మసిపూసి మారెడు కాయలు చేయడం ఎంత మాత్రమూ దేశ భక్తి కాదని చెప్పాల్సి ఉంది. నిజాల్ని నిర్భయంగా చెపుతూ ఉండడమే, ప్రచారంలో ఉంచడమే అన్నింటినీ మించిన దేశభక్తి. మతానికీ దేశభక్తికి సంబంధం లేదు. ఏదో ఒక మతస్థులే దేశభక్తులని, ఇతర మతస్థులంతా దేశద్రోహులని-ఈనాటి ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ప్రజలంతా సమైక్యంగా తిప్పి కొట్టాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితి త్వరలో మారనుంది. ఎందుకంటే, డిసెంబర్ 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో-3 రాష్ట్రాల్లో బీజేపీకి వచ్చిన మొత్తం ఓట్ల కన్నా, కాంగ్రెస్ కు వచ్చిన ఓట్ల సంఖ్య ఎక్కువ!

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత,
జీవశాస్త్ర వేత్త, (మెల్బోర్న్ నుంచి)

స్వేచ్ఛ...!



తెరపై బొమ్మలే దేవుళ్ళంటే...
ఉరికొయ్యల్ని ముద్దాడేవారా!

అబలల్ని హరించడమే స్వేచ్ఛ అంటే..
మానాభిమానాల్ని బలిచ్చేవారా!
కులానికే గులాములంటే..
కులమత ప్రాంతాలు వదిలి కదిలే వారా!
అవినీతి ధనదాహం కుటీర పరిశ్రమలై
వర్థిల్లతాయంటే..
సర్వస్వాల్ని త్యజించి పోరాడుండే వారా!

రాజకీయాలు ఎన్నికలు పదవులు
విషవలయంలో అస్తిత్వం పోయి..
కొత్త బానిసత్వంలోకి జారిపోతామంటే..
మనకోసం! మువ్వన్నెల జెండా చేత పట్టి
దమననీతి సామ్రాజ్యవాదుల చేతుల్లో
వినడానికే వణుకు పుట్టే మరణాలతో
వాళ్ళు అమరులయ్యేవారా...!?

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

రాష్ట్రాభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్

- మూసీ పొడుగునా వ్యాపార, వాణిజ్య కేంద్రాలు
- పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాన్ని నాటికి పారిశ్రామికంగా 2050 నాటికి అభివద్ధి పథకంలో పరుగులు పెట్టించేందుకు మెగా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్టు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం సీఐఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 55 కిలోమీటర్ల మేర మూసీ నది రివర్ ఫ్రంట్ అభివృద్ధి బాధ్యతలను హెచ్ఎండీఏకు అప్పగించామని తెలిపారు. మూసీ పొడుగునా అమ్యూజ్‌మెంట్ పార్కులు, జలపాతాలు, వాటర్ స్పోర్ట్స్, వ్యాపార, వాణిజ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్య పద్ధతిలో షాపింగ్ మాల్స్‌ను నిర్మిస్తామని వివరించారు. ఫలితంగా నదీ పరివాహక ప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిడంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ ప్రాజెక్టును పారదర్శకంగా చేపట్టడానికి అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. టూరిజం, వినోదం, ఆతిథ్య రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి పలు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకునే దిశగా వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, సీఐఐ తెలంగాణ చైర్మెన్ సీ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మెన్ సాయి డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

34 మందికి పద్మశ్రీ అవార్డులు

- అందులో ముగ్గురు తెలుగువాళ్లు

చిరంజీవి, వెంకయ్య నాయుడుకు పద్మవిభూషణ్

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం 34 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. తెలంగాణకు చెందిన బుర్ర వీణ వాయిద్యకారుడు దాసరి కొండప్ప, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యని, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన హరికథ కళాకారిణి ఉమామహేశ్వరిని పద్మశ్రీ అవార్డు వరించింది. అలాగే కళలు విభాగంలో బిహార్ కు చెందిన భార్యాభర్తలు శాంతిదేవి పాశ్వాన్, శివన్ పాశ్వాన్ ను, త్రిపురకు చెందిన చక్మా రేఖాకు కేంద్రం పద్మశ్రీని ప్రకటించింది.



దాసరి కొండప్ప గురించి....

దాసరి కొండప్ప (బుర్ర వీణకు సంరక్షకుడు) చివరి బుర్ర వీణ వాద్యకారులలో ఒకరు. తన జీవితాన్ని స్వదేశీ కళకు అంకితం చేశారు. నారాయణపేటలోని దామరగిద్ద గ్రామానికి చెందిన మూడో తరం బుర్ర వీణ వాద్యకారుడు కళారూపాల పరిరక్షణకే తన జీవితాన్ని అంకితం చేశారు. బుర్ర వీణకు చివరి ఘాతాంకారంగా నిలిచి దానిని అంతరించిపోకుండా కాపాడారు. తెలుగు, కన్నడ భాషల్లో తత్వాలు సామాజిక-మతపరమైన నైతిక కూర్పులు, ఆధ్యాత్మిక-తాత్విక వివరణలు పాడారు. బుర్ర వీణ అనేది వెదురు, పొట్లకాయ పెంకు, లోహపు తీగలను ఉపయోగించి రూపొందించబడిన స్వదేశీ తీగ వాయిద్యం. బుర్ర వీణ ఆచారం వారి స్వంత కమ్యూనిటీలో వాయించడమే, కానీ దాసరి విస్తృత ప్రేక్షకులను ఆకర్షించడానికి మించిపోయారు.



గడ్డం సమ్మయ్య గురించి...

గడ్డం సమ్మయ్య (యక్షగానం యజ్ఞం) ఐదు దశాబ్దాలుగా చిందు యక్షగానం ప్రదర్శనలో సామాజిక సమస్యలను హైలైట్ చేశారు. జనగాంకు చెందిన ప్రముఖ చిందు యక్షగానం థియేటర్ ఆర్టిస్ట్, ఐదు దశాబ్దాలకు పైగా 19,000 ప్రదర్శనలలో ఈ గొప్ప వారసత్వ కళారూపాన్ని ప్రదర్శిస్తున్నారు. సంపూర్ణ అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక సమస్యలను ప్రస్తావిస్తారు. ఈ కళను ప్రోత్సహించేందుకు చిందు యక్ష కళాకారుల సంఘం, గడ్డం సమ్మయ్య యువ కళా క్షేత్రం స్థాపించారు. నిరాడంబరమైన నేపథ్యం నుండి వచ్చిన అతను వ్యవసాయ కూలీగా పని చేస్తూ చిందు యక్షగానం కళాకారులైన తన తల్లిదండ్రుల నుంచి కళారూపాన్ని నేర్చుకున్నారు.



ప్రముఖ సినీ నటుడు చిరంజీవి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు ఐదుగురిని కేంద్రం పద్మవిభూషణ్‌తో గౌరవించింది.

కొడతామంటే కాంగ్రెస్ కార్యకర్తలు చేతులు ముడుచుకోరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నాయకులు బట్టలూడదీసి కొడతామంటే కాంగ్రెస్ కార్యకర్తలు చేతులు ముడుచుకొని లేరని, వారు కన్నెర్ర చేస్తే రాష్ట్రంలో టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ మిగలదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరించారు. గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ లెవెల్ కన్వీనర్ల శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను ప్రజాస్వామ్యయుతంగా గౌరవించాలనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదనీ, దీనిని చేతగాని తనంగా భావిస్తే తమ తడాఖా ఏంటో కూడా చూపిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీల అమలు, ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం తెస్తామన్న వాగ్దానాన్ని నమ్మిన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమల్లోకి తెచ్చామనీ, మిగిలిన వాటి అమలు కోసం కసరత్తు జరుగుతోందని చెప్పారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీకి వ్యతిరేకంగా మతసామరస్యాన్ని కాపాడేందుకు యాత్రలు చేస్తున్న రాహుల్ గాంధీకి 15 సీట్లు గెలిపించి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశాన్ని పాలించే అర్హత, శక్తి కాంగ్రెస్ పార్టీకే తప్ప మరే ఇతర పార్టీలకు లేవన్న సందేశాన్ని కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

కేసీఆర్ కాస్కో..వస్తున్నా...

ఇది ఇంటర్వెల్ మాత్రమే అసలు సినిమా ముందుంది

- రాష్ట్రాన్ని బీఆర్ఎస్ విధ్వంసం చేసింది....పునర్‌నిర్మించే మేస్త్రీని నేనే
- చార్లెస్ శోభారాజ్ బయటకు రావాలి
- ఫిబ్రవరి మొదటివారంలో మరో రెండు గ్యారంటీల అమలు : సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రాజకీయాలు మాట్లాడొద్దనుకున్నా...కానీ మాట్లాడకపోతే పని అయ్యేటట్టు లేదని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కాస్కో...వస్తున్నా... అంటూ సవాల్ విసిరారు. 'వారంలో మూడు రోజులు మీ రేవంతన్నగా మీ మధ్యకు వస్తా. అసెంబ్లీ ఎన్నికల్లో బిల్లా రంగాల (కేటీఆర్, హరీశ్‌రావు)కు బుద్ధి చెప్పాం. ఈ ఎన్నికల్లో పొలిమేరలు దాటేదాకా తరుముదాం' అని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇది ఇంటర్వెల్ మాత్రమే, ఇంద్రవెల్లి వేదిక నుంచి అసలు సినిమా మొదలవుతుందని హెచ్చరించారు. బిల్లా, రంగాలు కాదు చార్లెస్ శోభారాజ్ (కేసీఆర్) ఇంటి నుంచి బయటకు రావాలన్నారు. అదిగో పులి వస్తుందంటూ బిల్లా రంగాలు చెబుతున్నారనీ, పులి బయటకు వస్తే వెళ్లేది బోనులోకేనని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్టేనని ఎద్దేవా చేశారు. 'మోడీని ఓడిదాం...రాహుల్‌ను ప్రధాన మంత్రిని చేద్దాం' అని చెప్పారు. కొన ఊపిరితో ఉన్న బీఆర్ఎస్‌ను బొంద పెడతామన్నారు. మాట్లాడితే తమను మేస్త్రీ అంటూ విమర్శలు చేస్తున్నారని వాపోయారు. 'బిడ్డా.. నేను మేస్త్రీనే... మీరు విధ్వంసం చేసిన తెలంగాణను పునర్ నిర్మించే మేస్త్రీని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చి వారి భవిష్యత్తును నిర్మించే మేస్త్రీని తెలంగాణను దోచుకున్న బీఆర్ఎస్‌ను బొందపెట్టి, ఘోరీ కట్టే మేస్త్రీనే' అంటూ ఘాటూగా విమర్శించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రకు బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. అక్కడ మోడీకైనా, ఇక్కడ కేడీకైనా బుద్ధి చెప్పేది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. గోల్కొండ కోటపై మువ్వన్నెల జెండా ఎగరేసామనీ, ఇక ఎర్రకోటపై ఆ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 14 సీట్లను గెలుచుకోవాలన్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో ఇంకో రెండు హామీలను అమలు చేయబోతున్నట్టు రేవంత్ ప్రకటించారు. 3,650 రోజులు పాలించిన బీఆర్ఎస్...రాష్ట్రాన్ని దివాళా తీయించిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. దద్దమ్మలారా? మీరా? మమ్మల్ని ప్రశ్నించేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. అయినా తమను ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు రాష్ట్రంలోని 63 లక్షల రైతుల ఖాతాలకు రైతు భరోసా నగదును బదిలీ చేస్తామన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర ప్రభావంతో కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. దేశంలో త్యాగం అంటే గాంధీ కుటుంబానిదేనని చెప్పారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆ కుటుంబం ప్రాణాలను సైతం అర్పించిందని గుర్తు చేశారు. పదవులను త్యాగం చేసిన ఘనత సోనియా, రాహుల్ గాంధీకే దక్కిందన్నారు. బీజేపీ నాయకులు అఖండ భారత్ అంటున్నారనీ, గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలు ఇచ్చినప్పుడు బీజేపీ నేతలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. సొంత ఇల్లు లేని గాంధీ కుటుంబానికి అవినీతి మరకలు అంటించాలని చూస్తారా? అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబాన్ని అవమానించిన బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీతో కాంగ్రెస్ యుద్ధం చేస్తుంటే, సందట్లో సడేమియాలాగా బిల్లా-రంగాలు వీధుల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి యాభై రోజులు కాలేదు.. అప్పుడే హామీలు అమలు చేయడం లేదని విమర్శిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని రేవంత్ ఈ సందర్భంగా చెప్పారు. సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బూత్ స్థాయిలో ఎక్కువ ఓట్లు వేయించిన అచ్చిపతిరావు (ఖానాపూర్), రమేష్ (మధిర), మురళీధర్ (నాంపల్లి), ఆషీఫ్ (రామగుండం) తదితరులను రేవంత్ సన్మానించారు. మెమొంటో అందజేశారు.

భారత ప్రజాస్వామ్యం ప్రాచీనమైనది!

న్యాయ క్రమం పట్ల విశ్వాసానికి ప్రతీక రామ మందిరం

- యువతకు అపార అవకాశాలు
- మహిళా సాధికారతతో మరింత మెరుగైన పాలన
- భారత గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జాతి నుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం

న్యూఢిల్లీ : భారతదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ పాశ్చాత్య దేశాల్లోని ప్రజాస్వామ్య భావన కన్నా చాలా ప్రాచీనమైనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అందువల్లే భారత్‌ను 'ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి'గా పిలుస్తారని అన్నారు. భారత రాజ్యాంగం ముందు పీఠికలోనే 'మనం, భారత ప్రజలం' అని ప్రారంభమవుతుందని, దాంతోనే మన రాజ్యాంగ స్వభావం స్పష్టంగా తేటతెల్లమవుతుందని అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా గురువారం జాతినుద్దేశించి ఆమె ప్రసంగిస్తూ ప్రజలకు శుభాకాక్షలు తెలియచేశారు. జీ-20 సదస్సు, అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం, మహిళా సాధికారత వంటి పలు అంశాలను ఆమె తన ప్రసంగంలో ప్రస్తావించారు.

తన సేవల ద్వారా ప్రజా జీవితాన్ని మరింత పరిపుష్టం చేసిన, భారత రత్నను ప్రకటించిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాకూర్‌కు ఘనంగా నివాళి అర్పించారు. న్యాయ ప్రక్రియ మొత్తంగా పూర్తయిన అనంతరం ఇటీవల అయోధ్యలో జరిగిన రామ మందిర ప్రారంభోత్సవంతో ప్రజల విశ్వాసానికి తగిన వ్యక్తీకరణను ఇవ్వడమే గాకుండా, న్యాయ క్రమం పట్ల ప్రజలకు గల అచంచలమైన విశ్వాసానికి కూడా ప్రతీకగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని విశాల దృక్పథంతో చూసినపుడు, పునరావిష్కృతమవుతున్న భారతదేశ నాగరికత వారసత్వానికి మైలురాయిగా భవిష్యత్ చరిత్రకారులు దీన్ని పరిగణిస్తారని అన్నారు.

చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించడంతో ఆదర్శప్రాయమైన లింగ సమానత్వం దిశగా దేశం పురోగతి సాధిస్తోందని ముర్ము చెప్పారు. నారీ శక్తి వందన్ అధినియం మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన సాధనంగా నిరూపించబడుతుందని తాను నమ్ముతున్నట్టు చెప్పారు. మన పాలనా ప్రక్రియలను మెరుగుపరచడంలో కూడా ఇది దోహదపడుతుందన్నారు. సామూహిక ప్రాముఖ్యత కలిగిన అంశాల్లో మరింతమంది మహిళలు పాల్గొన్నపుడు ప్రజల అవసరాలకు మరింత అనుగుణంగా మన పాలనాపరమైన ప్రాధాన్యతలు వుంటాయని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ఇటీవలి సంవత్సరాల్లో ప్రధాన ఆర్థిక వ్యవస్థలను పరిశీలించినట్లైతే మన జీడీపీ వృద్ధిరేటు అన్నింటికంటే అధికంగా వుందన్నారు. ప్రస్తుత, రాబోయే సంవత్సరాల్లో కూడా ఈ పనితీరు ఇలాగే కొనసాగుతుందని నమ్మడానికి అనేక కారణాలు వున్నాయన్నారు. 'అమృత్ కాల్'లో అనూహ్యమైన సాంకేతిక మార్పులు జరుగుతాయన్నారు. కృత్రిమ మేథ, మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతిక చొరవలు మన రోజువారీ జీవితాల్లో భాగం కానున్నాయన్నారు. భవిష్యత్తులో ఆందోళన రేకెత్తించే అనేక రంగాలు వున్నాయని, అలాగే అపారమైన అవకాశాలు కూడా ముఖ్యంగా యువతకు ముందున్నాయన్నారు.

సూర్యుడిపై, చంద్రుడిపై చారిత్రక మిషన్‌లతో రోదసీ రంగంలో భారత్ తనదైన ముద్రను వేసిందని రాష్ట్రపతి ప్రశంసించారు. ఇటీవల ముగిసిన జీ-20 సదస్సు ప్రపంచ పేద దేశాల వాణిగా భారత్ ఆవిర్భావాన్ని నొక్కి చెప్పిందన్నారు. నూతనోత్తేజంతో, మరింత ఇనుమడించిన విశ్వాసంతో మన క్రీడాకారులు పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణులు పతకాలు తీసుకురావడం సంతోషంగా వుందన్నారు. ఈ సందర్భంగా గతేడాది ఆసియా క్రీడల్లో భారత్ పతకాలు పట్టికను ప్రస్తావించారు.అందులో 46 పతకాలు కేవలం మహిళా అథ్లెట్లే తీసుకు వచ్చారన్నారు. డిజిటల్ అంతరాన్ని తొలగించడంపై నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) తగిన దృష్టి పెట్టాలని కోరారు.

రాజకీయ పునరావాస కేంద్రంగా రేవంత్ ప్రభుత్వం



(మొదటిపేజీ తరువాయి)

వస్తే ఢిల్లీ నుంచే పరిపాలన సాగుతుందంటూ తాము గతంలోనే చెప్పామనీ, ఇప్పుడదే జరుగుతోందని వ్యాఖ్యానించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్... మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రైతు భరోసా గురించి దావోస్‌లో సీఎం అబద్ధాలు చెబితే... ఇక్కడ మంత్రులు రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతామంటూ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సీఎంతోపాటు కాంగ్రెస్ నేతలందరూ రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రేవంత్ తన 45 రోజుల పరిపాలనలో సాధించింది కేవలం ఢిల్లీకి పోవటమేనని ఎద్దేవా చేశారు. ప్రస్తుతమున్న సీఎం క్యాంపు కార్యాలయా(ప్రగతి భవన్-ఇప్పుడు ప్రజా భవన్)న్ని పక్కనబెట్టి, కొత్తగా ఎందుకు కడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని చెబుతూనే, సీఎం కోసం నూతన క్యాంపు ఆఫీసు కడుతున్నారని విమర్శించారు. కేవలం బేషజాల వల్లే రేవంత్... ప్రగతి భవన్‌ను వాడటం లేదని అన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి మారినప్పుడల్లా కొత్తవి కట్టుకుంటూ పోతే ఎలా..? అని ప్రశ్నించారు. అవసరం లేని భవనాలు కట్టడానికి సీఎంకు డబ్బులుంటాయి గానీ, రైతుబంధుకు ఉండవా..? అని నిలదీశారు. ఒకప్పుడు ప్రభుత్వ సలహాదారులు వద్దంటూ చెప్పిన రేవంత్, ఇప్పుడు రాజకీయ నిరుద్యోగులను సలహాదారులుగా నియమించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంస్థలు, కంపెనీల వల్ల సామాజిక న్యాయం, సమానత్వం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండబోవంటూ డిప్యూటీ సీఎం భట్టి చెబుతుండగా, అందుకు భిన్నంగా దావోస్ వేదికల మీద సీఎం వివిధ ఎమ్ఎన్‌సీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ రకంగా సీఎం, డిప్యూటీ సీఎం పరస్పర విరుద్ధంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

కాంగ్రెస్‌లో ఒకాయనేమో నేనే నెంబర్ 2 అంటారు, డిప్యూటీ సీఎం భార్యేమో... మిగతా వారిని పారాష్యూట్ లీడర్లు అంటూ మాట్లాడుతుంది, ఇంకొకాయన పార్టీలో నా మాటే చెల్లుతుందని అంటారు, ఈ రకంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వైరుధ్యాల మధ్య కొనసాగుతోందని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారు ప్రజల దృష్టిని ఎన్ని రకాలుగా మరల్చేందుకు ప్రయత్నించినా, ఆ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేసేదాకా వెంటపడతామని ఆయన హెచ్చరించారు.

రేపటి నుంచి 'అసెంబ్లీ' సన్నాహక సమావేశాలు

పార్లమెంటు స్థానాల వారీగా సన్నాహక సమావేశాలను విజయవంతంగా పూర్తి చేశామని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. శనివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలపై సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఎంపీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. త్వరలో 30 వేల మంది సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించబోతున్నామని వివరించారు. రాష్ట్రంలో 9 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, వారి కుటుంబాలను పార్టీ తరపున ఆదుకుంటామని చెప్పారు. ఆటోడ్రైవర్ల సమస్యలపైనా, కేఆర్ఎంబీ అంశంపైనా అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా వీటిపై సర్కారును నిలేస్తామని చెప్పారు. కేఆర్ఎంబీపై అఖిలపక్షాన్ని వేయాలని కోరారు. ఫార్మాసిటీ, ఎయిర్‌పోర్టు వరకూ మెట్రో రద్దు... తదితరాంశాలపై ఏం జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. వాటిపై కనీసం క్యాబినెట్‌లో కూడా చర్చించలేదన్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ... కేసీఆర్‌పైన కుట్ర పన్నేందుకు జతకడుతున్నాయని వాపోయారు. అందులో భాగంగానే బండి సంజయ్ పలు రకాల వ్యాఖ్యలు చేస్తున్నారనీ, రేవంత్... అదానీతో జతకట్టారని ఆందోళన వ్యక్తం చేశారు.

శివబాలకృష్ణ కేసుతోఆ మాజీ మంత్రికి షాక్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్, రెరా కార్యదర్శి శివబాలకృష్ణ ఏసీబీకి పట్టుబడటంతో పురపాలక శాఖ వణుకుతోంది. ఆయా శాఖల్లో పనిచేసే అధికారులకు కంటిమీద కునుకు కరువైనట్టు సమాచారం. పరోక్షంగా సంబంధాలు ఉన్న మాజీ మంత్రి, మరో ఐఏఎస్ అధికారికి ఒకింత గుబులు పట్టుకున్నట్టు తెలిసింది. కీలక అధికారిగా బాధ్యతలు నిర్వహించిన బాలకృష్ణ ఇంట్లో దాదాపు రూ. 500 కోట్ల మేర ఆస్తుల పత్రాలు, ఇతరాలు దొరకడంతో ఏసీబీ అప్రమత్తమైనట్టు తెలిసింది. ఒక డైరెక్టర్ ఇంట్లోనే భారీ మొత్తం దొరకడంతో, ఈ వ్యవహారంతో ఇంకా చాలా మందికి లింకులు ఉండే అవకాశాలు లేకపోలేదనే కోణంలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) విచారణ చేసే అవకాశ మున్నట్టు సమాచారం. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ మాజీ మంత్రి ఇప్పుడు ఏసీబీ వ్యవహారం తమవైపు తిరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే పనిలో ఉన్నట్టు వినిపిస్తున్నది. బీఆర్ఎస్ సర్కారులోని మంత్రులతో లింక్ పెట్టుకున్న ఒక ప్రముఖ రియాల్టీ సంస్థ దాదాపు 100 ప్రాజెక్టులు తీసుకుని, 50 కూడా పూర్తిచేయలేకపోయిందనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు పాత సర్కారులో అన్నీ తానై వ్యవహరించిన ఆ మంత్రి అండదండలే కారణమని తెలిసింది. సదరు కంపెనీకి ఆ మాజీ మంత్రి ఆదేశాల మేరకే రెరా నుంచి శివబాలకృష్ణ ఆపన్నహస్తం అందించినట్టు తెలిసింది.ఈమేరకు మంత్రికి రియాల్టీ సంస్థ భారీగానే ముడుపులు సమర్పించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఆ మంత్రితో శివబాలకృష్ణకు తత్సంబంధాలు ఉన్నాయని తెలిసింది. ఏసీబీ ఆ కోణంలో విచారణ చేసే అవకాశమందని సమాచారం. రియల్ఎస్టేట్ కంపెనీ నిర్మించే ప్రాజెక్టులకు అనుమతులు త్వరితగతిన మంజూరు చేయడంలో ఇటు హెచ్ఎండీఏతోపాటు రెరాలో కార్యదర్శిగా ఉన్న శివబాలకృష్ణ సహకరించినట్టు సమాచారం. ఆమేరకు ఏసీబీ కీలక సమాచారం రాబట్టిందనే ప్రచారం జరుగు తున్నది. అయితే సంబంధిత మాజీ మంత్రి జోలికి ఇప్పట్లో ఏసీబీ వెళ్లే అవాశం లేదనీ,పూర్తి సాక్ష్యాధారాలు సేకరించాకే ఏమీ చేయాలనే అంశంపై ఆలోచించ నున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా మరో ఐఏఎస్ అధికారికి సైతం శివబాలకృష్ణతో సంబంధాలు ఉన్నాయనే గుసగుసలు సంబంధిత శాఖలో చోటుచేసుకుంటున్నాయి.

వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లోని కాంటాక్ట్ కార్మికులకు రెండు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఏడో తేదీ లోపు జీతాలివ్వాలని చట్ట నిబంధనలున్నా.. కాంట్రాక్టర్, రైల్వే యాజమాన్యం పట్టించుకోవడంలేదని విమర్శించారు. జీతాలు సమయానికి రాకపోవడం మూలంగా కార్మికులు ఇంటి కిరాయిలు, స్కూల్ ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యావసర సరుకులు కూడా కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యూటీకి రావటానికి కూడా బస్సు చార్జీలు పెట్టలేని దుస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలంతా కష్టపడి పని చేసి జీతాల కోసం అడుక్కోవటమేంటని ప్రశ్నించారు. గతంలో హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో 150 మంది పని చేసేవారనీ, ఇప్పుడు కేవలం 60 మందితో పని చేయిస్తూ కార్మికుల శ్రమను యాజమాన్యం దోచుకుంటుందని విమర్శించారు. పని భారం పెరగటం తో కార్మికులు అనేక రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం, కాంట్రాక్టర్ స్పందించి రెండు నెలల బకాయి వేతనాలు ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెల ఏడో తేదీ లోపు జీతాలు చెల్లించాలనీ, పని భారం తగ్గించాలనీ, కార్మికులకు పే స్లిప్స్ ఇవ్వాలనీ, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే.. రాబోయే కాలంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీఐటీయూ నాంపల్లి జోన్ కన్వీనర్ సి. మల్లేష్, హైదరాబాద్ రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతులు గౌడ్, నాయకులు కవిత, సాజిదా, హైమ, శైలజ తదితరులు పాల్గొన్నారు.


'కారు'చౌకగా కోకాపేట భూమి

- ఆ పిటిషన్‌కు నెంబర్ కేటాయించండి
- రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ సీఎంగా ఉండగా అత్యంత ఖరీదైన భూమిని అధికారపార్టీకి కేటాయించారంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు రిజిస్ట్రీ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. పిటిషన్ విచారణ అర్హతపై గురువారం న్యాయస్థానం విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ చేసిన వాదనల తర్వాత సంబంధిత పిటిషన్‌కు నెంబర్ కేటాయించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ జె.అనిల్ కుమార్‌ల డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

గండిపేట మండలం కోకాపేట గ్రామంలోని 239, 240 సర్వే నెంబర్లల్లోని 11 ఎకరాల భూమిని బీఆర్ఎస్ పార్టీకి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ వెంకట్రామిరెడ్డి పిల్ దాఖలు చేశారు. ఎకరం వంద కోట్ల రూపాయల విలువైన 11 ఎకరాల భూమిని కేవలం రూ.34.41



కోట్లకే బీఆర్ఎస్‌కు కేటాయించారని ప్రభాకర్ తెలిపారు. అధికారంలో ఉన్న కారణంగానే అధికారపార్టీకి భూకేటాయింపు చేసుకున్నారని ఆయన చెప్పారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జరిగిన భూకేటాయింపునకు బాధ్యులైన వారిపై కేసు నమోదుకు ఆదేశాలివ్వాలని కోరారు. గత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెచ్ఎండీఏ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులతోపాటు నాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌పై విచారణకు ఏసిబిని ఆదేశించాలని కోరారు. కేసుల నమోదుకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ వంటి సంస్థలు ఉన్నప్పటికీ, ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ స్థాపన పేరుతో కోట్ల రూపాయల విలువైన భూమిని నాటి అధికారపార్టీ కాజేసిందని వాదించారు. గతంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే ఎన్‌జీవో దాఖలు చేసిన పిల్‌తో కలిపి ఈ పిటిషన్‌ను విచారిస్తామని ఈ సందర్భంగా హైకోర్టు తెలిపింది. భూకేటాయింపును రద్దు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తన పిల్‌లో హైకోర్టును కోరింది.

వ్యూహం సినీ నిర్మాత అప్పీల్‌పై విచారణ

వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను సింగిల్ జడ్జి రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ సినిమా నిర్మాత, నిర్మాణ సంస్థ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లను గురువారం హైకోర్టు డివిజన్ గురించి విచారించింది. ఈ నెల 30న దీనిపై విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ప్రకటించింది.

ప్రభుత్వానికి నోటీసులు

మున్సిపాల్టీల లిస్టులో మణుగూరు పేర్కొనటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీన్ని గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఏజెన్సీ ఏరియాలోని మణుగూరును మున్సిపాల్టీగా ఎలా చేస్తారో చెప్పాలనీ, పిటిషనర్ లేవనెత్తున అభ్యంతరాలకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణ నెల రోజులకు వాయిదా వేసింది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,950	▼	50
22 క్యారెట్లు	57,700	▼	50
కిలో వెండి	77,500	▲	700



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	97
రిటైల్ (లైవ్)	రూ.	119
స్కిన్‌తో	రూ.	173
స్కిన్‌లెస్	రూ.	196

నల్ల చట్టాలను రద్దు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

- రైతు వ్యతిరేక విధానాలపై ఆమనగల్‌లో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ



నవతెలంగాణ-ఆమనగల్

కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింప జేసి రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రెండేండ్ల కిందట తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంవత్సరం పాటు చేసిన ఆందోళనలో 700 మంది రైతులు అమరులు అయ్యారని గుర్తు చేశారు. రాత్రిపగలు తేడా లేకుండా దేశవ్యాప్తంగా రైతులు ఏకతాటిపై నిలిచి చేసిన పోరాటానికి దిగొచ్చిన కేంద్రం నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చిందని చెప్పారు. నేడు దొంగ దారిన వాటిని అమలు పరిచేందుకు కుట్రలు పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా మతోన్మాద శక్తులతో జతకట్టి ప్రజలను మభ్యపెట్టి మరోసారి మోసం చేయడానికి సిద్ధమౌతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీరం చేస్తూ వ్యవసాయ రంగంలో యంత్రాలను ప్రవేశపెత్తూ రైతు, కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బాక రాంచందర్, జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.జంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడారు. అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడిచే విధంగా 4 లేబర్ కోడ్‌లుగా విభజించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను హరిస్తోంద న్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో రైతులు, వామపక్ష, ప్రజాతంత్రవాదులు, వ్యవసాయ కార్మి కులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాడిగళ్ల భాస్కర్, సహాయ కార్యదర్శి ముసలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.అంజయ్య, కార్యదర్శి కందుకూరి జగన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.కుమార్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేష్, రైతు సంఘం ఆమనగల్ ఏరియా నాయకులు కాన్గుల వెంకటయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పిప్పళ్ల శివశంకర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దుబ్బ చెన్నయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

ఓటర్ల దినోత్సవ వేడుకలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓటు హక్కు ప్రజల చేతిలో ఆయుధం లాంటిదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లి జెఎన్‌టీయూ ఆడిటోరియంలో గురువారం జరిగిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో 3.26 కోట్ల ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో ఆనందకరమన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా హెూం ఓటింగ్ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద లైన్ ఉందని కొందరు ఓటు వినియోగించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాలకు వెళ్లే సందర్భంలో మాత్రం విమానాశ్రయంలో గంటల తరబడి లైన్‌లో ఉంటారన్నారు. ఎలక్షన్ కమిషన్ వారు పోలింగ్ బూత్‌లో మరిన్ని వసతులు కల్పించా లని కోరారు. నోటాకు తాను వ్యతిరేకమన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎన్నికల అధికారులను ప్రశంసించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు శాతం గ్రామీణ ప్రాంతాల్లో పెరగగా.. హైదరాబాద్ వంటి పట్టణాల్లో తగ్గిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాలు, పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు మరింత కృషి చేయాలన్నారు.

రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. 2023లో కొత్తగా 9.99,667 ఓటర్లు నమోదైనట్టు వివరించారు. అలాగే 2024లో ఇప్పటి వరకు 7.50 లక్షల మంది ఓటర్లుగా నమోదు అయ్యారన్నారు. అంతకు ముందు గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం చేయగా.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి, సీఈవో వికాస్ రాజ్, అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, కలెక్టర్ గౌతమ్ తదితరులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఆయా పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతలైన పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల ను గవర్నర్ అందజేశారు. అలాగే నూతనంగా ఓటర్లుగా నమోదైన వారికి ఎపిక్ కార్డులను అందిం చారు. ఈ కార్యక్రమంలో ముందుగా జాతీయ గీతాలాపన చేసి.. ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జోనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, వెంకటేష్ దొత్రే రవి కిరణ్, పంకజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు : సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున జరుపుకునే ఈ పండుగను ప్రజలందరూ సగర్వంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాతలను, దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన మహనీయులను గుర్తు చేసుకోవాలని కోరారు. గురువారం ఈ మేరకు సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామిక పాలన ద్వారానే రాజ్యాంగం ఆశించిన లక్ష్యాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతాయని పేర్కొన్నారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వంతో పాటు అందరికీ న్యాయం అందాలనే మన భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచ దేశాలకు మార్గదర్శకమేనని స్పష్టం చేశారు. ప్రజల పోరాటంతో పాటు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. తెలంగాణలో కొలువు దీరిన కొత్త ప్రభుత్వం రాజ్యాంగ ఆశయాలు, లక్ష్యాలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉంటుందని హామీనిచ్చారు.

అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే తమ ప్రభుత్వం ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందనీ, ప్రజలే పాలకులనే జవాబుదారీతనంతో పని చేస్తున్నదని తెలిపారు. నియంత పోకడలను పాతర పెట్టి, రాజ్యాంగబద్ధమైన విలువలు, విధానాలు, పద్ధతులను పునరుద్ధరించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం తెలంగాణ పునర్నిర్మాణానికి సిద్ధపడిందని ప్రతినబూనారు.

సీనియార్టీ, సమర్థతకే పెద్దపీట

టీఎస్‌పీయస్సీ నియామకాల్లో పారదర్శకతను పాటించిన సర్కారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అత్యంత కీలకమైన టీఎస్‌పీయస్సీ ఛైర్మెన్, కమిషన్ సభ్యుల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం సీనియార్టీకీ, సామాజిక సమతుల్యతకు, సమర్థతకే పెద్ద పీట వేసింది. ఈ విషయంలో ఆచీతూచీ వ్యవహరించింది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచే టీఎస్‌పీయస్సీ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఆ మేరకు సెర్చ్ కమిటీకి పూర్తి అధికారాలను అప్పగించిన సర్కార్ సమర్థులకు అవకాశం కల్పించింది. ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఉన్న అడ్డంకులన్నింటిని ఒక్కటొక్కటిగా అధిగమించేందుకు సీఎం రేవంత్ చర్యలు చేపట్టారు. యూపీఎస్సీ తరహాలో పరీక్షల నిర్వహణను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆయన కోరారు. ఇందులో భాగంగానే ఢిల్లీకి వెళ్లి యూపీఎస్సీ చైర్మెన్‌ను కలిసి చర్చలు జరిపారు.

ఈ క్రమంలోనే సుదీర్ఘ అనుభవం కలిగిన సివిల్ సర్వెంట్స్, విద్యావేత్తలకు ప్రభుత్వం ఈ సారి బోర్డులో అవకాశం కల్పించింది. టీఎస్ పీయస్సీ బోర్డు ఛైర్మెన్‌గా రిటైర్డ్ డీజీపీ మహేందర్‌రెడ్డిని నియమించింది. రిటైర్డ్ ఐఏఎస్ అనితా రాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీసెస్ రిటైర్డ్ అధికారి అమీర్ ఉల్లా ఖాన్, సీనియర్ ప్రొఫెసర్, డాక్టర్ నర్రి యాదయ్య, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.రామ్ మోహన్‌రావు, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ పాల్వాయి రజిని సభ్యులుగా నియమితులయ్యారు.

పేపర్ల లీకేజీలు, వరుస తప్పిదాలతో పక్కదారి పట్టిన టీఎస్ పీయస్సీని గాడిన పెట్టే సత్తా మాజీ పోలీస్ అధికారి మహేందర్‌రెడ్డికి ఉందని భావించిన సర్కారు ఆయన్ను ఛైర్మెన్‌గా నియమించింది. అంతకు ముందు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళికి ఈ బాధ్యత అప్పగించాలనుకున్నారు. వయో పరిమితి అనుకూలించకపోవటంతో ఆయన నిరాకరించారు. ఇదే వరుసలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేరు పరిశీలనకు వచ్చింది. ఇప్పటికే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉండటం, పొలిటికల్ ఫోరమ్‌లోనే ఉండేందుకు ఆయన నిశ్చయించుకోవటంతో మూడో పేరుగా రిటైర్డ్ డీజీపీ మహేందర్ రెడ్డికి ప్రభుత్వం ఈ బాధ్యతలు అప్పగించింది.

రిటైర్డ్ ఐఏఎస్ అనితా రాజేంద్రన్ గౌడ కులానికి చెందిన వ్యక్తి. ఐఏఎస్ అధికారిగా సుమారు పది శాఖల్లో పనిచేసిన అనుభవం ఆమెకు ఉన్నది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. నర్రి యాదయ్య, జేఎన్‌టీయూ ట్రిపుల్ ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈయన కుర్మ కులానికి చెందిన వారు. రామ్‌మోహన్‌రావు జెన్‌కోలో ఈడీగా పనిచేస్తున్నారు. ఆయన బీఈ (సివిల్), ఎంబీఏ చదివారు. 1986 నుంచి విద్యుత్ శాఖలో పనిచేస్తున్నారు. ఎస్టీ (ఎరుకుల) వర్గానికి చెందిన వారు. పాల్వాయి రజనీ గ్రూప్ వన్ ఆఫీసర్‌గా పనిచేసి వీఆర్ఎస్ తీసుకున్నారు. అంతకు ముందు టీచర్‌గా ఆమె పనిచేశారు. రూరల్ డెవలప్‌మెంట్‌లో, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేసిన అనుభవం ఆమెకు ఉన్నది. ఎస్సీ (మాదిగ) వర్గానికి చెందిన వారు. ఇలాంటి సామాజిక పొందికలు, వివిధ రంగాల్లో అనుభవాలను పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఆయా అర్హతలున్న వారినే టీఎస్ పీయస్సీ ఛైర్మెన్‌ను, సభ్యులుగా నియమించిందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్, సియాసిత్ రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు, సియాసిత్ న్యూస్ ఎడిటర్ మీర్ అమీర్ అలీఖాన్ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం వారిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలని కోరుతూ జాబితాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు పంపిన విషయం విదితమే. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలతో కూడిన పేర్లను గత ప్రభుత్వం పంపగా..ఏ అర్హతలను బట్టి వారిని ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ ప్రతిపాదనను గవర్నర్ తిప్పిపంపారు. దీంతో వారిద్దరూ హైకోర్టు తలుపును తట్టిన విషయం విదితమే.

తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు పేర్లను పంపగా..హైకోర్టు తీర్పు వచ్చేవరకూ గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఖాళీలను భర్తీ చేయడం సాధ్యం కాదంటూ తమిళిసై సౌందరరాజన్ బాంబు పేల్చిన సంగతి తెలిసిందే. చివరకు ఏమైందో ఏమోగానీ కాంగ్రెస్ ప్రభుత్వం సూచించిన కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్ పేర్లకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ ఛైర్మెన్‌గా కోదండరామ్ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారు. అంతేగాక గత అసెంబ్లీ ఎన్నికల్లో భేషరతుగా కాంగ్రెస్‌కు మద్దతిచ్చిన కోదండరామ్ పట్ల ఏఐసీసీకి సైతం సదాభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కింది.

మైనార్టీ కోటాలో ఫిరోజ్‌ఖాన్‌ను నియమించాలని కాంగ్రెస్ భావించినప్పటికీ.. గవర్నర్ ఆమోదముద్ర వేయకపోతే ఇబ్బంది తలెత్తుందని ఆ పార్టీ వెనుకడుగు వేసింది. ఆయన స్థానంలో ఉర్దూ జర్నలిజంలో పేరున్న సియాసిత్ పత్రికకు చెందిన న్యూస్ ఎడిటర్ మీర్ అమీర్ అలీఖాన్ పేరును చేర్చింది.

తెలంగాణకు 20 పోలీసు మెడల్స్

- ఆరుగురికి గ్యాలంట్రీ, ఇద్దరికి ప్రెసిడెంట్స్ పోలీసు మెడల్స్
- 12 మందికి మెరిటోరియల్ సర్వీస్ మెడల్స్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోం శాఖ గురువారం ప్రకటించిన పోలీస్ మెడల్స్‌లో తెలంగాణకు 20 పతకాలు వరించాయి. దేశ వ్యాప్తంగా పోలీస్, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీస్‌లకు చెందిన 1,132 మంది సిబ్బందికి కేంద్రం శౌర్య/ సేవా పతకాలను ప్రకటించింది. ఇద్దరికి మరణాంతరం ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పీఎంజీ), 275 మందికి మెడల్స్ ఫర్ గ్యాలంట్రీ(జీఎం), 102 మందికి విశిష్ట సేవ కోసం రాష్ట్రపతి పతకాలు(పీఎస్ఎం), 753 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్(ఎంఎస్ఎం) పతకాలు ప్రకటించింది. ఇందులో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో ఉత్తమ సేవలకు గాను ఆరుగురికి మెడల్స్ ఫర్ గ్యాలంట్రీ(జీఎం), ఇద్దరికి ప్రెసిడెంట్స్ మెడల్స్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (పీఎస్ఎం), మరో 12 మందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం) అవార్డులు దక్కాయి. వీరిలో దేవేంద్ర సింగ్ చౌహాన్(ఏడీజీ), సౌమ్య మిశ్రా(ఏడీజీ)లకు పీఎస్ఎం పతకాలు వరించాయి. అలాగే గడ్డిపోగుల అంజయ్య(ఆర్ఎస్ఐ), జేసీ/పీసీలు వడిచర్ల శ్రీనివాస్, నలివేణి హరీష్, బి సునిల్ కుమార్, ఎండీ అయూబ్, పి సతీష్ లకు గ్యాలంట్రీ మెడల్స్ దక్కాయి.

ఆరుగురికి ఎంఎస్ఎం మెడల్స్...

జాకబ్ ప్రమీలా(డీఐజీ), ఎన్ వెంకటేశ్వర్లు(ఎస్పీ), డి చంద్రయ్య(ఏఎస్పీ), ఏసీపీలు పి నరేష్ రెడ్డి, ఎస్ మోహన్ కుమార్‌లు, ఎన్ త్రినాథ్(కమాండెంట్), కె వీరయ్య(8వ బెటాలియన్ ఏసీ), ఎస్సైలు బి జయచంద్ర, ఎం సురేందర్ రెడ్డిలు, ఏఆర్ ఎస్సైలు ఈ. వెంకట్ రెడ్డి, జీ యేసుపదంలు, హెడ్ కానిస్టేబుల్ జంగయ్యలకు మెడల్స్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ పతకాలు దక్కాయి. అలాగే.. ఏపీకి మెడల్స్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం) లో తొమ్మిది మెడల్స్ దక్కాయి.

రవాణారంగ కార్మికులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి

- 'హిట్ అండ్ రన్' చట్టాన్ని అమలు చేయొద్దు :డ్రైవర్ల డిమాండ్



నవతెలంగాణ- విలేకరులు

రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలని జిల్లాల్లో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులకు వినతులు అందజేశారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని అమలు చేయొద్దని కోరారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ హైదరాబాద్ సౌత్, సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్, సెంట్రల్ సిటీ కార్యదర్శి కె.అజయ్ బాబు, సౌత్ కార్యదర్శి ఎల్.కోటయ్య, టీఆర్‌సీపీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కె.సతీష్, ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ నగర నాయకులు ఎండీ ఆసిఫ్, అలీ అబ్బాస్, ఎండీ బాబా పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లాలోని అన్ని రకాల వాహనాల డ్రైవర్లు నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి ర్యాలీ చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఆల్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ.. రవాణారంగ కార్మికులకు గీత, నేత కార్మికుల వలే నెలకి రూ.4500 నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు నష్టం చేసే 'భారత న్యాయ సంహిత' చట్టంలోని సెక్షన్ 106(1)(2) ఎత్తేయాలన్నారు. 'హిట్ అండ్ రన్' చట్టం అమల్లోకి వస్తే డ్రైవర్ల బతుకులు జైలు పాలువుతాయని.. వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ఏవోకి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ పబ్లిక్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కురుమూర్తి, ప్రధాన కార్యదర్శి పొదిల రామయ్య పాల్గొన్నారు.

కమీషన్లు పుచ్చుకుని సైబర్ నిందితులకు సహకారం

- బ్యాంక్ అకౌంట్ వివరాలు అందజేత
- ఇద్దరు నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కమీషన్లు పుచ్చుకుని సైబర్ మోసాలకు పాల్పడే వారికి సహకరిస్తూ, బ్యాంక్ అకౌంట్ల వివరాలు అందిస్తున్న ఇద్దరు నిందితులను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జాయింట్ సీపీ ఏవీ రంఘనాథ్ వివరాలు తెలిపారు. బేగంపేట్‌కు చెందిన గుడ్డింగరి వెంకటేష్, ఓల్డ్ సఫిల్‌గుడాకు చెందిన మొలుగూరి విజయ్ సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరస్థులతో చేతులు కలిపి.. పలువురి బ్యాంక్ అకౌంట్ల వివరాలు అందించారు. అందుకు వారి నుంచి కమీషన్లు తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దాదాపు రూ.3 కోట్లు కొట్టేసేందుకు నిందితులు పథకం వేశారని తేల్చారు. దేశం మొత్తంలో ఇద్దరు నిందితులపై 104 కేసులున్నాయని జాయింట్ సీపీ తెలిపారు. తెలంగాణలోనే 13 కేసులు రిజిస్టర్ అయ్యాయన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో బ్యాంక్ వివరాలను పంచుకోవద్దని, బ్యాంక్ ఖాతాలు ఎవరికీ ఇవ్వొద్దని ప్రజలకు సూచించారు.

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులను సమీక్షించాలి : బీసీ ఉద్యోగుల మహాసభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ సంస్థలో పదోన్నతులను తక్షణమే సమీక్షించాలని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 18వ మహా సభను గురువారం హైదరాబాద్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో కోడెపాక కుమార స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పదోన్నతుల సమీక్ష, 2009 తర్వాత నేరుగా నియమించిన ఉద్యోగులకు మెరిట్ ఆధారంగా జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్లు, జూనియర్ పర్సనల్ ఆఫీసర్, కెమిస్ట్, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులకు పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న సుమారు 3,500 మంది జూనియర్ లైన్‌మెన్‌లకు వెంటనే అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదోన్నతులు కల్పించాలనీ, విద్యుత్ సంస్థల్లో 1999 నుంచి 2004 వరకు ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఉద్యోగులక రెగ్యులర్ ఉద్యోగుల నిబంధనలు వర్తింపజేసి జూనియర్ లైన్మెన్ గా, జూనియర్ అసిస్టెంట్లుగా, సబ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పించాలని, విద్యుత్ సంస్థల్లో 50 శాతం డైరెక్టర్ పోస్టులను బీసీ అధికారులచే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 2024 డైరీ మరియు కాలెండర్లను జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆవిష్కరించారు. మహా సభకు విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న బీసీ ఉద్యోగులు వేల సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. మహాసభకు రాష్ట్ర నాయకులు నీలారపు రాజేందర్ ఎన్ సదానందం, ఎం విజయ కుమార్, కొమురవెల్లి రవీందర్, పి.యాదగిరి, డాక్టర్ చంద్రుడు, ఎం.అశోక్ కుమార్, జి.బ్రహ్మేంద్ర రావు, టి నరేందర్, మారం శ్రీనివాస్, రంగు సత్య నారాయణ, పి అశోక్ వెంకటేష్, కిషోర్, సామల శివాజీ తదితర నాయకులు సారథ్యం వహించారు.



గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

- ఇండ్ల నిర్మాణాలకు సహకారమందించాలి: ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాతఎర్ర చెరువులో పేదలు వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో గురువారం జరిగిన ఆటల పోటీల విజేతలకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి బహుమతులు అందజేశారు. అనంతరం మల్లు స్వరాజ్యం స్మారక భవనం ముందు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షత జరిగిన సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారందరికీ వెంటనే ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరారు. నిలువ నీడ లేని నిరుపేదలు ఇంటి స్థలాల కోసం గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు.

ప్రభుత్వం వెంటనే ఇండ్ల నిర్మాణాలకు సహకారం అందించాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జె.వెంకటేష్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ప్రజలు, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా మార్చారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ మతతత్వ విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న జరగనున్న సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, పోలేం రాజేందర్, నాయకులు వీరాజయ్య, రజనీకాంత్, గుర్రం దేవేందర్, శ్రీకాంత్, ప్రీతి, లక్ష్మి, రవి, రమేష్ రాజేందర్, మహేందర్, శేఖర్, రజిని, పోలెం చిన్న రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

8 మిల్లీమీటర్ల జాతీయ జెండా

- చాక్‌పీస్‌పై వందేమాతరం గీతం



నవతెలంగాణ-కోదాడరూరల్

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సూది రంధ్రంలో ఇమిడిపోయే అతి చిన్న సైజు 8 మిల్లీమీటర్ల ఎత్తు గల జాతీయ జెండాను తయారు చేశాడు. అంతేకాకుండా 1.5 సెంటీమీటర్ పొడవు,10 మిల్లీమీటర్ల వెడల్పు గల చాక్ పీస్‌పై వందేమాతరం గీతాన్ని రాశాడు. గతంలో బియ్యం గింజపై జాతీయ జెండా, ఆవగింజపై జాతీయ జెండా, నువ్వుల గింజపై జాతీయ జెండాను తయారు చేశాడు. దీంతో అనేక పురస్కారాలు అందుకున్నాడు.

ఎంవీ యాక్టును సవరించాలి

- బస్‌భవన్ ఎదుట ఆర్టీసి కార్మిక సంఘాలు నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టం (బీఎన్ఎస్)లోని హిట్ అండ్ రన్‌ను రద్దు చేయాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చేస్తూ ఆర్టీసీ కార్మిక సంఘాలు గురువారం హైదరాబాద్‌లోని బస్‌భవన్ ఎదుట నిరసన చేపట్టారు. ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, స్టాఫ్ వర్కర్స్ యూనియన్, బహుజన వర్కర్స్ యూనియన్, బహుజన కార్మిక యూనియన్ కార్మిక పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డ్రైవర్లకు పదేండ్ల జైలు శిక్ష, రూ.7 నుంచి రూ. 10 లక్షల జరిమానా విధించాలని నిర్దేశించిన సెక్షన్ 106 (1,2)లను పునసమీక్షించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం చేస్తున్న పోరాటంలో ఆర్టీసీలోని ఇతర కార్మిక సంఘాలు సైతం కలిసి రావాలని పిలుపునిచ్చారు. గతంలో ఆర్టీసీలో తీసుకొచ్చిన ఎంవీ యాక్ట్ 2019 ద్వారా సంస్థకు ఉన్న ప్రత్యేక హక్కులు, రాజ్యాంగ రక్షణను నిర్వీర్యం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈయూ నాయకులు వెంకన్న, ఎస్‌డబ్ల్యూ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ఐఎన్‌టీయూసీ నాయకులు జి. అబ్రహం జె.సత్యనారాయణ, .యాదయ్య, బి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సాయి నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ- నాగోల్
నాగోలు డివిజన్‌లోని సాయి నగర్‌లో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ, పలు సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించి వాటిని పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ- నాగోల్
సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం అని ఎల్బీనగర ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కు చెందిన లక్ష్మీ నాగరాజు తలకు ఇటీవల ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీ నాగరాజుకు సీఎం సహాయ నిధి నుండి రూ.1,50,000(ఒక లక్ష యాభై వేలు రూపాయలు) చెక్కు మంజూరైంది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే ఈ చెక్కును లబ్దిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డి నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, పొగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి సీఎంతోనే సాధ్యం



- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

నవతెలంగాణ- సంతోష్ నగర్
అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డితోనే సాధ్యమని హైదరాబాద్ ఎంఐఎం అధినేత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గ ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో రూ.54 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను గురువారం యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్, ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డితో కలిసి ఎంపీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ గిరిధర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, విజయకుమార్, జితేందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నవీన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత బాధ్యత కీలకం

- సిటీ కాలేజీ
ఓటరు దినోత్సవ సభలో వక్తలు..



నవతెలంగాణ -ధూల్ పేట్ / సంతోష్ నగర్
నా కులం, నా మతం, నా వర్గం అనే అభిమానాన్ని విడనాడి అభివృద్ధి చేయగలిగే వారికే ఓటు వేయాలని ఇగ్నో పూర్వ ఉపకులపతి ఆచార్య వాయునందన రావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాల సామాజిక శాస్త్రాల విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటు ద్వారా ప్రజాస్వామ్యం వ్యవస్థను పరిరక్షించడంలో యువత బాధ్యత తీసుకోవాలని, విద్య, ఆరోగ్యం అందరికీ అందుబాటులో ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఆచార్య మోహన రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ధన స్వామ్యంగా మారి పోయిందని, డబ్బులు ఇస్తే తప్ప మేము ఓటువేయం అనే స్థితికి ఓటరు రావడం బాధాకరమని అన్నారు. నిర్బంధ ఓటు వేసే విధానాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టాలన్నారు. నా ఒక్క ఓటు వల్ల ఎం జరుగుతుంది అనే ఉదాసీన వైఖరి నుండి ప్రజలు విడనాడాలని పిలువునిచ్చారు. భారతీయ ఎన్నికల సంఘం నిర్భయంగా, పారదర్శకంగా, నిర్వహించే స్థితిలో లేదని, టి.యస్.శేషన్ ఎంతో ప్రణాళిక బద్ధంగా నిర్వహించి ఎన్నికల నిర్వహణలో తనదైన ముద్రవేశారని అన్నారు. భారత దేశ రాజకీయ పరిస్థితుల్లో జమిలి ఎన్నికలు నిర్వహించడం ఎంతో కష్ట సాధ్యమని అన్నారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. సోషల్ మీడియా అనే ఆయుధాన్ని ఉపయోగించి మంచి నాయకుడిని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ..పట్టణ ప్రాంతాల్లో నివసించేవారు ఓటు వేయడానికి విముఖత చూపడం దురదృష్టకరమని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వాపోయారు.



ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు. డాక్టర్.ఏ.శంకర్ సమన్వయం చేసిన ఈ కార్యక్రమ ప్రారంభంలో డాక్టర్.కృష్ణ వేణి అధ్యాపకులు, విద్యార్థుల చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.భాస్కర్, డాక్టర్.రత్న ప్రభాకర్, డాక్టర్.యాదయ్య, లతా రాణి, డాక్టర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్



నవతెలంగాణ - ధూల్ పేట్ / సంతోష్ నగర్
కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకీకరణ, కార్మిక, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీడీఈయూ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సంతోష్ నగర్ పార్టీ ఆఫీసులో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడి నుండి కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. నేషనల్ మానిటైజేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో సరళీకరణ ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నారన్నారు. దీంతో ప్రభుత్వ సంస్థలన్నింటిని ప్రయివేట్ పరం చేస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. సీపీఎస్‌యుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వచ్చే నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం.శ్రావణ్ కుమార్, బాపురావు, టీ.సత్తయ్య ధనకర్ణ చారి, రవి, మురళి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఎండీకి ఘన సన్మానం



నవతెలంగాణ - సంతోష్ నగర్
జలమండలి నూతన ఎండీగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డిని సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ గురువారం ఆయన కార్యాలయంలో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో మురుగు నీటి సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ప్రత్యేకంగా మినీ ఎయిర్టెక్ వాహనాన్ని కేటాయించాలన్నారు. శంకేశ్వర్ బజార్లో సివరేజీ పైపులైన్ నూతన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

'కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి'



నవతెలంగాణ - సంతోష్ నగర్/ధూల్ పేట్
రవీందర్ నాయక్ నగర్ కాలనీలోని కలుషిత నీటి సమ్యను పరిష్కరించాలని ఆ కాలనీ అధ్యక్షుడు కృష్ణ నాయక్, కమిటీ సభ్యులు వాటర్ బోర్డ్ అధికారులను కోరారు. గురువారం వాటర్ బోర్డు అధికారులు డీజీఎం సురేష్, డివిజన్ మేనేజర్ వేణు, వర్క్ ఇనిస్పెక్టర్ సత్యనారాయణలు రవీందర్ నాయక్ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవీందర్ నాయక్ నగర్ కాలనీ నాయకులు రంజిత్ నాయక్, రఘు రాజేష్, కృష్ణ, సురేష్ రతన్ రాజకుమార్ పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదు

- నిందుతుడికి రూ. 25 వేల జరిమానా
- పరిహారం కింద బాధితురాలికి రూ.12 లక్షలు ఆర్థిక సాయం అందించాలన్న కోర్టు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్
మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఎల్బీనగర్ కోర్టు గురువారం జీవిత ఖైదు శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళ్లితే..రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో నివాసం ఉండే దేశగోని ఆనంద్ గౌడ్ కు భార్య, ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన ఆనంద్ రోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కూతురు/బాధితురాలు(మైనర్) పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు తల్లి 29న అబ్దుల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న నాటి సీఐ వి. స్వామి సాక్షాలను సేకరించి..నిందితుడు దేశగోని ఆనంద్ గౌడ్‌ను జ్యుడీషియల్ కస్టడికి తరలించడం జరిగింది. రెండవ విచారణ అధికారిగా పూర్తి విచారణ చేపట్టిన నాటి వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి సాక్షాలతో కోర్టులో చార్జి సీటు దాఖలు చేశారు. తదనంతరం విచారణలో భాగంగా 25 జనవరి 2024 ఎల్బీనగర్ లోని ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీష నిందితుడుకి జీవిత ఖైదు శిక్షతో పాటు, 25 వేల రూపాయల జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి ప్రభుత్వం తరపున 12 లక్షల రూపాయలు పరిహారం కింద ఆర్థిక సాయం అందించాలని తీర్పు వెల్లడించారు.

ఝాన్సీపై దాడి హేయమైన చర్య



బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి
అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం నిరసన చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి, నాయకులపై పోలీసులు చేసిన దాడిని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి ఖండించారు. పోలీసుల దాడిలో గాయపడి ఓజోన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీని గురువారం స్థానిక ఆర్కేపురం కార్పొరేటర్ రాధ ధీరజ్ రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఝాన్సీపై పోలీసులు చేసిన దాడి హేయమైన చర్య అని, ఓ మహిళ పట్ల వారి ప్రవర్తన సహేతుకంగా లేదని అన్నారు. యూనివర్సిటీ విద్యార్థుల స్థలంలో హైకోర్టు ఏర్పాటును వ్యతిరేకించడం విద్యార్థి సంఘాలు, నాయకుల బాధ్యత అని, దాడి చేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘాన్ని కోరారు. ప్రస్తుతం ఝాన్సీ ఆరోగ్యం నిలకడగా ఉందని, మరికొన్ని వైద్య పరీక్షలు చేసి, చికిత్స ఇవ్వనున్నట్లు వైద్యులు తెలిపారని అన్నారు.

'యోగ సాధన ద్వారా మంచి ఆరోగ్యం'



నవతెలంగాణ - నాగోల్
చిన్న వయసు నుండే ప్రతినిత్యం యోగ సాధన చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. శ్రీ సత్య సాయి ధ్యాన మండలి పూజ్య శ్రీ భిక్షమయ్య గురూజీచే నిర్వహించబడుతున్నటువంటి ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణా తరగతులు గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఫైట్ మాస్టర్ రామ్ ,లక్ష్మణ, డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డిలతో కలిసి ఉప్పల శ్రీనివాస గుప్తా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిక్షమయ్య గురూజీ 20 ఏండ్లుగా చేస్తున్నటువంటి సేవలు వెలకట్టలేవని కొనియాడారు. ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ మాట్లాడుతూ 30 ఏండ్లుగా ఆధ్యాత్మిక రంగంలో భిక్షమయ్య గురూజీ వెంట నడుస్తూ ఎంతో జ్ఞానాన్ని సంపాదించామని చెప్పారు. డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ దిల్‌సుఖ్‌నగర్ నందు ఉచిత యోగ శిక్షణా తరగతులు నిర్వహించడానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసి, కొన్ని వేల మందిని గురూజీ ఇక్కడ తీర్చిదిద్దినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అంతర్ముఖ యోగ శిక్షణా తరగతులు పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కోఆర్డినేటర్ ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం భావన శ్రీనివాస్ వేణుమాధవ్, రామచంద్రరావు, సంపత్ గురూజీ, మధుమాల, మాతాజీ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



నవతెలంగాణ - సంతోష్ నగర్
కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థాన హుండీని కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస శర్మ, టి. శేఖర్, సహాయ కమిషనర్, రంగారెడ్డి జిల్లా వారి పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. రూ.40,71,412, 229 అమెరికా డాలర్లు, 5 కెనడా డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్ల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో అలయ చైర్మన్ నల్ల రఘుమా రెడ్డి, ధర్మకర్తలు మేక సురేందర్ రెడ్డి, నారగోని శ్రీనివాస్ యాదవ్, చాతిరి మధుసూదన్ సాగర్, గూడూరు మధుసూదన్ రెడ్డి, చీర తిరుమలేష్, గోగిరెడ్డి అంజిరెడ్డి, చేగొని సురేష్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలో భారతదేశం క్రియాశీలకం

- సిటీ కళాశాలలో
ఖగోళశాస్త్ర పరిశోధనలపై సదస్సులో వక్తలు



నవతెలంగాణ - ధూల్ పేట్
అంతరిక్ష పరిశోధనలో భారతదేశం క్రియాశీలకంగా ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఖగోళశాస్త్ర విభాగం ఆచార్య జె.రుక్మిణి అన్నారు. సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో గురువారం 'ఖగోళశాస్త్రంలో చిక్కుముడులు- వాటి అన్వేషణలో భారతదేశ పాత్ర" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా ఆమె హాజరై మిషన్ మంగళయాన్, మిషన్ చంద్రయాన్ల పరిశోధనలోని కీలక అంశాలపై ప్రసంగించారు. సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. బాలభాస్కర్ ప్రారంభ ఉపన్యాసంలో పీజీ విద్యార్థులు ఖగోళశాస్త్ర పరిశోధనా నైపుణ్యాలను పెంచుకొని, దేశ ప్రగతికి తోడ్పడాలని సూచించారు. ఈ సదస్సు సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్.నైన వినోదిని అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఖగోళశాస్త్ర విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్. వాసుదేవ రెడ్డి, డాక్టర్. పర్వతాలు, డాక్టర్. చిన్ని క్రిష్ణ, డాక్టర్.లక్ష్మి శ్రీనివాసరావు, డాక్టర్. సువర్ణ భాతే, భౌతిక శాస్త్ర పీజీ, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ఆచార్య జె.రుక్మిణీ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దూరదర్శిని (టెలిస్కోప్) ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు సూర్యునిలోని నల్లటి మచ్చలను వీక్షించారు.

ప్రతీ సభ్యుడు సమస్యలపై పోరాడాలి



- సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ

నవతెలంగాణ -నాగోల్
సీపీఐ పార్టీ ప్రతీ సభ్యుడు ప్రజా సమస్యలపై పోరాడుతూ, నిరంతరం ప్రజల పక్షాన నిలబడాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ, ఉప్పల్ మండల కార్యదర్శి పి రామనారాయణ అన్నారు. మేడ్చల్ జిల్లా, ఉప్పల్ మండలం, ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోల్, కొత్తపేట డివిజన్లలో 2024 సంవత్సరం సీపీఐ సభ్యత్వ పునరుద్ధరణ, నూతన సభ్యుల చేర్పుల కార్యక్రమాన్ని గురువారం నాగోలు డివిజన్లోని సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రజా సంఘాల ద్వారా విస్తృతంగా సభ్యత్వ చేర్పింపుల కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. అనంతరం సభ్యులకు సభ్యత కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.డి బషీర్ శాఖ కార్యదర్శి జైపూర్ కాలనీ ఫేస్ 1, ఎస్. రాములు, శాఖ కార్యదర్శి బ్లైండ్స్ కాలనీ, ఉడుతల మల్లేష్ గౌడ్, శాఖ కార్యదర్శి సీపీఐ మోహన్ నగర్ శాఖ, భూపతి. సురేష్, మాజీ మండల సమితి సభ్యులు, జి. ఆంజనేయులు, పి.శివ, పి. మధు తదితరులు పాల్గొన్నారు.



అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలుపొందిన నూతన అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్ రెడ్డితో పాటు కాలనీ సభ్యులు గురువారం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నాగేశ్వరరావు, జానకిరామ్ నాయక్ తదితరులు ఉన్నారు.
నవతెలంగాణ - హస్తినాపురం

ఆర్‌యూపీపీ కాలమాని ఆవిష్కరణ



నవతెలంగాణ-చైతన్యపురి
రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) హైదరా బాద్ జిల్లా కాలమానిని గురువారం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిని రోహిణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. ఎస్.విజయ భాస్కర్ 2022-23 పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్ డబ్బులు రాలేదని అడిగితే.. ఫైనాన్స్‌లో పెండింగ్‌లో ఉన్నాయని డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హమీద్ ఖాన్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి, ఆర్‌యూపీపీ హైదరాబాద్ జిల్లా నాయకులు ప్రభావతి, పద్మజా, విలాసవతి, భాస్కర్, రహ్మాని పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జల్సాల రాయుడు

- 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నవతెలంగాణ-హయత్ నగర్
మెట్రో స్టేషన్‌ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసే వ్యక్తిని ఎల్బీనగర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్ తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. షాపూర్ నగర్, జీడిమెట్ల మేడ్చల్ జిల్లాకు చెందిన పాలేపోగు సిద్దయ్య. ఇతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ ఒంగోలు జిల్లా. 2020 నుండి ఆంధ్రప్రదేశ్‌లో జల్సాలకు అలవాటు పడి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలించి, వాటి ద్వారా వచ్చిన డబ్బుతో పేకాట, మద్యం సేవించి ఎంజాయ్ చేసేవాడు. కొన్నేండ్ల కిందట నగరానికి కుటుంబంతో కలిసి వలస వచ్చాడు. కానీ అతనిలో మార్పు రాలేదు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో మెట్రో స్టేషన్‌ల వద్ద పార్కింగ్ చేసిన ద్వి చక్ర వాహనాలను చోరీ చేసేవాడు. ఎల్బీనగర్ స్టేషన్ పరిధిలో5, ఉప్పల్ స్టేషన్ పరిధిలో5, కూకట్ పల్లిలో 3, మియాపూర్‌లో 2 కేసులు నమోదయ్యాయి. గురువారం ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద మరో ద్వి చక్ర వాహనాన్ని చోరీ చేయడానికి ప్రయత్నం చేయగా ..అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతని వద్ద నుండి మొత్తం 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ 16లక్షల రూపాయలు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ ఇనిస్పెక్టర్ అంజి రెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, క్రైమ్ ఎస్ ఐ నరేందర్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె నోటీసులు అందజేత



నవతెలంగాణ -ఎల్బీనగర్
వేతనాల పెంపు, ఉద్యోగాల పర్మినెంట్ కోసం ఫిబ్రవరి 16న జీహెచ్ఎంసీ కార్మికులు దేశ వ్యాప్త సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జీహెచ్ఎంసీ హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ కమిషనర్లకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా ఫిబ్రవరి 16న కార్మికులంతా సమ్మెలోకి వెళ్లాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. ఈ సమ్మెలో భాగంగా ఈ నెల 28న సీఐటీయూ ఆఫీస్ చైతన్యపురిలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ కార్మికులందరూ హాజరు కావాలని కోరారు. హైకోర్టు తీర్పు ప్రకారం జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతన ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాంకీ తదితరుల ప్రైవేట్ ఇంజనీరింగ్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఒప్పందాల ప్రకారం కార్మికులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మల్లెపాక వీరయ్య, నాయకులు చెన్నబోయిన. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐలో అశోక చక్రవర్తి జీవిత చిత్ర ప్రదర్శన



నవతెలంగాణ - నాగోల్
నాగోల్ డివిజన్ పరిధి బండ్లగూడలోని జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్‌లోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సహకారంతో గురువారం సామ్రాట్ అశోక చక్రవర్తి జీవిత చిత్ర ప్రదర్శనను నిర్వహించారు. జీఎస్ఐలోని రాగ్ గార్డెన్ లోని లోటస్ ప్లాంట్‌లో అశోక చక్రవర్తి జీవితానికి సంబంధించిన శిలలు, స్తంభాలు, గుహల ఆధారంగా ఏర్పాటు చేసిన హిందీ చిత్ర ప్రదర్శన కార్యక్రమానికి జీఎస్ఐ సదరన్ రీజియన్ అదనం డైరెక్టర్ జనరల్, డిపార్ట్మెంట్ హెడ్ సిహెచ్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో అధికారులు ఎల్ పి సింగ్, ఎం ఎల్ దొర, హెచ్‌ఎం మిషరా,ఆదర్ల మహేష్, మధిర సత్యనారాయణ, ఎస్ కె నాయక్, పి వి వి ఆర్ శర్మ, అనూప్ ఎన్ కంబ్లె, ఎస్ తారాకేష్ వర రావు, గగన్ కుమార్,మూర్తి మోహన్, ఈ చంద్రయ్య, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కాపార్తి సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి శ్రీనివాస్ కాపార్తి పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమని అంబంపేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం శ్రీనివాస్ కాపార్తి ప్రథమ వర్ధంతిని సిల్వర్ పాయింట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాచిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో ఉద్యమంలో ముందుకు సాగిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, కె.సదానంద్, గులాబ్ బబ్లూసింగ్, ఆంటోని, రాజేశ్, శేషు, మహేశ్కుమార్, బాబు, రాజు, మధాన్, బాబుల్ రెడ్డి, రాజ్ కుమార్, పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పథకం లో కొండపాక దగ్గరనున్న పంప్ హౌజ్‌లో గురువారం ఉదయం పైపులైన్ వాల్వ్ లీకేజీ జరిగింది. అప్రమత్తమైన జలమండలి అధికారులు అత్యవసరంగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీం పరిధిలోని కొన్ని ప్రాంతాలో నీటిసరఫరా ఆటంకం ఏర్పడుతోంది. కుత్బుల్లాపూర్, బాచుపల్లి, అల్వాల్, మల్కాజ్ గిరి, నిజాంపేట్, బొల్లారం, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరా జరుగుతోంది. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే అధికారులు తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తారు.

ఫుట్‌పాత్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

● కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

నూతన ఫుట్‌పాత్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ లో రూ.41 లక్షల వ్యయంతో ఫుట్‌పాతుల క్రమబద్దీకరణ నిర్మాణ పనులను కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేసి బాటసారులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్ కుమార్, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ అబ్దుల్ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నేతలు ప్రశాంత్, ఆకుల అభిషేక్, సతీష్, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

కుల జనగణన కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

● బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాష్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాల జనగణన జరుపుతామని కాంగ్రెస్ ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం బీసీ కులాల జనగణనతోపాటు మొత్తం కుల జనగణన జరపాలని బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. బీఈఎల్ఎఫ్ రాష్ట్ర 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఓంకార్ భవన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఓంకార్ భవన్ బీఎస్ హాల్ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన బీఎల్ఎఫ్ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగి రాజ్యాధికారం సాధించినప్పుడు మాత్రమే మెజారిటీ బహుజన ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సాదు మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బీఎలఎఫ్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో సైతం బీఎల్ఎఫ్ ఏర్పాటు చేయడం జరిగిందని భవిష్యత్తులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా చేసుకుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయు పొలిటుబ్యూరో సభ్యులు ఉపేందర్ రెడ్డి, బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్ పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, బీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకట్ స్వామి, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.సిద్దిరాములు, వస్కుల మట్టయ్య కె.మధు, వి.తుకారాం నాయక్, వి.రగసుధా, పోతుకంటి కాశీ, నర్రా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే అభివృద్ధి సాధ్యం

● బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు



నవతెలంగాణ-అంబర్‌పేట

యువత ఓటుహక్కును వినియోగించుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు సూచించారు. అనంతరం అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన వర్చువల్ సమావేశంలో పాల్గొని గౌతమ్‌రావు మాట్లాడారు. ఈ సంధర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తి గొప్పదని గౌతమ్ రావు పేర్కొన్నారు. యువతలో దాగి ఉన్న శక్తి ఏమితో ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారని, నరేంద్రమోదీ మాటలను ఆదర్శంగా తీసుకోని యువత ముందుకు సాగి విజయాలు సాగించాలని గౌతమ్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, నాయ కులు రమేష్ యాదవ్, యశ్వంత్, శ్రీధర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

● జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 ఏండ్లు నిండిన ప్రతి విద్యార్థి విరివిగా ఓటరు నమోదు చేసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య సూచించారు. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "నేషనల్ వోటర్స్ డే" సందర్భంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్. రెండు యూనిట్లు, సామాజిక శాస్త్రాల (సోషల్ సైన్సెస్) విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'అవగాహన సదస్సు'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డా. తిప్పర్తి యాదయ్య, విశిష్ట అతిథిగా జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. సుధాకర్ హాజరయ్యారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్ తప్పనిసరిగా తెలుసుకోవాలని వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్క విద్యార్థి ఓటరు నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య,పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు ఎ.కవిత సమన్వయ కర్తగా పనిచేశారు.ఈ కార్యక్రమానికి అధ్యాపకులు పి.వెంకట్ ఈశ్వర్, జె.శ్రీదేవి,ఎస్.రవి ప్రసాద్, డా.యాదవ్, డా.కె.నిర్మల, బి.విజయ నిర్మల, డా. మల్లీశ్వరిలతో పాటు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి మహాప్రసాదం అందజేత



నవతెలంగాణ-అంబర్‌పేట:

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ని బీజేపీ ఓబీసీ మోర్చా నేషనల్ సోషల్ మీడియా మెంబర్ పెరిక సురేష్ కలిసి ఆయనకు అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా 1008 దంపతులతో 9 రోజుల పాటు నిర్వహించిన శ్రీరామ హనుమాన్ మహాయజ్ఞం మహాప్రసాదాన్ని, ప్రతిమను అందించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఎవరు ఆపలేరని స్పష్టం చేశారు. ఇండియా కూటమీ పతనం ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో 10 స్థానా లకు పైగా బీజేపీ గెలుస్తుందని పెరిక సురేష్ ధీమా వ్యక్తం చేశారు.

'రేపటి తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలి'



● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యార్థులు రేపటి తరం కోసం భవిష్యత్తులో పర్యావరణాన్ని కాపాడుకోపోతే భూమీమ్మద మానవ జాతి అంతరించి పోయే ప్రమాదం ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మెన్ అంతర్జాతీయ పర్యావరణవేత్త డాక్టర్ హరీష్ ఇప్పనపల్లి పిలుపు మేరకు నగరంలోని శ్రీ జ్ఞానోదయ భారతి హైస్కూల్‌లో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ అధ్యక్షతన పర్యావరణ అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై సంస్థ అధ్యక్షులు భద్ర, భారత కేంద్ర ప్రభుత్వ ఆహార సలహా మండలి సభ్యులు రిజ్వాన్, స్కూల్ కరస్పాండెంట్ అశోక్ కుమార్ యాదవ్, ప్రిన్సిపాల్ సునీత రాణిలతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అన్ని నగరాలు, గ్రామాలలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడి పారేయడం మూలంగా భవిష్యత్తులో తలుచుకుంటేనే భయం వేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను కేవలం పేపర్ ప్రకటనల కోసం కాకుండా ప్రపంచ పర్యావరణ లాంటి సమస్యను ముందు వరుసలో పెట్టి, వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రజా ప్రతినిధులు ముందు వరుసలో ఉండే విధంగా ముందుకు నడిపించాలని సూచించారు. అనంతరం డాక్టర్ హరీష్ ఇప్పనపల్లి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడమే నిజమైన దైవత్వమని, పండుగలన్నీ పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సంస్థ ఆధ్వర్యంలో గత పదేళ్ళుగా పర్యావరణ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేడు పండుగలన్నీ ప్రకృతిహితంగా కాకుండా వికృతంగా జరుపుకుంటున్నామన్నారు. రోజుకు ఒక్క నిమిషం పర్యావరణం కోసం వెచ్చించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్యాక్స్ ఫైలింగ్ ఇండియా సీఈవో ప్రపంచ పర్యావరణ సంస్థ కోర్ కమిటీ సభ్యులు సిహెచ్.శ్రీనివాస్, ప్రపంచ పర్యావరణ సంస్థ హెల్త్ ప్రోగ్రాం డైరెక్టర్ హీరోలాల్ బానోతు, ప్రపంచ పర్యావరణ సంస్థ కోశాధికారి రిజ్వాన్, జాయింట్ సెక్రెటరీ మధుబాబు, రాజేష్ గౌడ్, సోషల్ మీడియా కో-కన్వీనర్ రాజరత్నం, పవన్, నవీన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

'దేశ ప్రజలకు రాజ్యాంగం ఒక వరం'

● ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుతూ ప్రదర్శన

● రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మన దేశానికి, దేశ ప్రజలకు ఒక వరం లాంటిదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పిఐ) జాతీయ ప్రధాన కార్య దర్శి బి. మహేష్ బాబు, కార్యదర్శి సిహెచ్. బాలకృష్ణ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురు వారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట 'భారత రాజ్యాంగాన్ని కాపాడాలని' కోరుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహిస్తూ రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తూ వస్తున్నదని, భవిష్య త్తులో కూడా రాజ్యాంగాన్ని కాపాడాలని వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచంలోనే అతి గొప్ప రాజ్యాంగం మనదన్నారు. కుల, మత, జాతి, భాష వంటి తేడాలు లేకుండా ఒక తాటిపై నడిపిస్తుందని, అలాంటి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపై ఉందన్నారు. భవిష్యత్తులో మరో 1,000 ఏళ్ల వరకు ఈ రాజ్యాంగం ఉండాలని, దేశ సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని కాపాడడంలో ఈ రాజ్యాంగం ముందుంటుంద న్నారు. కేంద్రంలోని బీజేపీ, మరికొన్ని మతోన్మాద శక్తులు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తు న్నాయని, ఆ ప్రయత్నాలను దేశ ప్రజలందరూ తిప్పి కొట్టాలని సూచించారు. జనాభా నిష్పత్తి ప్రకారం భూ పంపిణీ, ఇళ్ళు లేని పేదలకు ఇళ్ళు పంపిణీ చేయాలని, వృద్ధులకు ఉచిత సేవలు అందిస్తూ ఆశ్రమాలు నిర్మించాలని, పేదరికం నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ తదితర ఉన్నత విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలకు 5 ఎకరాల భూ పంపిణీ చేయాలని వారు ప్రభుత్వాలను డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నర్సింగ్ రావు, వినయ్ కుమార్, కర్ణం కిషన్, శ్రీధర్, మునీ స్వామి, ఎస్.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాయాగంలో పాల్గొన్న మంత్రి పొన్నం



నవతెలంగాణ-ముషీరాబాద్

లోక కల్యాణంతో పాటు దేశ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పర్తాళం శ్రీ సిద్దేశ్వర పీఠం ఆధ్వర్యంలో యాగాలు నిర్వహించడం అభినందనీ యమని రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లోక కల్యాణంకోసం శ్రీ సిద్దేశ్వర పీఠం కుర్తాళం ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీ సిద్దేశ్వరనాంద భారతి మహాస్వామి 88వ అవతరణ ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కోటీ ప్రత్యాంగీర మహాయాగంలో భాగంగా 5వ రోజు గురువారం శ్రీ సరస్వతి బ్రహ్మదేవ కల్యాణ మహో త్సవం అత్యంత వైభవంగా కన్నుల పండుగా నిర్వహించారు. సామూహిక శ్రీ లలితా పారాయణ కార్యక్రమం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యకుడు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహణం చేశారు. ఈకార్యక్రమంలో రమ్యానంద భారతి స్వామిస్, పీఠం కో ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, చీప్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్ తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీరప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అర్ధరాత్రి వరకు విక్రయాలు కొనసాగిస్తున్న ఇద్దరు వ్యక్తులకు శిక్ష

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



నిబంధనలకు విరుద్ధంగా అర్ధ రాత్రి వరకు దుకాణాల క్రయ విక్రయాలు కొనసాగిస్తున్న ఇద్దరు వ్యక్తులకు అబిడ్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గురు వారం అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సహెల్(28) రాయల్ టిఫిన్ సెంటర్ కొన సాగిస్తున్నాడు. గోధంహల్ ప్రాంతానికి చెందిన యోగానంద (26) వెంకటేశ్వర పాన్‌షాప్ కొనసాగిస్తున్నాడు. ఇరువురు దుకా ణాలు మధ్య రాత్రి వరకు కొనసాగించడంతో కేసు నమోదు చేసు కొని గాంధీభవన్ మూడవ మెజిస్ట్రేట్ న్యాయాధిపతి 50వేల జరిమానా బైండోవర్ నిర్వహించి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. స్పెషల్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు బాధితులను జైలుకు తరలించారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లినప్పుడే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారు

● సెంట్రల్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ చందన



నవతెలంగాణ-ముషీరాబాద్

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లినప్పుడే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని సెంట్రల్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ చందన తెలిపారు. గురువారం అప్స స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కవాడిగూడలోని భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సెంట్రల్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ వరలక్ష్మి సెంట్రల్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ చందన బాలికలకు బహుమతులు అందజేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు చిన్నతనం నుంచి విద్యతో పాటు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎన్నో పథకాలు బాలికల కొరకు నిర్వహిస్తుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆడపిల్లలు నేటి సమాజంలో మగవారి కంటే ఆడవారు అన్ని రంగాలలో ముందుంటున్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అప్స స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బొట్టు రమేష్, అప్స ప్రతినిధులు శ్రావణి లావణ్య ,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మాధవి, డాక్టర్ ప్రమోదీని, అనంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అమాయకులే టార్గెట్

● రద్దయిన లీరా నోట్స్‌ను విక్రయిస్తున్న నిందితులు

● రూ.27కోట్ల విలువగల టర్కీనోట్స్ స్వాధీనం

● ఐదుగురు నిందితుల అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో-హయత్‌నగర్

అమాయకులను టార్గెట్ చేసుకుని (రద్దయిన) టర్కీ నోట్లను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఆరుగురు అంతరాష్ట్ర ముఠా సభ్యుల్లోన్ని ఐదుగురు నిందితులను ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 99 టర్కీ (లీరా) కరెన్సీతోపాటు స్కార్పియో, ఆరు సెల్‌ఫోన్లు, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న టర్కీ కరెన్సీ విలువ ఇండియాలో రూ.27కోట్లు ఉంటుదని పోలీసులు తెలిపారు. గురువారం రాచకొండ సీపీ జీ. సుధీర్‌బాబు తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం. ఓం నాగ ప్రసాద్, జీ. జ్యోతి రవి తేజా, టీ. వెంకట్ నాగరాజు, ఎస్. జీవన్ సత్యా, ఎం.తేజా ఒక ముఠాగా ఏర్పడ్డారు. కార్పెంటర్‌గా పనిచేస్తున్న ఓం నాగ ప్రసాద్ 8 సంవత్సరాల క్రితం ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి నుంచి టర్కీ కరెన్సీ 'లీరా'ను సేకరించాడు. లీరా కరెన్సీనీ టర్కీ ప్రభుత్వం రద్దు చేసింది. రద్దు చేసిన కరెన్సీనీ విక్రయించాలని నిర్ణయించుకున్న నిందితుడు మిగిలిన సభ్యులను కలిశాడు. కమీషన్ల పంచుకునే విధంగా ఒప్పందం చేసుకున్న నిందితులు ఒక ముఠాగా ఏర్పడ్డారు. అమాయకులను టార్గెట్ చేసుకుని లీరా రూ.10లక్షల నోట్ ఇండియాలో రూ.27లక్షలు విలువచేస్తుందని, తక్కువ ధరకే కేవలం రూ.5 నుంచి రూ.10లక్షలకు (ఇండియన్ కరెన్సీలో) విక్రయిస్తామని గాలం వేస్తున్నారు. దాన్ని కొనుగోలు చేస్తే కోట్లలో లాభం వస్తుందని నమ్మిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఎస్‌వోటీ డీసీపీ కే.మురళీధర్ ఆదేశాలతో ఎల్బీనగర్ పోలీసులతో చింతకుంటలో ప్రత్యేక నిఘా వేశారు. స్కార్పియో వాహనాన్ని తనిఖీ చేయడంతో నిందితులు పట్టుపడ్డారు. టర్కీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

'దళిత క్రైస్తవులకు రాజ్యాంగ ఫలాలు దక్కలేదు'

● దళిత్ క్రిస్టియన్ దండోరా జాతీయ కన్వీనర్, ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మన దేశంలో రాజ్యాంగ ఫలాలు దళిత క్రైస్తవులకు ఏనాడు దక్కలేదని దళిత్ క్రిస్టియన్ దండోరా జాతీయ కన్వీనర్, ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలతో సమానంగా దళిత క్రైస్తవులకు రాజకీయ పదవులు దాక్కాల్సిన అవసరం ఉందన్నారు. మత స్వేచ్ఛ అనేది దళితులకు ఈ దేశంలో కరువైందని, మత స్వేచ్ఛ లేని రాజ్యాంగాన్ని రచించారన్నారు. గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పెండింగ్‌లో ఉందన్నారు. 341 జీవో ప్రకారం ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని, '371డి' ద్వారానే వర్గీకరణ సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా 950 ఆర్డర్‌ను రాజ్యాంగంలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే ఆయన తలపెట్టిన న్యాయ యాత్రలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా కల్పించే విధంగా పోరాటం చేయాలని కోరారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ.10,400 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు పెడితే అందులో దళిత క్రైస్తవులకు కేవలం రూ.103 కోట్లు మాత్రమే క్రిస్మస్ పండుగ పేరు మీద ఖర్చు పెట్టిందని, అంతే కానీ క్రైస్తవుల సమగ్ర అభివృద్ధి కోసం క్రైస్తవ కార్పొరేషన్ ద్వారా ఒక రూపాయి ఖర్చు చేయలేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలోని ఏడు పార్లమెంట్ స్థానాల్లో దళిత్ క్రిస్టియన్ దండోరా పోటీ చేస్తుందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో దళిత్ క్రిస్టియన్ దండోరా రాష్ట్ర కన్వీనర్ కాశీ సతీష్ కుమార్ మాదిగ, జాతీయ కో-కన్వీనర్లు తాడేం రాజ్ ప్రకాష్, బెజవాడ రవి, సౌత్ ఇండియా కన్వీనర్ ఆర్.పీటర్, కో-కన్వీనర్లు స్టీఫెన్ పాల్, జ్యోత్స్న రాణి, గట్టు అశోక్, కునాదొడ్డి ఇర్మీయా తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలి

● తెలంగాణ రాష్ట్ర సోషలిస్ట్ పార్టీ అధ్యక్షురాలు సుభద్ర రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఈవీఎంలు తొలగించి బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సోషలిస్ట్ పార్టీ అధ్యక్షురాలు సుభద్ర రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ డే సందర్భంగా ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సుభద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ ఈవీఎంల వల్ల ప్రజలు చాలా నష్టపోతున్నారని మనం ఒక్కరికీ ఓటు వేద్దాం అనుకుంటే వేరే వాళ్లకు పోతున్నాయ్ .. ప్రజలు ఆమోదించిన ప్రభుత్వాలు రావడం లేదని ఎవరైతే ప్రభుత్వం లో ఉంటారో వాళ్లేదే రాజ్యం అవుతుందని తెలిపారు. ప్రజలు ఆమోదించిన ప్రభుత్వాలే రావాలంంటే బ్యాలెట్ సిస్టమ్ రావాలన్నారు. ఈ బ్యాలెట్ సిస్టమ్ వచ్చే వరకు పోరాటం ఆగదని తెలిపారు. ఊరూరా తిరిగి ప్రజలను చైతన్యవంతం చేస్తామని బ్యాలెట్ ఉంటేనే ఓటు వేస్తామని లేకపోతే ఈ ఎన్నికలను రద్దు చేయాలని మొండిగా వ్యవహరిస్తేనే ప్రభుత్వాలు, ఎలక్షన్ కమిషన్ దిగి వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి నిరీల్ అమీన్, రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్ర రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత్ రావు, వైస్ ప్రెసిడెంట్‌లు గోపాల్ పతంగా రమేష్ బాబు, సెక్రెటరీ మొహమ్మద్ ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

'ఎరుకల గిరిజనుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

● తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం (కుర్రు) రాష్ట్ర అధ్యక్షులు కోనేరు సాయికుమార్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

చేవెళ్లలో ప్రకటించిన ఎస్టీ డిక్లరేషన్‌లో భాగంగా ఎరుకల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎరుకల గిరిజనులను ఆదుకోవాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం (కుర్రు) రాష్ట్ర అధ్యక్షులు కోనేరు సాయికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోనేరు సాయికుమార్ మాట్లాడుతూ 2017 లో ఏర్పాటు చేసిన ఎరుకల ఒక్కొక్క సొసైటీకి రూ.60 లక్షల నిధులు కేటాయించాలని, పందుల పెంపకం కోసం 2 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గిరిజన తెగలో ఉన్న కులాలకు ముఖ్యంగా ఎరుకల గిరిజనుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డామని, తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎరుకల సొసైటీలకు ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జీఎ.సాయిలు పాల్గొన్నారు.

'మాల మహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నక్క దేవేందర్ రావు'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నగరంలోని రాంనగర్ ప్రాంతానికి చెందిన నక్క దేవేందర్ రావును నియమించినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్, డాక్టర్ వి.ఎల్. రాజు తెలిపారు. నక్క దేవేందర్ రావుకు నియామక ఉత్తర్వులు అందజేశారు. డా. వి.ఎల్.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలు ఎదుర్కొంటున్న జీవన, సామా జిక, రాజకీయ సమస్యల పరిష్కారం కోసం నక్క దేవేందర్ రావు పోరాటం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నక్క దేవేందర్‌రావు మాట్లాడుతూ మాలల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పాల్గొన్నారు.

నాగిరెడ్డి కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
[illegible]లోని నాగిరెడ్డి కాలనీ[illegible] శ్రీ[illegible]. శాంతి శ్రీ[illegible] కాలనీ [illegible] ఆక్షేపించార్లు. ఈ కార్యక్రమంలో [illegible] సతీష్, [illegible]గిరి, ప్రేమ్,

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ ప్రజల సహకారంతోనే ప్రతి ప్రాంతంలో అభివృద్ధి సాధ్యపడు తుందని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గురువారం డివిజన్ పరిధి శ్రీ వేస్ ఎంక్లేవ్ కాలనీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్ భాయ్, శ్రీవేస్ ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షులు అనంత రంగారావు, ప్రధాన కార్యదర్శి సాజీద్ హుస్సేన్, స్థానికులు గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్, రాంబాబు, గోపి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



- ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రతి కాలనీ బస్తీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నేరాల నియంత్రణలో నిఘా నేత్రాలుగా కీలకంగా పని చేస్తాయని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో, రూ.2 లక్షల 80 వేల అంచనా వ్యయంతో, ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని, పారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవోదయ కాలనీ వాసులు, తన విజ్ఞప్తి మేరకు కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ వాసులు ముందుకు రావడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. కాలనీలలో నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయనీ, కాలనీ వాసులకు తెలియజేశారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలిసులతో సమానమని, సీసీ కెమెరాల వలన కేసు‌లు పరిష్కారం సులువు అవుతుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతు కృషిగా ఎమ్మెల్యే ఫండ్ (సీడీపీ) ద్వారా 1 కోటి రూపాయలు కేటాయించడం జరిగినదనీ ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్, నియోజకవర్గ అభివృద్ధికి శాయ శక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, శర్మ సంతోష్ రావు, కాశినాథ్ యాదవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, నవోదయ కాలనీ ప్రెసిడెంట్ బీవీ రమణ, వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, సెక్రటరీ సిద్ధార్థ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో సత్తా చాటిన శ్రీధర్ రావు

- దావోస్ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డితో హాజరు
- తెలంగాణ వ్యాపార సంబంధాలకు కృషి
- పలువురు వ్యాపార వేత్తలతో సీఎంతో కలిసి సమావేశం
- సొంత రాష్ట్రమైన తెలంగాణకు పెట్టుపడుల ఆకర్షణకు కృషి





నవతెలంగాన-సీటీబ్యూరో

ఇటీవల స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో సుప్రసిద్ధ టెలికాం వ్యాపారవేత్త వాల్గో ఇన్‌ఫ్రా సీఈఓ నెంబర్ 1 శ్రీధర్ రావు తన ప్రభావాన్ని చూపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హాజరై ప్రపంచ వ్యాపార సంబంధాలను ఏర్పరచడానికి పెద్ద పరిశ్రమల ప్రముఖులతో అనేక సమావేశాలను ఏర్పాటు చేసి అందులో పాల్గొన్నారు. శ్రీధర్ రావు భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్‌పర్సన్ సునీల్ భారతి మిట్టల్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ వంటి అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో చర్చించారు. ఈ ముఖ్యమైన సమావేశాలు సహకారం, వృద్ధికి దోహదం పడే విధంగా బాటలు వేసాయి. వరంగల్ జిల్లాకు చెందిన శ్రీధర్ రావుకు ప్రపంచ వ్యాప్తంగా బలమైన వ్యాపార నెట్‌వర్క్ ఉంది. తన బలమైన సంబంధాలు, విస్తృతమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించడం ద్వారా, అతను తన సొంత రాష్ట్రమైన తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు ముఖ్యమైన పెట్టుబడులను ఆకర్షించాడు. ముఖ్యంగా కర్ణాటక ముఖ్యమంత్రితో ఆయనకున్న సన్నిహిత సంబంధాలు ప్రపంచ పారిశ్రామికవేత్తలు, కర్ణాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి మంత్రి పాటిల్ వంటి అధికారుల మధ్య సమావేశాలను సులభతరం చేశాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సందర్భంగా, నెంబర్ 1 శ్రీధర్ రావు భారతీ ఎయిర్‌టెల్ చైర్‌పర్సన్ సునీల్ మిట్టల్‌తో భారతదేశం అంతటా 5%+% సేవల విస్తరణ గురించి చర్చించారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ వంటి ప్రాంతాలకు 5%+% సేవలను తీసుకురావడానికి అనేక టెలికాం కంపెనీలతో సమావేశాలు కూడా నిర్వహించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 54వ వార్షిక సమావేశంలో శ్రీధర్ రావు పాల్గొనడం టెలికమ్యూనికేషన్స్ పరిశ్రమలో అతని బలమైన నాయకత్వాన్ని చూపించింది. భారతదేశం వ్యాపార దృశ్యాన్ని మెరుగుపరచడానికి గ్లోబల్ కనెక్షన్‌లను ఉపయోగించడంలో నిజమైన మార్గదర్శకుడిగా పేరు గాంచాడు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని విజయ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డిని కేపీహెచ్‌బీ కాలనీ బాలాజీ ఎన్ క్లేవ్‌లో గల వారి నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ నిర్మాణ సమయంలో భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలు కోల్పోతే వారిని పట్టించుకునే వారే లేరని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్మికుల సమస్యలు తీర్చాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలకు పరిష్కారం చూపుతామని శేరి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కే.రవి, ఉపాధ్యక్షుడు యన్ శ్రీను, బి బాలాజీ, సెక్రటరీ కే.పరశు రాం, జాయింట్ సెక్రటరీ కే.ఆది బాబు, కే.శేఖర్, కోశాధికారి జి.గోపి, బి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన శంభీపూర్ క్రిష్ణ



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌లోని 26వ వార్డు కేవిఆర్ వ్యాలీలో రూ.52 లక్షల వ్యయంతో గురువారం నూతనంగా నిర్మిస్తున్న సీసి రోడ్డు నిర్మాణ పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. అనంతరం వార్డులోని ప్రజా సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ జీతయ్య, ఎక్స్ ఉప సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, నాయకులు ఇంద్రసేనా, శ్రీశైలం యాదవ్, మల్లేష్ యాదవ్, నాయకులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు గురువారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంబంధిత అధకారులతో చర్చించి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ ప్రజలకు సేవకుడిలా పని చేస్తా



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజలకు జీవితాంతం సేవకుడిలా పని చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్ర లో భాగంగా 13 వ రోజైన గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీ, సంజయ్ పూరి కాలనీ, జగద్గిరి నగర్, బీరప్ప నగర్ ప్రాంతాలలో ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో కలిసి పర్యటించి, కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఎంతో నమ్మకంతో ఇంతటి అఖండ విజయాన్ని అందించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ హైట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించినందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మీరు అందించిన ఇంతటి ఘన విజయంతో రెట్టింపు ఉత్సాహంతో రాజకీయాల కతీతంగా ప్రజల సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా, బీఆర్ఎస్ నాయకులు తేరాల శ్రీనివాస్, పి.వీరాచారి, బసవేశ్వర్, ప్రవీణ్ చారి, సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణ గౌడ్, సయ్యద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: సూరారం 129 డివిజన్, షాపూర్ నగర్ పూర్ణిమ హై స్కూల్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌ను హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా ధృడత్వంగా తయారవుతారన్నారు. అనంతరం స్కూల్ కరస్పాండెంట్ కుత్బుల్లాపూర్ ట్రస్మా చైర్మెన్ డి. జానకి రాములు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం ఎన్ని సౌకర్యాలు అయినా కల్పించడానికి పాఠశాల సిద్ధంగా ఉంటుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి అభివృద్ధి చేసే నాయకులు అరుదని అలాంటి నాయకులలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ఉండడం చాలా సంతోషకరమన్నారు.అదేవిధంగా పెద్దరికానికి విలువనిస్తూ నాకు సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఫిరోజ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ గంగయ్య నాయక్, స్కూల్ కరస్పాండెంట్ పూర్ణచందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

- సీపీఐ రాష్ట్ర నాయకులు యేసురత్నం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ అవుట్ పోస్ట్ చాకలి ఐలమ్మ చౌరస్తా వద్ద రోడ్డు వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర నాయకులు కే.యేసురత్నం సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులతో కలిసి జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఈఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వేల మంది ఆ రోడ్డుపై ప్రయాణిస్తుంటారని ఉదయం, సాయంత్రం వేళల్లో చౌరస్తాలో కిక్కిరిసిన వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయ్యి కనీసం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లేవారు, పాదాచారులు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అట్టి చౌరస్తాలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను వేరే అనువైన చోటుకు మార్చి రోడ్డు వెడల్పు చేసి ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేసి, ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని వినతిలో కోరారు. జగద్గిరిగుట్ట బస్టాండు ఇరుకుగా ఉన్న అన్ని రోడ్లను వెడల్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి. జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్, ఏ.ఐ.టి.యు.సి మండల అధ్యక్షులు వుజ్జిని హరినాథ్ రావు, మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు దుదిగే రాములు, సి.పి.ఐ నాయకులు సహదేవరెడ్డి, ఇమామ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి



- అల్వాల్ డీసీ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు ఓటు హక్కు బలమైన ఆయుధమని దీనిని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగిం చుకోవాలని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్స వాన్ని అల్వాల్ సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సోమశేఖర రావు, హనుమంతరావులను ఆయన సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ మంచి నాయకులను, పాలకులుగా నిలబెట్టేందుకు, ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరికి ఓటు వజ్రా యుధమన్నారు. 18 సంవత్సరాల వయస్సు ఉన్న వారందరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఓటరు ఆలోచించి, మంచి నాయకులను ఎన్నుకుంటే, దేశ భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన, నూతనంగా ఓటర్ కార్డ్సు పొందిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఎంసి నరసింహారెడ్డి, సూపరింటెంట్ స్వామి, నారాయణ, ఏఎంఓహెచ్ మంజుల, సానిటేషన్ సూపర్ వైజర్ ప్రభాకర్, ఆర్టికల్చర్ అధికారి నవీన్, స్థానిక నాయకులు సురేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు అమూల్యమైనది



- సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

నవతెలంగాన-సీటీబ్యూరో

ఓటు హక్కు అమూల్యమైనది అని ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ ప్రధాన కార్యాలయంలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ముఖ్య అతిధిగా పాల్గొని విద్యుత్ అధికారులతో, సిబ్బందితో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భముగా సీఎండీ మాట్లాడుతూ.. ఓటు హక్కు దేశ ప్రజలకు మన రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అనీ, ఈ ఓటు హక్కును వినియోగించడం ద్వారానే ప్రతి పౌరుడు, తమ దేశ, రాష్ట్ర పాలనా ప్రక్రియలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 ఏండ్లు నిండిన ప్రతీ యువతీ, యువకులు ఓటర్‌గా నమోదు చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని అధికారులను, సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్స్ టి.శ్రీనివాస్, జె. శ్రీనివాస రెడ్డి, కె.రాములు, జి.పర్వతం, ఎస్.స్వామి రెడ్డి, జి.గోపాల్, చీఫ్ జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పాల్గొని ఓటర్ ప్రతిజ్ఞ చేసారు.

డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న, ఆర్‌పి వరలక్ష్మి కూతురు చిన్నారి ప్రదీక్ష, కుమారి ప్రణవి నేతృత్వంలో శ్రీ మానస డాన్స్ అఫ్ అకాడమీ తరపున అండమాన్‌లో కూచిపూడి నృత్యం అభినయించి, నృత్య ప్రదర్శన ద్వారా నేషనల్ అవార్డు సాధించిన సందర్భంగా, చిన్నారి ప్రదీక్షను కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌లు అభినందించారు. భారతీయ కూచిపూడి నృత్యాన్ని దేశవిదేశాలకు వ్యాపించేలా అభినయించి, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటూ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ చిన్నారికి ఎమ్మెల్యే కృష్ణారావు చేతులమీదుగా రూ.10 వేల బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, వాసుదేవరావు, పోశెట్టిగౌడ్, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అంబేద్కర్ చిత్రపటం ప్రదర్శించాలి



- ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర చైర్మెన్ ఎరవెల్లి జగన్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఈనెల 26న దేశవ్యాప్తంగా నిర్వహించే గణతంత్ర దినోత్సవంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం ప్రదర్శించాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఐక్య కార్యాచరణ కమిటీ, రాష్ట్ర చైర్మెన్ డిఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎరవెల్లి జగన్ పిలుపునిచ్చారు. జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎరవెల్లి జగన్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవంలో తెలంగాణలో ఉన్నటువంటి అన్ని యూనివర్సిటీలలో, ప్రతి కార్యాల యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలన్నారు. స్వతంత్ర, గణతంత్ర దినోత్సవలలో చాలా ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం లేకుండా నిర్వహించడం బాధాకరమన్నారు. దేశంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం రాజ్యాంగంలో ఎన్నో రకాల హక్కులు పొందుపరిచారన్నారు. అలాంటి అంబేద్కర్‌ను విస్మరించి ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ మేధావిగా గుర్తించబడ్డ అంబేద్కర్ చిత్రపటం ప్రతి స్వతంత్ర, గణతంత్ర దినోత్సవంలో సందర్భంగా ఆయా కార్యాలయా ల్లో ప్రదర్శించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీస్ ఐక్య కార్యాచర ణ కమిటీ, డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్ పటేల్, రాష్ట్ర అధ్యక్షురాలు చింతల అఖిల సోను, జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ ఇన్‌చార్జి అభిషేక్, టేకుమల్ల ప్రదీప్, రేవంత్ నాయక్ పాల్గొన్నారు.

వివేకానంద హైస్కూల్‌లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

130 డివిజన్ సుభాష్ నగర్‌లోని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్‌లో ప్రీ- ప్రైమరీ విద్యార్థులకు రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం ఫ్రీడమ్ ఫైటర్స్ ఫ్యాన్సీ డ్రెస్‌తో కూడిన పోటీ నిర్వహించారు. చిన్నారులు చాచా నెహ్రూ, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, భరతమాత, భగత్ సింగ్ వంటి వేషధారణలతో పాటు వారి పాత్రలను 4 నుంచి 5 వాక్యాలలో వివరించారు. చిన్నారులు ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో చూపరులను ఎంతో ఆకట్టుకున్నారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యా యులు మండవ శ్రీనివాస్ గౌడ్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడు తూ ఈ పోటీని నిర్వహించడం యొక్క ఉద్దేశ్యం కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా పిల్లలకు వారి విగ్రహాల గురించి నేర్చుకునే అవకాశాన్ని అందించడమని తెలిపారు. వారి జీవితాలలో వారి లక్ష్యాలను నింపడం కోసం అన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరెస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ వేషధారణలో ఉన్న విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- మంత్రి సీతక్కకు ప్రజా తెలంగాణ వినతి



నవతెలంగాన-సీటీబ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కులగనన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాతెలంగాణ ప్రతినిధులు ప్రొఫెసర్ మనోహర్, ప్రొ.తిరుమలి, ప్రొ.సిహెంద్రి, దేవుళ్ల సమ్మయ్య మంత్రి సితక్కను కోరారు. గురువారం సెక్రటేరియట్లో మంత్రి సీతక్క, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో గత ప్రభుత్వం బిసిలకు తగ్గించిన రిజర్వేషన్లు సవరించి 42శాతం పెంచి ఎలక్షన్లు జరపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్స్ పిఎస్‌యులకు తదితర నియామకాల్లో జనాభా దామాషా ప్రకారం బిసి, ఎంబిసి, డిఎస్టీయులకు నియామకాలు జరపాలన్నారు. చాలా కాలంగా బిసి సబ్ ప్లాన్ కోసం ప్రజా ఉద్యమాలు నడుస్తున్న నేపథ్యంలో రాబోయే బడ్జెట్లో బిసి సబ్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. నిరుద్యోగ యువత పదేళ్లుగా ఉద్యోగ అకశాలు కోల్పోవడంతో వారికి వయస్సు నడలింపు 50ఏండ్లకు పొడిగించాలని, విద్యా, ఆరోగ్య రంగాలకు బడ్జెట్‌ను గణనీయంగా పెంచి ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి, కార్యదర్శిని కలిసిన వారిలో ప్రతినిధులు సతీష్ కొట్టే, సంతోష్ గౌడ్, బివి మురళీ మనోహర్, బింగి సత్యనారాయణ, వినోద్ కుమార్, తదితరులు ఉన్నారు.

పనులు పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ



సీతాఫలమండిలో బ్రాహ్మణ బస్తీలైన్‌లో సిల్ట్ గ్రాబర్ పని తీరును గురువారం కార్పొరేటర్ సామల హేమ పరిశీలించి అధికారులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సివరేజి లైన్ నుంచి మట్టిని తీసేందుకు యంత్రాలతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు ఎలాంటి అవాంచనీయ సంఘటన లు చోటు లేకుండా యంత్రాలతో మట్టి తీయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం కృష్ణ, మేనేజర్ అన్విత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్య క్షులు మాగంటి గోపీనాథ్ గురువారం కార్య కర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27వ తేదీన ఉదయం 10:00గంలకు యూసుఫ్‌గూడ మొహమ్మద్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గం కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ సమావేశాన్ని నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మారుమూల గ్రామాలకు అందుబాటులో ఎక్స్-రే మొబైల్ క్లినిక్ వాహనం



● కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రి

నవతెలంగాణ-బేగంపేట్

సామాజిక సేవాభావంతో...నిరుపేదలకు, మారుమూల గ్రామాలకు సైతం వైద్యసేవలను అందించాలనే దూరదృష్టితో సర్వేజన ఫౌండేషన్ చైర్మెన్, కిమ్స్ షైన్, కిమ్స్ ఆస్పత్రి గచ్చిబౌలి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురవారెడ్డి "సర్వేజన ఫౌండేషన్" సంస్థను ప్రారంభించి అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. గురువారం ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎక్స్-రే మొబైల్‌క్లినిక్ వాహనాన్ని ప్రారంభించారు. నిరుపేదలకు, జీవనాధారం లేని వారిని గుర్తించి ఉచితంగా 68 మందికి జాయింట్ రీప్లేస్మెంట్ శస్త్రచికిత్సలు నిర్వహించి వారి జీవితాల్లో మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 (ఇండియా), రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ 7870 (యుఎస్ఏ) ద్వారా నిధులు సమకూర్చి మొబైల్ ఎక్స్-రే వాహనాన్ని అందుబాటులోకి తీసుకుచ్చినట్లు, ఈ వాహనంలో అత్యాధునిక ఎక్స్-రే సాంకేతికతతో కూడిన మొబైల్ క్లినిక్ ఉంటుందన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాలకు చేరుకొని వైద్య సేవలు పొందలేని వారికి ఈ సేవలను అందించడమే ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తు ందని, మొట్టమొదటి సారిగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఎక్స్-రే వాహనాన్ని గురువారం కిమ్స్-షైన్ బేగంపేట ఆస్పత్రి కిమ్స్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.భాస్కర్రావు, సర్వేజన ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి, రోటరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభిం చారు. పలువురు పేదవారికి వైద్యసాయాన్ని అందించడమే కాకుండా కమ్యూనిటీలకు సాధికా రత, భద్రత పెంపొందించి ఆరోగ్యకరమైన, ధృడమైనసమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో డాక్టర్ గురవారెడ్డి 'స్టాప్' 'షేర్' అనే రెండు విభాగాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరి శ్రీధర్, లక్ష్మణ్ బాబు అనేకమంది డాక్టర్లు పాల్గొన్నారు.

విద్య ఉత్తమ జీవన గౌరవాన్ని అందిస్తుంది

● భారతీయ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే

నవ తెలంగాణ-బంజారాహిల్స్



విద్య ఉత్తమ జీవన గౌరవాన్ని అందిస్తుందని ప్రఖ్యాత భారతీయ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే అన్నారు. గురువారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి హర్షా భోగ్లేను ఎక్సలెన్స్ ఫర్ స్పోర్ట్స్ కామెంటరీ అండ్ జర్నలిజం అవార్డుతో హెచ్పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ నోరియా ప్రిన్సిపాల్ డాక్టర్ స్కంద్ బాలి సత్కరించింది. ఈ సందర్భంగా హర్షా భోగ్లే మాట్లాడుతూ సమాజానికి విశేషమైన సేవలను గుర్తించడంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అంకితభావాన్ని నొక్కి చెప్పారు. తన అల్మా మేటర్‌ని సందర్శించినప్పుడు,3వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తన అంతర్దృష్టితో కూడిన ప్రసంగం సమయంలో, అతను తన స్వంత పాఠశాల అనుభవాలను గుర్తు చేసుకుంటూ జ్ఞానపకాలల్లో ఉందని మిస్టర్ భోగ్లే స్కూల్ మ్యాగజైన్ కోసం రచనలో తన చురుకైన ప్రమేయంతో సహా పాఠశాల జీవితంలోని ప్రతి అంశాన్ని ఎలా ఆనందించారో వారు పంచుకున్నారు. అకడమిక్స్ స్పోర్ట్స్ మధ్య సమతు ల్యత, ప్రాముఖ్యతను అయన నొక్కిచెప్పారు. విద్యార్థులకు 24 గంటలు రెండు రంగాలలో రాణించడానికి తగినంత సమయం ఇస్తుందని భరోసా ఇచ్చారు. విద్యార్థులు తమ సమయాన్ని తెలివిగా ఉపయోగించుకోవాలని డిజిటల్ పరధ్యానాలు వారి మొత్తం అభివృద్ధికి ఆటంకం కలిగి ంచవద్దని సలహా ఇచ్చారు. గౌరవానికి ప్రతిస్పందనగా, హర్షా భోగ్లే తెలియజేశారు. విద్యా లయం నుండి ఈ అవార్డును అందుకున్నందుకు హృదయపూర్వకంగా భావిస్తున్నానని ఈ పాఠశాల ఉన్న సమయంలో నేను పొందిన విలువలతో కూడిన విద్య నాకెరీర్‌ను రూపొం దించడంలో నా వృత్తిపరమైన ప్రయాణాన్ని నడిపించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. ఈ సందర్భంగా హెచ్పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ నోరియా మాట్లాడుతూ విశిష్టమైన రచనలు హర్షా భోగ్లే మా విద్యార్థులకు ఒక అద్భుతమైన ఉదాహరణగా మార్చాయని, వారిని మా సొంత వ్యక్తిగా పిలవడం చాలా గర్వంగా ఉందని తెలిపారు.

ఓయూలో జాతీయ ఓటర్ల దినోత్సవం



నవతెలంగాణ-ఓయూ

సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్‌యూ) ఆధ్వర్యంలో 75 వ, గణ తంత్ర దినోత్సవ వేడుకలను సంవత్సరం పాటు ప్రజా రాజ్యాధికార ఉత్సవం పేరుతో నిర్వహి స్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు అజయ్ పేర్కొన్నారు. దానిలో భాగంగా జనవరి 25 జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద (ఎస్‌టీఎస్‌యూ) ఆధ్వర్యంలో మాక్ ఓటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ.చింత గణేష్ పాల్గొని ఓటు వేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యావంతులు ఓటింగ్‌కి దూరంగా ఉండటం కలవర పెడుతుందని, ఇది ప్రజాస్వామ్య విజ యానికి విఘాతమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి అవగాహన పెంచాలని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రొ.విజయ, ప్రొ.చెరుకుపల్లి వంశీధర్, ఇతర ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఎస్‌టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ మాట్లా డారు. కార్యక్రమంలో వివిధ సంఘాల విద్యార్థి నాయకులు, 200 లకు పైగా విద్యార్థిని, విద్యా ర్థులు పెద్ద ఎత్తున మాక్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎస్‌యూ విద్యార్థి నాయకులు మోరే ప్రభాకర్, లింగంపెల్లి మనోజ్, అజ్జమారీ ప్రసాద్, అంజి, సాయి పాల్గొన్నారు.

కర్పూరి థాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై హర్షం

● ఓయూలో ఘనంగా కర్పూరి తాకుర్ శతజయంతి వేడుకలు

నవతెలంగాణ-ఓయూ



కర్పూరి తాకుర్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ రాచమల్ల జానయ్య ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బడుగుబలహీన వర్గాల నాయకుడు, కర్పూరి తాకుర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్పూరి తాకుర్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ రాచమల్ల జానయ్య ఆధ్వర్యంలో తాకుర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజేఎస్ పార్టీ వ్యవస్థాపకులు ప్రొ.కోదండరామ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్, ఇండస్ట్రీరిలిస్ట్ రాంబాబు, ప్రొ. కాశీం పాల్గొన్నారు. అనం తరం ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ రాచమల్ల జానయ్య మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ పుర స్కారం భారతరత్న అందుకున్న వారిలో 49వ వ్యక్తిగా పేరుపొందారని, అంతేకాకుండా ఎంబీసీ కులాల్లో మొదటి వ్యక్తిగా ఆయన నిలిచారన్నారు. బీహార్ రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్య మం త్రిగా, ఒకసారి ఉపముఖ్యమంత్రిగా తన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారయణ, ప్రొఫెసర్ బాగయ్య, షఫడ్ రాములు సార్, అస్వార్థమ రెడ్డి, అనుపమ మేడం, లక్ష్మయ్య అశోక్, శేఖర్, డాక్టర్ ఎన్.లింగం, కాశప్ప, రాచమల్ల అనిత, సంగమేష్, నోముల శంకర్ యాదవ్, మురారీ శ్రీధర్, జంపాల రాజేష్, వెంకట్, సతీష్, సైదారావు, పాల్గొన్నారు.

దత్తాత్రేయకు ఆహ్వాన పత్రిక అందించిన విద్యావేత్త శ్రీనివాస్

నవతెలంగాణ-కంటోన్మెంట్



మహబూబ్ కాలేజీ మేనే జింగ్ కమిటీ అధ్యక్షుడు పీ.ఎల్. శ్రీనివాస్ గురువారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా కలిశారు. ఫిబ్రవరి 13న ఎస్‌విఐటీ ఆడి టోరియంలో స్వామి వివేకానంద ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరు కావాలని దత్తాత్రేయను మర్యా ద పూర్వకంగా కలిసి ఆహ్వా న పత్రికను అందించి ఆహ్వానిం చినట్లు తెలి పారు. గవర్నర్ దత్తాత్రేయసమకృత చూపారని తెలియజేశారు.

బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం విజయవంతం



● కార్పొరేటర్ విజయరెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు గురువారం ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ విజయరెడ్డి తెలిపారు. ఈ సమావేశాంలో పాల్గొనేందుకు ఖైరతా బాద్ నియోజకవర్గం బూత్ లెవెల్ ఏజెంట్లతో కలిసి నియోజకవర్గ టీపీ సీసీ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే అభ్యర్థి పి విజయరెడ్డి హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ కర్గే,సీఎం ఎ.రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఇన్చార్జ్ దీపా దాస్ మున్షీతో పాటు తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారన్నారు.

ఫేమస్ అవ్వడానికి చాక్లెట్ దొంగతనం



● యువకుడిపై కేసు నమోదు

నవతెలంగాణ-బంజారాహిల్స్

సామాజిక మధ్యమాలలో గుర్తింపు కోసం చాక్లెట్ దొంగతనం చేసి దొరికిపోయిన యువకుడు పై పోలీసులు కేసు నమోదు చేయడంపై చాక్లెట్ దొంగతనానికి ఎన్ని కేసుల అంటూ సామాజిక మాధ్యమాలలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్న సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌కు చెందిన హనుమంత్ నాయక్ బుధవారం షేక్‌పేటలోని డిమార్ట్ మార్ట్ సేహితులతో కలిసి డిమార్ట్ మొత్తం తిరిగి అమ్మ డానికి పెట్టిన చాక్లెట్లు తినీ, ఇదంతా స్నేహితులతో వీడియో తీయించుకొని, తినడం సులువే అంటూ తినడం ఎలాగో నేర్పిస్తానంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అంతటితో ఆగకుండా బిల్లు చెల్లించకుండానే చాక్లెట్ ఎలా తిన్నానో చూడండి అంటూ కామెంట్ చేసి దొంగ తనం చేయడం చాలా సులభం అంటూ సందేశం పంపించాడు. ఈ వీడియో కాస్త వైరల్‌గా మారి డిమార్ట్ సిబ్బంది దృష్టికి వెళ్లింది. ఇది చిన్న విషయమే అయినా ఇతరులు కూడా ఇలాగే చేస్తే సం స్థకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని డిమార్ట్ మేనేజర్ ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోషల్ మీడియా వీడియో ఆధారంగా చాక్లెట్ దొంగిలించిన హను మంతు నాయక్‌ను గుర్తించిన పోలీసులు అతడిపై 420,379 తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.అతడికి సహకరించిన స్నేహితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఓయూలో జాతీయ ఓటర్ల అవగాహన సదస్సు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాలలో గురువారం జాతీయ ఓటర్స్ దినోత్సవన్ని ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చింత గణేష్ మాట్లా డుతూ ఓటు విలువను ఉద్దేశించి సమాజంలో రాజకీయ ప్రక్షాళన జరగాలన్న పాలకులు సం పన్న వర్గాలకు చేకూర్చే విధంగా పరిపాలన జరగాలన్న ఓటు వినియోగం డబ్బు కులం మతం వ్యత్యాసాలు చూడకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకో వాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో హెడ్‌ఆఫ్ ది డిపార్ట్మెంట్ పొలిటికల్ సైన్స్ ప్రొ.చంద్రునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు రేపటి భవిష్యత్తు అభివృద్ధి దిశగా వెళ్లాలంటే వారే కీలక పాత్ర తీసుకొని ఓటు యొక్క ప్రాధాన్యతను సమాజానికి చేకూర్చే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ ప్రొ. కొండానాగేశ్వర్ మాట్లాడుతూ. రాజ్యాధికారం దిశగా సంపన్న వర్గాలు ముందుకు సాగాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సం ఘాలు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఓయూ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు మేడ శ్రీను, వికాస్ యాదవ్,వినోద్ గౌడ్, వెంకట్, ప్రకాశ్, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఉద్యమ కారులు

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్కని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉద్యమకారుల సమస్యలను విన్న వించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను గుర్తించడాన్ని స్వాగతిస్తున్నట్లు చైర్మన్ కంచర్ల బద్రి పేర్కొ న్నారు. అలాగే ఉద్యమకారులపై ఉన్న కేసులతో పాటు ఉద్యమ కాలం నాటి పేపర్ కట్టింగ్స్, ఫోటోలు, వివిధ విద్యార్థి సంఘాలు, జేఏసీల ఆధ్వర్యంలో పనిచేసిన తదితర ఆధారాలతో గుర్తించి ప్రతి ఉద్యమకారునికి న్యాయం చేయాలని కోరారు. అలాగే స్వాతంత్ర సమర యోధుల మాదిరిగా తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో చెర్మెన్ కంచర్ల బద్రీతో పాటు కన్వీనర్ దోనేటి కృష్ణలత, కోఆర్డినేటర్స్ దూడపాక సురేష్, నారుమళ్ల మహదేవ్, ఈరంటి విజయ్, చంద్ర కాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనుల పూర్తి కోసం సహకరించండి



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ని ఆఫీసులో కలిసి గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెం డింగ్‌లో ఉన్న ఎస్ ఎన్‌డీపీ ప్రాజెక్టు పనులను, కొత్తగా ఇనాగ్రేషన్ అయిన పనులు మూడు నెల లైనా ప్రారంభించకపోవడం, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు రావడం లేదని అందువల్ల పనులు ఆగిపోవడం, టౌన్ ప్లానింగ్ సంబంధించిన సమస్యలు ప్రభుత్వ స్థలాలను అధికారులు సరిగ్గా పట్టించుకోకపోవడం లేదని కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. యూజీడీ కొత్త ప్రాజెక్టు పనులు పెద్ద చెరువు డ్రయినేజ్ వాటర్ చుట్టుపక్కన కాలనీ నుంచి రాకుండా చేయాలని కమిషనర్‌కీ కార్పొరేటర్‌తో కలిసి చేతన వినతి పత్రం ఇచ్చారు.

తార్నాకలో ఓటర్ల సమ్మేళనం

నవతెలంగాణ-ఓయూ



బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో నూతన ఓటర్ల సమ్మేళనాన్ని తార్నాకలోని నారాయణ కాలేజీలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ నూతన ఓటర్లతో ఈ సందర్భంగా నవ యువ ఓటర్లతో వర్చువల్‌గా మాట్లాడారు. దేశంలోని యువత ప్రజాస్వామ్యంలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న వాళ్ళందరూ దేశాభివృద్ధి కోసం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం నిత్య నూతన చైతన్యంతో ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్ర రావు, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బిజెపి నాయకులు సారంగపాణి, నాగేశ్వర్ రెడ్డి, ప్రభు గుప్తా, బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు రాజు నేత, మరియు మహంకాళి సికింద్రాబాద్ జిల్లా యువ మోర్చా నాయకులు అయ్యప్ప రెడ్డి, భరత్, హర్షిత, శివాజీ , గంగా, ఉపేందర్ యాదవ్, లడ్డు, అరవింద్, శ్రీనాథ్, సాయి, శ్రీకాంత్, చరణ్, రోహన్, ప్రభు, ఆశ పాల్గొన్నారు.

జెండా దిమ్మె కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయుల ఘర్షణ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ దళిత స్టడీ సర్కిల్ వద్ద ఉన్న బీఆర్ఎస్ జండా పైపునకు బుధవారం కాంగ్రెస్ నాయకులు జాతీ యజెండా రంగులు వేసినట్లు పలువురు స్థానికులు తెలి పారు. అనంతరం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయ కులు బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం రంగులు వేసిన ఇద్దరిని బోరబండ పోలీస్ స్టేషన్‌లో పిలిపించి విచారించినట్లు తెలిపారు. వెంటనే పోలీసులు జీహెచ్ఎంసీ సర్కిల్-19 అధికారులకు ఫిర్యాదు చేయగా వెంటనే వారు అక్కడ ఉన్న జెండా పైపును పూర్తిగా తొలగించారు. అనంతరం పోలీసులు, జీహెచ్ఎంసీ అధికా రులు వెళ్ళిపోగానే మరలా కాంగ్రెస్ నాయకులు పైపును ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండా ఎగరవేస్తామని కాంగ్రెస్ నాయకులు గట్టిపట్టుదలతో ఉన్నట్లు, ఈ విషయం తెలిసిన పోలీసులు మరలా గురువారం జీహెచ్ఎంసీ అధికా రులకు మరలా ఫిర్యాదు చేశామని బోరబండ ఇన్‌స్పెక్టర్ విజయ్ మీడియాకు తెలిపారు. బీఆర్ ఎస్ నాయకులు మరల అ జెండా పైపునకు గులాబీ రంగు వేసి జెండా ఎగరవేస్తామని అంటు న్నట్లు సమాచారం ఉన్నట్టు తెలిపారు. ఏది ఏమైనా దళిత స్టడీ సర్కిల్ ముందు ఇరువర్గాలు ఘర్షణ పడే వాతావరణ ఉన్నందున పోలీ సులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని , ఎటువంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకో వాలని స్థానికులు కోరుతున్నారు.

కామర్స్ కళాశాలను సందర్శించిన కేరళ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

కాలికట్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కేరళలోని తానూర్, మల్లాపురంలోని సీహెచ్ ఎంకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీకి చెందిన 30 మంది బి.కామ్ ఫైనల్ ఇయర్ విద్యా ర్థులు తమ అధ్యాపకులతో కలిసి గురువారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ కళశాల లో కామర్స్ విభాగాన్ని సందర్శించారు. వాణిజ్య శాస్త్ర హెడ్ ప్రొ.డి.చెన్నప్పతో పాటు సహచరులు ప్రొ. జి.నరేష్‌రెడ్డి, ప్రొ.ఎ.ప్యాట్రిక్, ప్రొ.సి.వి.రంజని, ప్రొ.ఐ.శేఖర్, డాక్టర్ కె.శ్రీనివాస్, పరిశోధనలు విద్యార్థులు ఎంకాం విద్యార్థులు, విజిటింగ్ టీమ్‌తో కలిసినట్లు తెలిపారు. వాణిజ్యంలో కెరీర్ అవకాశాల గురించి సమాచారాన్ని తెలుసుకున్నారు. అనంతరం సెంట్రల్ ఫెసిలిటీస్ అండ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ (సీఎఫ్ఆర్‌డీ) భవనంలోని ఉస్మానియా టెక్నాలజీ అండ్ బిజినెస్ ఇంక్యుబేటర్ (ఓటీబీఐ)ని సందర్శించారు.

బైక్‌ను ఢీకొన్న కారు..నిందితులు అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 5గంటలకు జూబ్లీ హిల్స్ పెద్దమ్మ గుడి వద్ద, అతివే గంగా కారుతో టూవీలర్ టీఎస్10/ఈఈ-2802ను ఢీకొట్టిన ఘటనలో ఒకరి మృతి చెందిగా, మరొకరికి గాయాలైన ఘటన చోటు జూబ్లీహిల్స్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్(ఐపీ ఎస్) ఆదేశాల మేరకు నడిపిన డ్రైవర్‌తోపాటు కారులో ఉన్న ఐదుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెస్ట్ జోన్ డీసీపీ తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఏ వన్ కొవ్వూరి రుతిక్‌రెడ్డి(21), తుకారం గేట్ సికింద్రాబాద్ తన బావకారు నెం.టీఎస్ 08/జీఎస్-6663 కారును డ్రైవ్ చేస్తూ తన స్నేహితు లైన వైష్ణవి (23), లోకేశ్వర రావు(21), బుల్లఅభిలాష్(20), ఎం.అనికేత్ (22), జి.సురేష్‌రెడ్డి (27)లు మద్యం సేవించి కారు నడుతుపూ అతివేగంగా అటుగా వెళ్తున్న టూవీలర్‌ని ఢీకొట్టింది. టూవీ లర్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.నిందితులలో జి.సురేష్‌రెడ్డి (27)లు పరారీలో ఉన్నట్టు తెలిపారు. తాగి నడుపుతున్న వ్యక్తికి కారులో ఉన్న మిగతా వారు మద్దతు ఇచ్చినట్లుగా భావించి కారులో ఉన్న ఐదు గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వెస్ట్ జోన్ డిసిపి ఆదేశాల మేరకు ఏసీపీ కట్ట హరి ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది సీసీ కెమెరాలు పరిశీలించి వెంటనే నిందితులను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానించిన డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరామ్ ఎంపికైనా శుభ సందర్భంలో గురు వారం టీఎస్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్‌ను డాక్టర్ ముజీబ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కోదండరామ్ సేవలు ఇటు ఉద్యోగులకు.. అటు నిరుద్యోగులకు చాలా అవసరమమని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో వారి నాయకత్వంలో రాష్ట్రం మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు బొల్లిగిద్ద శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం వద్ద కారులో మంటలు



నవతెలంగాణ - బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్ర సచివాలయం సమీపంలో ప్రధాన రహదారిపై గురువారం రాత్రి కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో కారులో ప్రయాణిస్తున్నవారు వెంటనే కిందకు దిగి,విలువైన వస్తువులను బయటకు తీసుకోని పరుగులు చేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.కారులో మంటలు రావడంతో వాహన చోదకులు భయాందోళనకు గురయ్యారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

ఆటో డ్రైవర్లకు జీవన భృతి రూ.4500 ఇవ్వాలి



- రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఎఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని ఆహ్వానిస్తున్నామని, అదే సమయంలో దీనివల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు.. గీత, నేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్టుగా జీవన భృతి నెలకు రూ.4500 ఇవ్వాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర, హైదరాబాద్ జిల్లా సౌత్, సెంట్రల్ కమిటీలు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్, సెంట్రల్ సిటీ కార్యదర్శి కె.అజయ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 25లక్షల మంది కార్మికులు రవాణా రంగం మీద ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత ఫ్రీ బస్ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల ఆదాయం తగ్గిందని.. వెంటనే వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మూడు నెలల పాటు ఆటోల మీద ఈఎంఐపై మారిటోరియం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో, క్యాబ్, గూడ్స్, ట్రాన్స్‌పోర్టు, బస్సు తదితర అన్నిరకాల ప్రయివేట్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ఇది ప్రభుత్వం మీద పెద్దగా భారం పడకుండానే చేయవచ్చునని వారు సూచించారు. ప్రయివేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ఒక ఆన్‌లైన్ యాప్ తీసుకువచ్చి తక్కువ కమీషన్‌తో కార్మికులకు బిజినెస్ ఇవ్వాలని, కేరళ తరహా సవారీ యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక భారం లేకుండానే చేయవచ్చునన్నారు. రాష్ట్రంలో ఎం.వీ యాక్ట్-2019 సవరణ చట్టం అమలు చేయొద్దని, ఆ సవరణను ఉపసంహరించుకునే విధంగా కేంద్రం మీద ఒత్తిడి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రమాద బీమా రూ.5 లక్షలు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్యం మొత్తం రవాణారంగ కార్మికులకు వర్తింపజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ కార్యదర్శి ఎల్. కోటయ్య, టీఆర్‌సీపీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కె.సతీష్, ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ నగర నాయకులు ఎండీ ఆసిఫ్, అలీ అబ్బాస్, ఎండీ బాబా, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

- ఆర్టీవో సదానందం

నవతెలంగాణ-సిటీబ్యూరో

డ్రైవర్లు తరుచూ తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించు కోవాలని సౌత్ జోన్ ఆర్టీవో జి.సదానం దం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సౌత్ జోన్ ఆర్టీఏ కార్యాలయంలో లారీ, ఆటో, స్కూల్ బస్సు, ఇతర వాణిజ్య వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అంతకు ముందు కార్యాలయ ప్రాంగణంలో ఆర్టీవో సదానందం ఎంవీఐలు, ఏఎంవీఐలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం అగర్వాల్ కంటి ఆస్పత్రి డాక్టర్ స్టాన్లీ ఆధ్వర్యంలో సుమారు 60 మంది డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో సదానందం మాట్లాడుతూ డ్రైవర్లకు కంటిచూపు ముఖ్యమని, ప్రతీ సంవత్సరం కంటి పరీక్షలు విధిగా చేయించుకో వాలన్నారు. రహదారి నిబంధనలతో పాటు ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గణతంత్ర వేడుకల నేపథ్యంలో గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, వీఐపీలు, వీవీఐపీలతోపాటు ప్రము ఖులు, అభిమానులు, సందర్శకులు భారీ సంఖ్యలో వివిధ ప్రాంతాల్లో హాజరు కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వేడులకు హాజ రయ్యే వారికోసం వివిధ ప్రాంతాలల్లో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్, సికింద్రా బాద్ పరేడ్‌గ్రౌండ్ ప్రాంగణంతోపాటు వివిధ ప్రాంతాల్లో సీసీకెమెరాలను ఏర్పాటుచేశారు. వాటిని కమిష నరేట్ లోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. అక్కడి నుంచే అధికారులు అనుక్షణం పర్యవేక్షిస్తారు. భద్రతకు అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వివిధ జంటనగరాల్లో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో వుంటాయని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వేడులకు హాజరయ్యే వారు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

గణతంత్ర వేడుకలకు భారీ బందోబస్తు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గణతంత్ర వేడుకల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో వేడుకలతోపాటు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ కార్యక్రమాలు కొనసాగనుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శివారు ప్రాంతాలతోపాటు పాతబస్తీ, కోఠీ, బంజారాహిల్స్, ఫిల్మింనగర్, ఉప్పల్, ఎల్బీనగర్, మాదాపూర్, ఐటీకారిడార్, గచ్చిబౌలీ, మేడ్చల్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలల్లో పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వేడుకల్లో పాల్గొనే వారు ఎలాంటి ప్లాస్టిక్ కవర్లు, టిఫిన్ బాక్స్‌లు, బ్యాగ్‌లు వెంట తీసుకొని రావద్దని, పాసులు కలిగిన వారు పోలీసులు సూచించిన మార్గాల్లో లోనికి వెళ్లాలని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-ఉప్పల్
శుక్రవారం | జనవరి 26, 2024 | www.navatelangana.com



ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, హెచ్‌సీఏ చైర్మెన్ జగన్ మోహన్ రావు,మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్,బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు. నవతెలంగాణ-కాప్రా



ఎల్బీ స్టేడియంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూత్ లెవెల్ కన్వీనర్ల శిక్షణ శిబిరంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పత్తి కుమార్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధు మోహన్ ముఖేందర్, బాల నర్సింహ, సింగం కిరణ్, పాతకోటి రామలింగం, విజయ్, సాయి, సాల్మన్ తదితరులు.
నవతెలంగాణ-కాప్రా



100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయండి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్ర రెడ్డి

నవతెలంగాణ-కీసర

100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్ర రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో ,బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మెన్ మాట్లాడుతూ 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ 100 శాతం వసూలు చేయాలని బిల్ కలెక్టర్లను, లైసెన్స్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి .రాజేందర్ కుమార్, మేనేజర్ చంద్రశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించిన మాజీ కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా

శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడిని మాజీ కార్పొరేటర్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు పావని మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యల గురించి వివరించారు. అదేవిధంగా కాలనీలో సీనియర్ సిటిజన్ సీనియర్ సిటిజన్ భవనం కోసం విజ్ఞప్తి చేస్తూ రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీ అధ్యక్షులు సిహెచ్. బాలనరసింహ వంశరాజ్, ఉపాధ్యక్షులు వి. రంగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. వి. వరప్రసాద్, కమిటీ సభ్యులు ఎస్. ఎం. ప్రసాద్, బి. గణేష్ నాయక్, ఏ. శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ పరిధిలోని అర్బన్ మలేరియా యూనిట్ విభాగంలోని ఫాగింగ్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న డేవిడ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఊదరి గోపాల్ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ. పదివేలతో పాటు కాంట్రాక్టర్ ప్రభాకర్ పదివేల రూపాయలు మొత్తం రూ. 20 వేలను ఎంటమాలజీ సర్కిల్ ఏఈ రమేష్, అధ్యక్షుడు మల్లేష్ సూచన మేరకు గ్రేటర్ హైదరాబాద్ ఎంటమాలజీ జనరల్ సెక్రెటరీ పరమేష్.. మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతక్రియల కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎంటమాలజీ సిబ్బంది పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చి రానున్న రోజుల్లో కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంటామని ధైర్యం చెప్పడంతో పాటు అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు.



కాంగ్రెస్ ఘట్కేసర్ మున్సిపల్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఘట్కేసర్

కాంగ్రెస్ ఘట్కేసర్ మున్సిపాల్టీ కమిటీ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించారు. ఈ మేరకు పీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ నియామక ఉత్తర్వు గురువారం జారీ చేశారు అధ్యక్షుడిగా మామిండ్ల ముత్యాలు యాదవ్ ను గతంలో నియమించగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ మచ్చేందర్ రెడ్డి ఉపాధ్యక్షులుగా కోరుబోతు నాగరాజు ముదిరాజ్, బొక్క ప్రభాకర్ రెడ్డి, ఎస్ కే వాజిద్, ప్రధాన కార్యదర్శిగా బర్ల రాధాకృష్ణ ముదిరాజ్‌లను నియమించారు. కోశాధికారిగా పి శశిధరన్, సహాయ కార్యదర్శులుగా మన్నె సత్తిరెడ్డి, తోకరాజు ఇరిటం శ్రీనివాస్, మామిళ్ల మహేష్, సామల శ్రీనివాస్, తన్నీరు హరీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ గా తోక మల్లేష్, ఎస్ భాను గౌడ్, ఎస్.కె జమీర్, కే బాబురావు, ఎస్ ప్రసాద్, సలహాదారులుగా కొంతం రామ్ రెడ్డి, కేశవపట్నం ఆంజనేయులు, కొంతం బాల్ రెడ్డి, సగ్గు శ్రీనివాస్, రాజు, జి సంజీవరెడ్డి, ఎంఎ రెహమాన్, అనుబంధ విభాగాలైన బీసీ సెల్ అధ్యక్షులుగా వీరేందర్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మోత్కుపల్లి శ్రీనివాస్, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఫారుక్, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా కుతాడి సురేష్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



టీడీపీ నాయకులు గోబేరు రమేష్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-కాప్రా

డా: ఏ యస్ రావు నగర్ డివిజన్ శ్రీనివాస నగర్ కాలనీ వాస్తవ్యుడు టీడీపీ సీనియర్ నాయకుడు గోబేరు రమేష్ పుట్టిన రోజు సందర్భంగా వారి నివాసానికి నీరుకొండ సతీష్ బాబు, ఏనుగు సీతారాం రెడ్డి, రమేష్, చందు వెంకటేష్ తదితరులు వెళ్లి పుట్టిన రోజు శుభాకంక్షలు తెలియజేశారు.

అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- పట్టించుకోని పాలకులు..!
- రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చే ప్రజలకు టాయిలెట్స్,తాగు నీరు లేక ఇబ్బందులు
- లిఫ్ట్ లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు,వికలాంగులు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కేంద్రమైన మేడ్చల్ పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనంలో కొనసాగుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న పురాతన భవనంలో కొనసాగింది. కాగా వర్షాకాలంలో పెచ్చులు ఉండడం, పురాతన భవనం కావడంతో మేడ్చల్ జాతీయ రహదారి 44 పక్కన ఉన్న బహుళ అంతస్తుల భవనంలోకి మార్చారు. ఈ అద్దె భవనంలో జిల్లా రిజిస్ట్రార్,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. వీటికి గాను నెల నెల వేల రూపాయల కిరాయి చెల్లిస్తున్నారు. గతంలో మేడ్చల్ నియోజకవర్గం నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సరైన చొరవ చూపకపోవడం వల్లే జిల్లా, సబ్ రిజిస్టర్ కార్యాల యాలకు సొంత భవనాల నిర్మాణం కార్యరూపం దాల్చలేదని విమర్శలు ఉన్నాయి. మేడ్చల్ పట్టణంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం నిర్మించడానికి తగిన ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు నిర్మించు కోకపోవడం పట్ల స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమని పలువురు విమర్శిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చే వృద్ధులు, వికలాంగులు రెండో అంతస్తులో ఉన్న కార్యాలయానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలైన టాయిలెట్స్, తాగు నీరు,కూర్చోవడానికి సైతం సరిపడా కుర్చీలు లేని దుస్థితి ఇక్కడ ఉన్నది. రెండో అంతస్తు వెళ్లడానికి లిఫ్ట్ ఉన్నా అది పనిచేయని స్థితిలో ఉంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిం చాలని పలువురు కోరుతున్నారు.

శాశ్వత భవనం ఏర్పాటు చేయాలి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సరైన మంచినీటి సౌకర్యం, టాయిలెట్స్, సరిపడ కుర్చీలు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా ప్రస్తుత మున్న ఉన్న ప్రయివేటు బిల్డింగ్ లో తక్కువ స్థలం ఉండడంవల్ల మౌలిక సదుపాయాల కల్పనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వీలైనంత తొందరగా స్థానిక ప్రజాప్రతి నిధులు జోక్యం చేసుకొని శాశ్వత ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేసి జిల్లా,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనసాగించాలి.

\- బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోదా అరుణ్ యాదవ్

ఒకే కాన్పులో నలుగురు పిల్లలు





- తల్లి పిల్లలు క్షేమం,
- మెరుగైన వైద్య చికిత్సకు నిలోఫర్ ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ- మేడ్చల్

ఓ మహిళకు ఒకే కాన్పులో నలుగురు చిన్నారులు ప్రసవించారు. మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం గ్రామానికి చెందిన సులోచనకు మెదక్ జిల్లా నర్సాపూర్ కు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది.సులోచన గర్భం దాల్చి నెలలు నిండడంతో గురువారం ఆమె కుటుంబ సభ్యులు ఘనపూర్ గ్రామంలో ఉన్న మెడిసిటీ ఆస్పత్రిలో చేర్చారు. కాన్పులో సులోచనకు మొదటగా మగబిడ్డ 800 గ్రాములు, రెండోసారి మరో మగబిడ్డ 500గ్రాములు ,మూడోసారి ఇంకో మగబిడ్డ 100గ్రాములు, నాలుగో సారి ఆడబిడ్డ 900గ్రాముల బరువుతో జన్మించినట్లు వైద్యులు తెలిపారు.ఇదే విషయమై గైనకాలజిస్ట్ డాక్టర్లు కల్పన, నిషిలు మాట్లాడుతూ తమ ఆస్పత్రి చరిత్రలో ఇలాంటి కాన్పు జరగడం ఇదే మొదటిసారిని చెప్పారు.పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం వల్ల హైదరాబాద్ లోని నిలోఫర్ పిల్లల ఆస్పత్రికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తరలించినట్లు డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం తల్లి,పిల్లలు క్షేమంగా ఉన్నారని అన్నారు.



గ్రామాల అభివృద్ధికి సర్పంచుల విశేష కృషి



- ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గంలోని గ్రామాలలో సర్పంచులు విశేషంగా కృషిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించారని మాజీ మంత్రి,ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం, లింగాపూర్ గ్రామాలలో పర్యటించి నూతనం గా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలు, డ్వాక్రా మహిళా భవనాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనం తరం లింగాపూర్, బర్మాజిగూడలలో నూతనంగా ఏర్పాటు చేసిన బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాలను సర్పంచులు సుందరంగా తీర్చిదిద్దారని అన్నారు.గ్రామాలలో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు,నర్సరీలను,వైకుంఠధామాలు,ట్రాక్టర్ లు,తాగు నీరు,విద్యుత్ స్తంభాలా ఏర్పాటు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఇన్ని రోజులుగా గ్రామాల అభివృద్ధికి సహకరించిన సర్పంచ్ లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బైరి లక్ష్మీ సంజీవ, విజయానంద రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద రెడ్డి,వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి,బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్,బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు దయానంద్ యాదవ్,ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, రాజమల్లారెడ్డి, భాగ్యరెడ్డి, సర్పంచ్ లు, ఎంపీటీసీలు,అధికారులు,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలి : ఎమ్మెల్యే



ఘట్కేసర్ : వ్యాపారులు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు పోచారం మున్సిపాలిటీ నారపల్లి పరిధి కొర్రెముల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సన్నీ సైడ్ బేకరీని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, పోచారం మున్సిపాలిటీ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మెన్ రెడ్యానాయక్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ సింగిరెడ్డి రాంరెడ్డి, చౌదరి గుడా సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్, కొర్రెముల సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్, ఎంపీటీసీ పులికంటి భాస్కర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ సుర్వి రవీందర్ గౌడ్, చౌదరిగుడా ఉపసర్పంచ్ కుర్ర మహేందర్ గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి వెంకటసాయి నగర్ ఎకో ఫ్రెండ్లీ టౌన్షిప్ ఫేస్- వన్ కాలనీ అధ్యక్షుడు గుర్రాల పార్థివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలి'



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్ర రెడ్డి
- ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం

నవతెలంగాణ-కీసర

మతం,జాతి, ప్రాంతం, కులం, వర్గం, భాష ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్ర రెడ్డి అన్నారు. నాగారం పురపాలక సంఘం కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఓటరు కూడా మతం,జాతి, ప్రాంతం, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ఓటు హక్కు వినియోగించుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్ ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మాయిగూడాలో ...

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యజాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. భారత దేశ పౌరులమయిన తాము, ప్రజాస్వామ్య సాంప్రదాయంలను, స్వేచ్ఛాయుత , నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడి లకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని అందరితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ. చిరంజీవులు, మేనేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు కోసం అగ్రీకల్చర్ యూనివర్సిటీ భూములా..?

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-కాప్రా

హైకోర్టు కోసం అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను కేటాయించడం అన్యాయమని, జీవో నెంబర్ 55 వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం ఈసీఐఎల్ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్ పరిశోధనలకు, జీవవైవిధ్యానికి నష్టం చేసే చర్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర హైకోర్టు నిర్మాణానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను 100 ఏకరాలు కేటాయించడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ రంగానికి, భవిష్యత్ పరిశోధనలు, నూతన భవనాలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం ఆలోచించకుండా హైకోర్టుకు భూమి ఇచ్చేసి చేతులు దులుపుకుందామనే ఆలోచనను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. యూనివర్సిటీ ముందు గత 17 రోజులుగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థుల పోరాటానికి ఎస్ఎఫ్ఐ సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీని సంప్రదించకుండా 100 ఎకరాలు ఉద్యానవన యూనివర్సిటీ 43.6 ఏకరాలు, 57.4 ఏకరాలు వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టు నిర్మాణానికి అగమేఘలపై నిర్ణయం తీసుకోని జీ.వో.నెం : 55 తీసుకుని వచ్చారని దీని వల్లన యూనివర్సిటీలో ఉన్న 400 రకాల వృక్ష జాతులు 80 రకాల పక్షుల జాతులు 350 అరుదైన జాతులు అంతరించి జీవవైవిధ్యం నష్టపోయ్యే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతన విత్తన అభివద్ధి, వంగడాలు అభివద్ధి, వ్యవసాయంలో నూతన సంస్కరణలు అమలుకు వేలాది ఎకరాల భూమి అవసరం అని ఆ భూములను యూనివర్సిటీకి ఉంచి హైకోర్టు కోసం వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాప్రా మండల అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, శ్యామ్ రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్,బాలాజీ, నిఖిల్,మనీష్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్ డివిజన్ కౌండిన్య భవన్ లో మహిళా సమాఖ్య సంఘం సమావేశం లో ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ మహిళా సమాఖ్య సంఘాలకు అనేకమైనటువంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టడం జరిగిందని.. మహిళా సంఘం సభ్యులు తాము తీసుకున్న రుణాలను సక్రమంగా వడ్డీలు చెల్లిస్తూ రికవరీలు చేసినట్టయితే సంఘాలు అభివృద్ధి చెందుతాయన్నారు. తమ జీవనోపాధులను కూడా చక్కదిద్దుకోవచ్చునని ఈ సందర్భంగా తెలిపారు..ఈ కార్యక్రమానికి డీసీ ముకుంద్ ,మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజేన్ శేకర్ , ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రెసిడెంట్ ఊర్మిళ ప్రధాన కార్యదర్శి ముంతాజ్ సీఓలు, మహిళా సమాఖ్య సంఘాల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు . నవతెలంగాణ-కాప్రా

సిల్వర్ క్రెస్ట్‌లో అభివృద్ధి పనులకు బీఎల్ఆర్ ట్రస్ట్ సహకారం

నవతెలంగాణ-కాప్రా



కాప్రా డివిజన్ పరిధిలోని జనప్రియ సిల్వర్ క్రెస్ట్ కాలనీలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ యువ నాయకులు బైరి నవీన్ గౌడ్ గురువారం కాలనీ సంఘం నేతలతో కలిసి పర్యటించారు. కాలనీని ఏర్పాటు చేసిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అక్కడ కనీస మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. అనేక అభివద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల వంటి సమస్యలు నెలకొన్నాయి. ఈ మేరకుకాలనీ వాసులు దశాబ్ద కాలంగా పడుతున్న ఇబ్బందులను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 1.50 కోట్లతో 'సిల్వర్ ట్రస్ట్ కాలనీలో రోడ్లు, విద్యుత్ స్తంభాలు, దీపాలు, ఫుట్ పాత్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో కాలనీలో అభివద్ధి పనులను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రజిత, కార్యదర్శి విపణి, రాఖీ, కిరణ్ కుమార్, రాంగోపాల్, అంబేష్, స్వర్ణలత, దినేష్ పాల్గొన్నారు.

'బ్యూటిఫుల్ హెూమ్స్' ను ప్రారంభించిన ఏషియన్ పెయింట్స్

నవతెలంగాణ-కాప్రా



దేశంలోనే అతిపెద్ద పెయింట్, అలంకరణ సంస్థ ఏషియన్ పెయింట్స్ తన ప్రీమియం 'బ్యూటిఫుల్ హెూమ్స్' అనే మల్టీ క్లాస్ డెకోర్ షోరూంను ఏఎస్‌రావునగర్‌లో ప్రారంభించింది. శివాస్ ఎన్ క్లేవ్‌లోని బందావన్ కాలనీలో ఉన్న కొత్త ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హెూమ్స్ స్టోర్‌లో కస్టమర్ సర్వీస్, అనుభవాలను పెంపొందించే సాంకేతిక ధోరణులతో ప్రత్యేకమైన అద్భుతమైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి సిద్ధంగా ఉంది. అత్యాధునిక స్టోర్ ను ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ సింఘాల్ ప్రారంభించారు. ఈ స్టోర్ వాణిజ్య ప్రదేశాల కోసం అనేక కేటగిరీలలో ఉత్పత్తులను ప్రదర్శిస్తుంది.

నాలుగు అంతస్తుల్లో 5,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న బ్యూటిఫుల్ హెూమ్స్ స్టోర్ ఫర్నీచర్, స్నానాలు, లైట్లు, బట్టలు, కార్పెట్లు, మాడ్యులర్ కిచెన్లు, వార్డ్ రోబ్ లు, పరుపులు, అందమైన గహాల పెయింటింగ్ సేవలు, మరెన్నో అన్ని హెూమ్ కేటగిరీలలో వైవిధ్యమైన ఉత్పత్తులను ప్రదర్శించే వన్ స్టాప్ షాప్. వైట్ టీక్ , వెదర్‌సీల్ విస్తత శ్రేణి యుపివిసి కిటికీలు తలుపుల వ్యవస్థ నుండి అద్భుతమైన అలంకరణ కాంతి సేకరణను కూడా సందర్శకులు అన్వేషించవచ్చు. 'ఫైజిటల్లకల్ , డిజిటల్ అనుభవాన్ని స్వీకరించి, వినియోగదారులు వారి ఇంటి అలంకరణ అవసరాలకు అనుగు ణంగా బలమైన శీఘ్ర నిర్ణయాలు తీసుకోవడంలో సహాయ పడటానికి స్టోర్ రూపొందించారు. ఇది వినియోగదారులు వారి ప్రదేశాలను విజువలైజ్ చేయడానికి సహాయపడుతుంది, తద్వారా కొనుగోలు నిర్ణయం తీసుకునే ముందు సరైన అలంకరణ డిజైన్‌ను ఎంచుకోవడానికి వారికి వీలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. అలంకరణ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ ను మార్కెట్ ప్రదర్శించింది. వారి గహాల కోసం అసాధారణమైన, కొత్త ఉత్పత్తులు, డిజైన్లు, సరఫరాలు, ఆలోచనలను ఒకే పైకప్పు కింద చూసింది. ఈ అవసరాన్ని గుర్తించిన ఏషియన్ పెయింట్స్ తన రెండో ప్రీమియం బ్యూటిఫుల్ హెూమ్స్ స్టోర్ ను నగరంలో ప్రారంభించింది.



భారత రాజ్యాంగం మహిళకు ఎన్నో హక్కులను కల్పించింది. కానీ వాటిపై అవగాహన ఉన్న వారి సంఖ్య చాలా తక్కువ. ప్రపంచంలో సాంకేతికత పరుగులు పెడుతున్నప్పటికీ ఎంతో మంది మహిళలు రాజ్యాంగం తమకు ఏ హక్కులు ఇచ్చిందో కూడా తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికీ అసమానతనూ, వివక్షనూ ఎదుర్కొం టూనే ఉన్నారు. ఈ రోజు గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం మహిళల కోసం ప్రత్యేకంగా చేసిన చట్టాలు, హక్కుల గురించి తెలుసుకుందాం. వాటిని కాపాడుకుందాం...

రాజ్యాంగం ఆమెకిచ్చిన హక్కులు

మన రాజ్యాంగాన్ని రూపొందించిన సమయంలో రాజ్యాంగ నిర్మాతలు రెండు లింగాల మధ్య సామాజిక, ఆర్థిక అసమానతలను గమనించారు. అందుకే రాజ్యాంగంలో ఇద్దరికీ సరైన సామాజిక, రాజకీయ మద్దతును అందించారు. తద్వారా ఈ అసమానత తొలగించబడతాయని ఆశించారు. కానీ రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏండ్లు గడుస్తున్న మహిళల జీవితాల్లో మార్పు మాత్రం లేదు. ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు' అని చెబుతుంటారు. కానీ మన దేశంలో పూజించడం సంగతి తర్వాత కనీసం మనిషిగా కూడా చూడడం లేదు. ప్రస్తుత కాలంలో మహిళల పరిస్థితి మరింత దుర్భరంగా తయారయింది. ఇటువంటి పరిస్థితుల్లో భారత రాజ్యాంగం మహిళలకు ఇచ్చిన హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా తమ గౌరవానికి, జీవనానికి, మర్యాదకు భంగం కలిగినప్పుడు ప్రతి మహిళా ఈ హక్కులను వినియోగించుకొని తమను తాము రక్షించుకోవచ్చు.

ఉచిత న్యాయ సహాయం

పేద మహిళలకు ఇది వరం లాంటిది. డబ్బులు ఖర్చు పెట్టి న్యాయవాదిని పెట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్న పేద మహిళలు కోసం దీన్ని రూపొందించారు. నిరుపేదలు న్యాయ సేవలను అందుకోవడం కోసం తమ దగ్గరలోని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే వారు ఉచితంగా న్యాయ సహాయాన్ని అందించే లాయర్‌ను నియమిస్తారు. అలాగే లైంగిక వేధింపులకు గురైన మహిళలకు ఉచిత న్యాయసేవా హక్కులను కూడా భారత రాజ్యాంగం కల్పించింది.

రాత్రిపూట అరెస్టు కాకుండా...

1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 46లోని సబ్ సెక్షన్ (4) ప్రకారం సూర్యాస్తమయం తర్వాత లేదా సూర్యోదయానికి ముందు ఒక మహిళను అరెస్టు చేయాలంటే పోలీసులు ముందుగా కోర్టు అనుమతిని తీసుకోవాలి. అలా ఎలాంటి అనుమతి లేకుండా మహిళలను రాత్రిపూట అరెస్టు చేసే అధికారం ఎవరికీ ఉండదు.



మాతృత్వపు హక్కులు

ప్రసూతి ప్రయోజనా చట్టం ప్రకారం ప్రసవం తర్వాత ప్రతి మహిళకు ఆరు నెలల పూర్తి సెలవు కేటాయించారు. ఆ ఆరు నెలల్లో పూర్తి జీతాన్ని కూడా అందించేలా చట్టంలో మార్పులు చేశారు. ప్రసూతి ప్రయోజన చట్టం అనేది ప్రసవానికి ముందు, తర్వాత మహిళలు ఎలా ఉపాధి పొందుతున్నారు, అలాగే ప్రసూతి ప్రయోజనాలను ఎలా అందించాలి అనే అంశాలపై పనిచేసే ముఖ్యమైన చట్టం.

గోప్యంగా వివరాలు...

లైంగిక దాడులు, వేధింపులకు గురైన బాధితుల పేర్లు గాని, వారి గుర్తింపును గాని బయట పెట్టకూడదని చెబుతోంది రాజ్యాంగం. అలాగే లైంగిక దాడులకు, వేధింపులకు గురైన మహిళల వాంగ్మూలాలను మహిళా పోలీస్ అధికారి లేదా కానిస్టేబుల్ ఎదుట మాత్రమే రికార్డు చేయాలని కూడా చట్టం చెబుతోంది. బాధితురాలి పేరు, గుర్తింపు, ఫోటోలను బయట ప్రపంచానికి విడుదల చేయకూడదని కూడా హెచ్చరిస్తోంది.



సమాన వేతనం

సమాన వేతన చట్టం కింద మహిళలకు జీతం విషయంలో లింగ వివక్ష చూపించకూడదని చట్టం నిర్దేశించింది. శ్రామిక మహిళలకు, పురుషులతో పోలిస్తే సమాన వేతనాన్ని తీసుకునే హక్కు ఉంది.

గృహహింస

భారత రాజ్యాంగంలోని సెక్షన్ 498.. భర్త చేతిలో గృహ హింసకు గురైన భార్యా, తల్లి లేదా సోదరికి రక్షణ కల్పించే చట్టం. ఇంట్లో మహిళను ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా, మౌఖికంగా ఎలా వేధించినా దాన్ని నేరంగానే పరిగణిస్తారు. నిందితుడికి నాన్ బెయిలబుల్ వారెంట్ వస్తుంది. శిక్ష మూడేండ్ల వరకు ఉండొచ్చు. గృహహింస నుంచి స్త్రీని కాపాడేందుకే ప్రత్యేకంగా ఈ చట్టం ఉంది. ఈ చట్టాన్ని ఇప్పుడు ఎక్కువ మంది స్త్రీలు వినియోగించుకుంటున్నారు.

పని ప్రదేశాల్లో...

వర్క్ ప్లేస్‌లో మహిళల లైంగిక వేధింపులను తీవ్రంగా పరిగణిస్తుంది లైంగిక వేధింపుల చట్టం. పని ప్రదేశంలో వేధింపులకు గురయ్యే స్త్రీలు ఫిర్యాదు చేసే హక్కును కలిగి ఉన్నారు. ఈ చట్టం ప్రకారం ఆమె మూడు నెలల వ్యాధిలో అంతర్గత ఫిర్యాదుల కమిటీకి రాతపూర్వకంగా తన గోడును వెళ్ళబోసుకోవచ్చు.

శనగలు, మినుములు, రాజ్మా, కందులు, పెసర్ల వంటివి తరచుగా తింటూనే ఉంటాం. ఇలాంటి పప్పుల్లో, చిక్కుడుజాతి గింజల్లో పీచు, ప్రోటీన్లు దండిగా ఉంటాయి. అందువల్ల ఇవి త్వరగా కడుపు నిండిన భావన కలిగిస్తాయి. వెంటనే ఆకలి కాకుండా చూస్తాయి. నెమ్మదిగా జీర్ణమవుతూ రక్తంలోకి చక్కెర వెంటనే విడుదల కాకుండా చేస్తాయి. అంతేకాదు శరీరానికి బలాన్ని ఇవ్వటంతో పాటు జబ్బులను నివారించుకునే శక్తినీ అందిస్తాయి. కాబట్టి కొన్ని బీన్స్, పప్పులు మనకు ఎలాంటి మేలు చేస్తాయో తెలుసుకుందాం.

పప్పులతో ఆరోగ్యం!



కాబూలీ శనగలు : వీటిల్లోని పీచు రక్తంలో చక్కెర మోతాదులు స్థిరంగా ఉండేందుకు తోడ్పతుంది. అందువల్ల కాబూలీ శనగలను తరచుగా తీసుకుంటే మధుమేహం ముప్పు తగ్గటానికి తోడ్పడతాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను (ఎల్డీఎల్), ట్రైగ్లిజరైడ్‌లను తగ్గిస్తాయి. ఫలితంగా గుండెజబ్బులూ దూరంగా ఉంటాయి. అయితే వీటిని తక్కువ మోతాదులోనే తీసుకోవాలి. అప్పుడే ఎక్కువ లాభాలు.

పప్పులు : కందులు, పెసర్ల వంటి పప్పులు క్యాన్సర్ల బారినపడకుండా కాపాడతాయి. తరచుగా పప్పులు తినే మహిళలకు రొమ్ముక్యాన్సర్ ముప్పు తక్కువగా ఉంటున్నట్టు అధ్యయనాల్లో వెల్లడయింది. ప్రోస్టేట్, మలద్వార క్యాన్సర్‌ల బారినపడకుండా కాపాడుతున్నట్లు వెల్లడైంది. వీటికి రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గించే శక్తి ఉంది.

రాజ్మా : విషయ గ్రహణ శక్తిని పెంపొదించే ఒమేగా, కొవ్వు ఆమ్లాలు రాజ్మాలో అధికంగా ఉంటాయి. అలాగే క్యాన్సర్‌ను నివారించే యాంటీఆక్సిడెంట్లూ, అల్జీమర్స్ బారినపడకుండా చూసే థైమీన్ కూడా దండిగానే ఉంటాయి.

ఉలవలు : ఇనుము, క్యాల్షియం, మాలిబ్డినమ్ వంటివి ఉలవల్లో దండిగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్ గుణాలున్న ఫాలీఫెనాల్స్ ఎక్కువగా ఉండటంతో క్యాన్సర్‌ల నివారణకు ఉపయోగపడతాయని తేలింది. యాంటీబాడీలు, స్వీయరోగనిరోధక చర్యల్లో కనిపించే హీమగ్లుటినిన్ కూడా వీటిల్లో కనిపిస్తుంది. ఉలవలు కొలెస్ట్రాల్, కడుపు ఉబ్బరం తగ్గటానికీ తోడ్పడతాయి.

సోయాబీన్స్ : వీటిల్లో మొత్తం తొమ్మిది అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కండరాల నిర్మాణానికి బాగా తోడ్పడతాయి. ప్రస్తుతం వీటితో తయారు చేసిన పాలు, టోఫూ వంటివీ అందుబాటులో ఉంటున్నాయి. అయితే సోయాబీన్స్ ఉత్పత్తులను పరిమితంగానే తినాలని గుర్తుంచుకోవాలి.

ఇట్ల చేద్దాం

క్యారెట్, టమాటో కలిపి జ్యూస్ చేసి,దీనికి తేనే, నీళ్లు కలుపుకుని తాగితే రక్తం శుద్ధి అవుతుంది.



కష్టపడండి... గెలుపు మనదే

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ఇచ్చిన అన్ని హామీలపై ప్రశ్నిస్తామన్నారు. దేశంలో ఏ ఒక్కరికీ పనులు లేకుండా చేశారని విమర్శించారు. పని లేకపోతే ప్రజలకు ఉపాధి ఎలా..? వారి కడుపు ఎలా నిండుతుందని ప్రశ్నించారు. మోడీ ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తున్నామంటూనే బలహీన పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బూత్ ఏజెంట్లు అత్యంత కీలకం

రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయనీ, బూత్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని ఖర్గే ఈసందర్భంగా సూచించారు. ప్రతిపక్షాలను బీజేపీ భయపెట్టేందుకు ప్రయత్నిస్తోందంటూ చెప్పారు. కానీ బీజేపీకి రాష్ట్రంలో ఎవరూ భయపడరని హెచ్చరించారు. బీజేపీపై కేసీఆర్ ఎప్పుడూ ఆరోపణలు చేయలేదన్నారు. ఆయన బీజేపీకి మద్దతిస్తారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను కాంగ్రెస్ రాష్ట్రంలో ఓడించిందని, లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'మనం ప్రజల మధ్య ఉంటే గెలుస్తాం.లేకపోతే ఓడిపోతాం' అంటూ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. క్యాడర్ గ్రామ, బూత్ స్థాయిలో పని చేయాలని సూచించారు. గ్రామ, బూత్ స్థాయిలో పని చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో శక్తి వంచన లేకుండా పని చేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి కార్యకర్తల కృషి ఫలితంగా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మరింత ఉత్సాహంగా పని చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో అప్పుడే రెండు గ్యారంటీలు అమలు చేశామని గుర్తు చేశారు. తమ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం అన్ని గ్యారంటీలనూ అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాహుల్ మణిపూర్ నుంచి భారత్ న్యాయ యాత్ర ప్రారంభిస్తే యాత్రకు బీజేపీ అడ్డంకులు సృష్టిస్తున్నదని చెప్పారు. అయినా రాహుల్‌గాంధీ ధైర్యంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. యువత, మహిళ, దళిత, గిరిజన ప్రజల కోసం రాహుల్‌గాంధీ కష్ట పడుతున్నారని వివరించారు. ఇక్కడ కష్టపడి ఎలాంటి ఫలితాలు తెచ్చారో దేశంలో కూడా అలాంటి ఫలితాలను తేవాలని ఆకాంక్షించారు. ఇక్కడ ప్రభుత్వ పని తీరు, రేవంత్ రెడ్డి పని తీరు ఆదర్శంగా ఉందని అభినందించారు.

బీజేపీ కూల్చే పార్టీ...కాంగ్రెస్ నిర్మించే పార్టీ .

ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు ఎక్కడ బలహీనంగా ఉంటే అక్కడ ప్రభుత్వాలను పడగొడతారని ఖర్గే చెప్పారు.అయితే కాంగ్రెస్ మాత్రం ప్రభుత్వాలను నిర్మిస్తుందని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో సమస్యలపై మాట్లాడితే ఎంపీలను సస్పెండ్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారన్నారు. మోడీ పదేండ్లుగా అన్ని సంస్థలను నాశనం చేశారని ఆరోపించారు. ఆయన కుట్రలను బహిర్గతం చేస్తామన్నారు. అయోధ్యలో మోడీ ఒక్కరే గర్భగుడిలో పూజలు చేశారనీ, బీజేపీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళిమనోహర్ జోషీలను ఎందుకు లోపలికి రానివ్వలేదని ఆయన ప్రశ్నించారు. 'దేశంలో దేవుడు ప్రతి ఇంట్లో ఉన్నాడు.. కానీ దేవుడు తమ దగ్గరే ఉన్నట్టు మోడీ ప్రచారం చేసుకుంటున్నారు' అని ఎద్దేవా చేశారు. ఆకలైన వాడికి అన్నం పెట్టాలనీ, ఉపాధి లేని వారికి ఉద్యోగం ఇవ్వాలనీ, కానీ మోడీ ఎన్నికల రాజకీయాలు, ప్రచారంతోనే కాలం గడుపుతున్నారని చెప్పారు. మోడీ, అమిత్‌షాలు ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి దాడులు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నాకు హిందీ అర్థం కాదు

- క్రిమినల్ చట్టాలను వాటి అసలు పేర్లతోనే పిలుస్తా : మద్రాసు హైకోర్టు జడ్జి

చెన్నై : పేర్లు మారిన క్రిమినల్ చట్టాలపై మద్రాసు హైకోర్టు జడ్జి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు హిందీ అర్థం కాదనీ, పాత క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలు వచ్చినప్పటికీ.. తాను మాత్రం వాటిని పాత పేర్లతోనే పిలుస్తానని అన్నారు. కోర్టులో ఒక కేసు విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది డిసెంబర్‌లో కేంద్రం పాత క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకొచ్చిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ సాక్ష్య సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితలు వచ్చి చేరాయి.

అన్యాయంపై ఇండియా పోరాటం : రాహుల్

- బెంగాల్‌లో ప్రవేశించిన భారత్ జోడో న్యాయ్ యాత్ర

కోల్‌కతా : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర గురువారం పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బిహార్ జిల్లా బక్షిర్‌హాట్‌లో ప్రవేశించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ చౌదరి యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాహుల్ ప్రసంగిస్తూ దేశంలో జరుగుతున్న అన్యాయాలపై ఇండియా కూటమి పోరాడుతుందని చెప్పారు. 'దేశంలో అన్యాయాలు జరుగుతున్నాయి. అందుకే మా యాత్ర పేరులో న్యాయం అనే పదాన్ని జోడించాం. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు విద్వేషాలను, హింసను వ్యాప్తి చేస్తున్నాయి' అని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి రాహుల్ ఓ టీ స్టాల్ వద్ద ఆగారు. అక్కడ చేరిన వారితో ముచ్చటించారు. దీనిపై ఆ స్టాల్ యజమాని ఆనందం వ్యక్తం చేస్తూ రాహుల్ రావడం ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు. బెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని, సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగుతామని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షమైన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన మర్నాడే రాహుల్ యాత్ర బెంగాల్‌లో ప్రవేశించింది.

కాగా, రాష్ట్రంలో భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా జరిగిన హింసకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లోక్‌సభ ఎన్నికల తర్వాత అరెస్ట్ చేస్తామని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టారని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారని, పోలీసులపై దాడి చేశారని ఆరోపిస్తూ రాహుల్, ఇతర కాంగ్రెస్ నాయకులపై అసోం పోలీసులు కేసు పెట్టిన విషయం తెలిసిందే. వాస్తవానికి రాహుల్ యాత్ర ఈ నెల 18న అసోంలో ప్రవేశించినప్పటి నుండి దానికి అవరోధాలు కల్పించేందుకు బీజేపీ అనేక ప్రయత్నాలు చేసింది. ఆ పార్టీ కార్యకర్తలు పలు చోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. యాత్రకు సంబంధించిన పోస్టర్లను ధ్వంసం చేశారు. రాహుల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్న సాకుతో గౌహతిలో ప్రవేశించేందుకు రాహుల్ యాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించారు. కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. తనపై కేసు నమోదు చేయడంపై రాహుల్ ఘాటుగానే స్పందించారు. తనపై ఎన్ని కేసులైనా పెట్టుకోవచ్చునని, భయపడే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు.

రెండు నిమిషాలకే ముగిసిన గవర్నర్ ప్రసంగం

తిరువనంతపురం : కేరళ శాసనసభను ఉద్దేశించి గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ గురువారం చేసిన ప్రసంగం కేవలం రెండు నిమిషాలకే ముగిసింది. ప్రసంగ పాఠంలో చివరి పేరాను మాత్రమే చదివి ఆయన సభ నుండి నిష్క్రమించారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వంతో గవర్నర్ తరచూ కయ్యానికి కాలు దువ్వుతున్న విషయం తెలిసిందే. శాసనసభ సమావేశాల మొదటి రోజున సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం ఆనవాయితీ. ఆయన ఉదయం తొమ్మిది గంటలకు సభలో ప్రవేశించగా ముఖ్యమంత్రి పినరయి విజయన్, స్పీకర్ ఏఎన్ షంశీర్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అయితే గవర్నర్ ఖాన్ ముఖ్యమంత్రితో కనీసం కరచాలనం చేయలేదు. పుష్పగుచ్ఛాన్ని సైతం స్వీకరించలేదు.

సభలో జాతీయ గీతాన్ని ఆలపించిన తర్వాత గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పదిహేనవ శాసనసభ పదవ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించడం గౌరవంగా భావిస్తున్నానని చెబుతూ 61 పేజీల ప్రసంగ పాఠాన్ని చకచకా తిప్పేసి, చివరి పేరా మాత్రం చదివి ముగించారు.

తిరిగి జాతీయ గీతాలాపన జరిగిన తర్వాత 9.04 గంటలకు సభ నుండి వెళ్లిపోయారు. అంటే ఆయన సభలో ఉన్నది కేవలం నాలుగు నిమిషాలు మాత్రమే. రాష్ట్ర చరిత్రలో గవర్నర్ ప్రసంగం ఇలా పూర్తికావడం ఇదే మొదటిసారి. కాగా గవర్నర్ చర్య శాసనసభను అవమానించడమే అవుతుందని ప్రతిపక్ష నాయకుడు వీడీ సతీశన్ చెప్పారు. ఆయన ఈ చర్య ద్వారా శాసనసభ పద్ధతులను, రాజ్యాంగ ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించారని విమర్శించారు. గవర్నర్ చర్యపై ముఖ్యమంత్రి విజయన్ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. సాంస్కృతిక శాఖ మంత్రి సాజి చెరియన్ మాట్లాడుతూ గవర్నర్‌కు కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు ఉండి ఉండవచ్చునని, అదే వాస్తవమైతే ఆయన అలా వ్యవహరించవచ్చునని చెప్పారు

ఎంసెట్ ఇక ఈఏపీసెట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా వివిధ వృత్తి విద్య, ఇతర కోర్సుల్లో ప్రవేశాల కోసం 2024-25 విద్యాసంవత్సరానికి సంబం ధించిన ప్రవేశ పరీక్షల తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. గురువారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి ఆ వివరాలను విడుదల చేశారు. అయితే టీఎస్‌ఎంసెట్ పేరును ప్రభుత్వం మార్చింది. ఎంసెట్‌లో ఉన్న మెడికల్ సీట్ల భర్తీ నీట్ ద్వారా జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో ఎంసెట్‌లో ఉన్న 'ఎం'ను తొలగించింది. అయితే ఎంసెట్ ద్వారా ఫార్మసీ సీట్లు భర్తీ అవుతున్నా అందులో పీ అనే అక్షరం లేదంటూ ఆయా కాలేజీ యాజమాన్యాలు ఉన్నత విద్యామండలి దృష్టికి తెచ్చాయి. దీంతో టీఎస్ ఎంసెట్ 2024-25 విద్యాసంవత్సరం నుంచి టీఎస్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఈఏపీ) సెట్‌గా ఉంటుందని ప్రకటించింది. మే తొమ్మిది నుంచి 13 వరకు ఎంసెట్ (ఈఏపీసెట్) రాతపరీక్షలు జరుగుతాయి. ఇందులో ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి అదేనెల తొమ్మిది నుంచి 11 వరకు, 12, 13 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ రాతపరీక్షలుంటాయి. ఈఏపీసెట్‌ను మళ్లీ జేఎన్టీయూ హైదరాబాద్ నిర్వహిస్తుంది. ఈసెట్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పరీక్షలు జరుగుతాయి. కాగా అదేనెల ఆరో తేదీన ఈసెట్ రాతపరీక్షలుంటాయి. బీఈడీ కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే ఎడ్‌సెట్ పరీక్ష మే 23న ఉంటుంది. దీన్ని నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది. మూడేండ్ల లా కోర్సు, ఐదేండ్ల లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ జూన్ మూడున నిర్వహిస్తారు. అదే రోజు పీజీలాసెట్ జరుగుతుంది. లాసెట్, పీజీ లాసెట్‌లను ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహి స్తుంది. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఐసెట్ పరీక్షలు అదేనెల నాలుగు, ఐదు తేదీల్లో జరుగుతాయి. దీన్ని కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది. ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ పరీక్షలు అదేనెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరుగుతాయి. ఈసెట్‌ను జేఎన్టీయూ హైదరాబాద్ నిర్వహిస్తుంది. బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పీఈసెట్ పరీక్షలు జూన్ 10 నుంచి 13 తేదీల్లో జరుగుతాయి. దీన్ని శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఓయూ వీసీ డి రవీందర్, కేయూ వీసీ టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కన్వీనర్ల పేర్లు ఖరారు

ప్రవేశ పరీక్షలకు సంబంధించిన రాతపరీక్షల తేదీలు, వాటిని నిర్వహించాల్సిన విశ్వవిద్యాలయాలు ఖరారు కావడంతో ఇక అందరి దృష్టి కన్వీనర్లపై పడింది. త్వరలోనే వారి పేర్లను ఉన్నత విద్యామండలి ఖరారు చేసి ప్రకటించనుంది. గతేడాది ఎంసెట్ కన్వీనర్‌గా డీన్ కుమార్, పీజీఈసెట్ కన్వీనర్‌గా రవీందర్‌రెడ్డి, ఈసెట్ కన్వీనర్‌గా శ్రీరాంవెంకటేశ్, లాసెట్ కన్వీనర్‌గా విజయలక్ష్మి, ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ఎ రామకృష్ణ, ఐసెట్ కన్వీనర్‌గా పి వరలక్ష్మి పీఈసెట్ కన్వీనర్‌గా రాజేష్‌కుమార్ వ్యవహరించారు. వారిలో ఎడ్‌సెట్ కన్వీనర్ రామకృష్ణ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కొత్త వారిని ఉన్నత విద్యామండలి నియమించనుంది. మిగిలిన ప్రవేశ పరీక్షలకు దాదాపు పాత వారినే కన్వీనర్లుగా కొనసాగించే అవకాశమున్నట్టు తెలిసింది. మొదటిసారి కన్వీనర్‌గా పనిచేసిన వారినే రెండోసారి నియమించే అవకాశముంటుందని ఉన్నత విద్యామండలిలో ఓ అధికారి అన్నారు.

టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించింది. చైర్మెన్ పదవి కోసం 50 మంది, సభ్యుల కోసం 321 మంది దరఖాస్తు చేసినట్టు సమాచారం. సెర్చ్ కమిటీ వాటిని పరిశీలించి అర్హుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. దాని ఆధారంగా ప్రభుత్వం కొత్త పాలకమండలిని ఖరారు చేసి గవర్నర్ ఆమోదానికి పంపించింది. గవర్నర్ ఆమోదించడంతో టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి వచ్చింది. దీంతో నియామకాల ప్రక్రియ వేగవంతం కానుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి డాక్టర్ బి జనార్దన్‌రెడ్డి గతనెల 11న రాజీనామా చేశారు. సభ్యులు ఆర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ బండి లింగారెడ్డి, కారం రవీందర్‌రెడ్డి గతనెల 13న రాజీనామాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సమర్పించారు. వారి రాజీనామాలను గవర్నర్ ఈనెల 10న ఆమోదించారు. ఈనెల 19న మరో సభ్యురాలు సుమిత్రా ఆనంద్ తనోబా గవర్నర్‌కు రాజీనామా లేఖను పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన కోట్ల అరుణకుమారి మాత్రమే సభ్యురాలిగా కొనసాగుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యులను నియమించడంతో ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీలో ఆరుగురు సభ్యులున్నారు. ఇంకా నలుగురు సభ్యులను నియమించడానికి అవకాశమున్నది. త్వరలోనే వారి నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలుస్తున్నది.

డిసెంబర్ 3 వరకే మహేందర్‌రెడ్డి పదవీకాలం

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా నియమితులైన మాజీ డీజీపీ పి మహేందర్‌రెడ్డి 1962, డిసెంబర్ మూడున జన్మించారు. 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా పనిచేశారు. మహేందర్ రెడ్డి ఐపీఎస్‌గా 36 ఏండ్లపాటు సుదీర్ఘ సేవలందించారు. పోలీసు శాఖలో సాంకేతికతతోపాటు పలు విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఆయన 2022, డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. అయితే టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల పదవీకాలం 62 నిండే వరకు లేదంటే నియామకం నుంచి ఆరేండ్ల వరకు ఉంటుంది. అందులో ఏది ముందుగా వస్తే అప్పుడు ఆ పదవి నుంచి వైదొలగాలి. మహేందర్‌రెడ్డికి ప్రస్తుతం 61 ఏండ్లు ఉన్నాయి. దీంతో టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా ఆయన ఇంకా 11 నెలలే సేవలందిస్తారు. అంటే ఈ ఏడాది డిసెంబర్ మూడున ఆయన పదవీకాలం ముగుస్తుంది. ఆ తర్వాత కొత్త చైర్మెన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించే అవకాశముంటుంది. అయితే యూపీఎస్సీ చైర్మెన్, సభ్యుల పదవీకాలం 65 ఏండ్ల వరకు ఉంటుంది. రాష్ట్ర పీఎస్సీల చైర్మెన్, సభ్యుల పదవీకాలం 65 ఏండ్ల వరకు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వినిపిస్తున్నది. అలా చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో వేచిచూడాల్సిందే.

ఇప్పుడమెందుకు? చూడాలనిపిస్తే చెప్పు !

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం కౌంటర్ ఇచ్చారు. 'మా బట్టలు ఇప్పడమెందుకు? చూడాలని అనిపిస్తే చెప్పు నేను,ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారయణ, ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం బట్టలు ఇప్పి చూపిస్తాం' అని సెటైర్ వేశారు. కవితకు బీసీల మీద అంత ప్రేమ ఉంటే మీ బీఆర్ఎస్ఎల్పీ నాయకుడిగా, పార్టీ అధ్యక్షుడుగా బీసీని నియమించాలని సవాల్ విసిరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన నేతలు గెలిస్తే బీఆర్ఎస్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. 'బీఆర్ఎస్‌ది స్వేద పత్రం కాదు...మీకు ఎక్కడెక్కడ ఆస్తులున్నాయనే పత్రం బయట పెట్టాలి'. అని సవాల్ విసిరారు.

టెండర్ ప్రక్రియ కోసం కమిటీ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

మిల్లుల వద్ద నిల్వ ఉన్న 2022-23 నాటి రబీ వరి స్టాకు కోసం తాజాగా గ్లోబల్ ఇ -టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ నియమించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మెన్‌గా మరో ఐదుగురు సభ్యులుగా కమిటీ టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సిఫారసులను ప్రభుత్వానికి అందజేసున్నది.



బజ్‌బాల్, స్పిన్‌బాల్.. రెండూ టీమ్ ఇండియావే. స్పిన్ త్రయం అశ్విన్ (3/68), రవీంద్ర జడేజా (3/88), అక్షర్ పటేల్ (2/33) మాయజాలంతో స్పిన్‌బాల్‌ను ప్రదర్శించారు. యశస్వి జైస్వాల్ (76 బ్యాటింగ్) ధనాధన్ బ్యాటింగ్ జోరుతో ఇంగ్లాండ్‌కు బజ్‌బాల్ రుచి చూపించాడు!. పరుగుల వరద, వికెట్ల జాతర సాగిన తొలి రోజు ఆటలో ఆతిథ్య భారత్ పైచేయి సాధించింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగులకే కుప్పకూలగా.. టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 119/1 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 127 పరుగుల వెనుకంజలో నిలిచింది.

ఉప్పల్ స్పిన్ సవాల్ రసవత్తరంగా మొదలైంది. ఇంగ్లాండ్, భారత్ బ్యాటర్ల దూకుడుతో పరుగుల వరద పారగా.. పిచ్ నుంచి సహకారంతో స్పిన్నర్లు మాయ చేశారు. తొలి టెస్టు తొలి రోజు ఆటలోనే 365 పరుగులు నమోదు కాగా.. 87.3 ఓవర్లలో 11 వికెట్లు పతనం అయ్యాయి. నాణ్యమైన స్పిన్నర్లపై ఇంగ్లాండ్ మంచి స్కోరే సాధించింది. జైస్వాల్ దండయాత్రతో భారత్ పట్టు బిగించింది. నేడు ఇంగ్లాండ్ స్పిన్ త్రయం మాయ చేస్తే ఉప్పల్ టెస్టు రక్తికట్టనుంది. లేదంటే, రోజంతా బజ్‌బాల్ జోరుతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరుపై కన్నేయనుంది.

మాయ మొదలైంది!

- అశ్విన్, జడేజా, అక్షర్ మ్యాజిక్
- ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 246/10
- యశస్వి జైస్వాల్ అజేయ అర్థ సెంచరీ
- భారత్ తొలి ఇన్నింగ్స్ 119/1

భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు తొలి రోజు

నవతెలంగాణ-హైదరాబాద్

ఉప్పల్ టెస్టులో టీమ్ ఇండియా అదరగొట్టింది. తొలి రోజు ఆటలో ఇంగ్లాండ్‌పై అన్ని రంగాల్లోనూ పైచేయి సాధించింది. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (76 బ్యాటింగ్, 70 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. ఇంగ్లాండ్ స్పిన్నర్లపై దండెత్తిన యశస్వి జైస్వాల్ ఆ జట్టుకు బజ్‌బాల్ రుచి చూపించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (24) సైతం రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 23 ఓవర్లలో 119/1 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (14 బ్యాటింగ్), యశస్వి జైస్వాల్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి అజేయంగా నిలిచారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 127 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది. అంతకముందు, భారత స్పిన్ త్రయ మాయజాలంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగులకే కుప్పకూలింది. అశ్విన్, జడేజా మూడేసి వికెట్లు పడగొట్టగా.. అక్షర్, బుమ్రాలు రెండేసి వికెట్లు కూల్చారు. 64.3 ఓవర్లలోనే లాంఛనం ముగించిన భారత బౌలర్లు ఇంగ్లాండ్‌కు స్పిన్‌బాల్‌తో బదులిచ్చారు. బెన్ స్టోక్స్ (70, 88 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) స్ఫూర్తిదాయక అర్థ సెంచరీతో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లాండ్ బ్యాటర్లలో జానీ బెయిర్‌స్టో (37), జో రూట్ (29), బెన్ డకెట్ (35) రాణించారు.

ఆరంభం అదిరినా : ఇంగ్లాండ్ 108/3

కీలక టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు జాక్ క్రాలీ (20, 40 బంతుల్లో 3 ఫోర్లు), బెన్ డకెట్ (35, 39 బంతుల్లో 7 ఫోర్లు) బజ్‌బాల్ జోరు చూపించారు. తొలి ఓవర్ నుంచే బౌండరీల వేట సాగించారు. క్రాలీ మూడు ఫోర్లు బాదగా, బెన్ డకెట్ ఏడు ఫోర్లతో మెరిశాడు. 11.5 ఓవర్లలోనే ఓపెనర్లు 55 పరుగులు జోడించారు. ఓపెనర్లు వేగంగా 50 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయగా.. ఇంగ్లాండ్ భారీ స్కోరు సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. పేసర్లపై బజ్‌బాల్ ఆడిన ఇంగ్లాండ్.. బంతి స్పిన్నర్లు అందుకోగానే విలవిల్లాడింది. బెన్ డకెట్‌ను ఎల్బీగా అవుట్ చేసిన అశ్విన్ ఇంగ్లాండ్‌ను తొలి దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలోనే ఇంగ్లాండ్ మరో రెండు వికెట్లు చేజార్చుకుంది. జాక్ క్రాలీని సైతం అశ్విన్ మాయలో పడేయగా.. ఒలీ పోప్ (1) కథ జడేజా ముగించాడు. దీంతో 60/3తో ఇంగ్లాండ్ కష్టాల్లో కూరుకుంది. లంచ్ లోపు మరో వికెట్ పడకుండా జానీ బెయిర్‌స్టో, జో రూట్ జాగ్రత్త పడ్డారు. జో రూట్‌పై భారత్ భారీ అప్పీల్ చేసినా.. డీఆర్ఎస్‌లో బయటపడ్డాడు. తొలి సెషన్లోనే స్పిన్ మాయ మొదలవగా.. భారత్ మూడు వికెట్లు పడగొట్టింది. ఇంగ్లాండ్ 28 ఓవర్లలో 108 పరుగులు జోడించింది.

స్పిన్‌బాల్ జోరు : ఇంగ్లాండ్ 215/8

ఉదయం సెషన్లోనే స్పిన్ మాయ మొదలవగా.. లంచ్ విరామం అనంతరం జోరందుకుంది. భారత స్పిన్ త్రయం అశ్విన్, జడేజా, అక్షర్‌లు సమిష్టిగా రాణించారు. ఇంగ్లాండ్ బ్యాటర్లు పరుగుల వేటలో దూకుడు చూపించినా.. వికెట్ల వేటలో మనోళ్లు ఎక్కడా తగ్గలేదు. నిలకడగా ఆడుతున్న జో రూట్ (29), జానీ బెయిర్‌స్టో (27)లను జడేజా, అక్షర్ సాగనంపారు. జడేజాపై రూట్ స్వీప్ షాట్‌కు ప్రయత్నించి వికెట్ చేజార్చుకోగా..బెయిర్‌స్టో వికెట్లను అక్షర్ పటేల్ గిరాటేశాడు. ఈ ఇద్దరి నిష్క్రమణతో ఇంగ్లాండ్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. స్పిన్‌ను బాగా ఆడే ఇద్దరు బ్యాటర్లు నిష్క్రమించినా.. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ (70) తనదైన శైలి అసమాన ఇన్నింగ్స్ నమోదు చేశాడు. టెయిలెండర్లతో కలిసి భాగస్వామ్యాలు నమోదు చేశాడు. బెన్ ఫోక్స్ (4), రెహాన్ అహ్మద్ (13), టామ్ హార్లీ (23)లు స్పిన్ మాయలో పడ్డారు. రెండో సెషన్లో భారత్ ఐదు వికెట్ల అదరగొట్టగా.. ఇంగ్లాండ్ మరో 107 పరుగులు జత చేసింది. బెన్ స్టోక్స్, మార్క్‌వుడ్ రెండో సెషన్లో అజేయంగా నిలిచారు.



మాయలో పడ్డారు : ఇంగ్లాండ్ 246/10

ఓ ఎండ్‌లో వరుసగా వికెట్లు పడుతుండగా మరో ఎండ్‌లో బెన్ స్టోక్స్ ఒంటరి పోరాటంతో అర్థ సెంచరీ సాధించాడు. జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో ఓ సిక్సర్, ఐదు ఫోర్లతో 69 బంతుల్లో అర్థ సెంచరీ నమోదు చేశాడు. రెండు ఫోర్ల సాయంతో మార్క్‌వుడ్ 11 పరుగులు చేశాడు.అంతకుముందు, టామ్ హార్లీ (23) అలరించే ఇన్నింగ్స్ ఆడాడు. రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిశాడు. ఇన్నింగ్స్‌కు తెరపడే సమయంలో బెన్ స్టోక్స్ దూకుడు పెంచగా.. అతడి వికెట్‌తోనే ఆ జట్టు కథ ముగించాడు బుమ్రా. దీంతో 64.3 ఓవర్లలో ఇంగ్లాండ్ 246 పరుగులకు కుప్పకూలింది.

యశస్వి జైస్వాల్ అదుర్స్ : భారత్ 119/1

మూడో సెషన్లో బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు అదిరే ఆరంభం లభించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (76 బ్యాటింగ్), రోహిత్ శర్మ (24, 27 బంతుల్లో 3 ఫోర్లు) దంచికొట్టారు. భారత బజ్‌బాల్ దెబ్బ ఇంగ్లాండ్ తెలిసేలా ఆడాడు జైస్వాల్. ఓపెనర్లు తొలి వికెట్‌కు 12.2 ఓవర్లలోనే 80 పరుగులు జోడించారు. మూడు ఫోర్లు బాదిన రోహిత్ శర్మ.. జాక్ లీచ్‌పై దూకుడు పెంచబోయి రోహిత్ శర్మ నిష్క్రమించాడు. యశస్వి జైస్వాల్ రెండు సిక్స్‌లు, ఏడు ఫోర్లతో 47 బంతుల్లోనే అర్థ సెంచరీ పూర్తి చేశాడు. జైస్వాల్ దూకుడుతోనే తొలి రోజు టీమ్ ఇండియా పైచేయి సాధించింది. జైస్వాల్ తోడుగా శుభ్‌మన్ గిల్ (14 బ్యాటింగ్, 43 బంతుల్లో 1 ఫోర్) అజేయంగా ఆడుతున్నాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జాక్ లీచ్ ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. 23 ఓవర్లలో భారత్ ఓ వికెట్ నష్టానికి 119 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : జాక్ క్రాలీ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 20, బెన్ డకెట్ (ఎల్బీ) అశ్విన్ 35, ఒలీ పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 1, జో రూట్ (సి) బుమ్రా (బి) జడేజా 29, జానీ బెయిర్‌స్టో (బి) అక్షర్ పటేల్ 37, బెన్ స్టోక్స్ (బి) బుమ్రా 70, బెన్ ఫోక్స్ (సి) భరత్ (బి) బుమ్రా 13, రెహాన్ అహ్మద్ (సి) భరత్ (బి) బుమ్రా 13, టామ్ హార్లీ (బి) జడేజా 23, మార్క్‌వుడ్ (బి) అశ్విన్ 11, జాక్ లీచ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : **3, మొత్తం : (64.3 ఓవర్లలో ఆలౌట్) 246.**

వికెట్ల పతనం : 1-55, 2-58, 3-60, 4-121, 5-125, 6-137, 7-155, 8-193, 9-234, 10-246.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 8.3-1-28-2, మహ్మద్ సిరాజ్ 4-0-28-0, రవీంద్ర జడేజా 18-4-88-3, రవిచంద్రన్ అశ్విన్ 21-1-68-3, అక్షర్ పటేల్ 13-1-33-2.

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 76, రోహిత్ శర్మ (సి) స్టోక్స్ (బి) జాక్ లీచ్ 24, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 14, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం : (23 ఓవర్లలో వికెట్ నష్టానికి) 119.**

వికెట్ల పతనం : 1-80.

బౌలింగ్ : మార్క్‌వుడ్ 2-0-9-0, టామ్ హార్లీ 9-0-63-0, జాక్ లీచ్ 9-2-24-1, రెహాన్ అహ్మద్ 3-0-22-0.



ఫైనల్లో జెంగ్, సబలెంక

- సెమీస్‌లో గాఫ్ పరాజయం
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ పోరుకు చైనా స్టార్ క్విన్ జెంగ్, రెండో సీడ్ అరినా సబలెంక (బెలారస్) చేరుకున్నారు. గురువారం జరిగిన సెమీఫైనల్లో అమెరికా యువ సంచలనం, నాల్గో సీడ్ కొకొ గాఫ్‌కు పరాజయం ఎదురైంది. టైటిల్ ఫేవరేట్ల సమరంలో సబలెంక 7-6(7-2), 6-4తో వరుస సెట్లలో విజయం సాధించింది. గాఫ్ ఐదు ఏస్‌లు సంధించగా, సబలెంక నాలుగు ఏస్‌లు కొట్టింది. గాఫ్ మూడు బ్రేక్ పాయింట్లు సాధించగా, సబలెంక నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించింది. పాయింట్ల పరంగా 82-68తో పైచేయి సాధించింది. టైబ్రేకర్‌కు దారితీసిన తొలి సెట్‌లో పైచేయి సాధించిన సబలెంక రెండో సెట్‌లోనూ అదే జోరు కొనసాగించింది. మరో సెమీస్‌లో 12వ సీడ్ చైనా స్టార్ జెంగ్ 6-4, 6-4తో వరుస సెట్లలో గెలుపొందింది. నాలుగు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో క్విన్‌వెన్ అదరగొట్టింది. శనివారం జరిగే టైటిల్ పోరులో సబలెంకతో జెంగ్ ఢీకొట్టనుంది.

ఫైనల్లో బోపన్న జోడి : భారత స్టార్ రోహన్ బోపన్న జోడి పురుషుల డబుల్స్ ఫైనల్లోకి ప్రవేశించారు. మాథ్యూ ఎబ్డెన్ జతగా బోపన్న 6-3, 3-6, 7-6(10-7)తో మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించి టైటిల్ పోరుకు చేరుకున్నారు.


కోహ్లికి ఐసీసీ అవార్డు

వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా విరాట్



దుబాయ్ : భారత సూపర్‌స్టార్ విరాట్ కోహ్లి ఐసీసీ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్నాడు. 2023 ఏడాదిలో 1377 పరుగులు చేసిన విరాట్ కోహ్లి.. ప్రపంచకప్‌లోనే ఏకంగా 765 పరుగులు సాధించాడు. ప్రపంచకప్‌లో ఐదు సెంచరీలు సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచిన విరాట్ కోహ్లి ఐసీసీ 2023 వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు. ఇక ఐసీసీ అవార్డుల్లో ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ హవా నడిచింది. ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిన పాట్ కమిన్స్.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ జట్టు సారథ్యం సైతం దక్కించుకున్నాడు. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ నటాలీ సీవర్ ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. భారత స్టార్ సూర్యకుమార్ యాదవ్.. ఐసీసీ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

నవచిత్రం



రవితేజ

కరైకుడిలో నయా షెడ్యూల్ షురూ..

రవితేజ, హరీష్ శంకర్ కాంబోలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై రూపొందుతున్న ప్రాజెక్ట్ 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ కొద్ది రోజుల క్రితం ప్రారంభమైంది. తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ ఎపిసోడ్ కోసం చిత్ర బృందం కరైకుడికి వెళ్ళింది. ఈ షెడ్యూల్‌లో కరైకుడి చుట్టుపక్కల ప్రాంతాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు.

రవితేజ పూర్తిగా డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న ఈ సినిమా ట్యాగ్‌లైన్ 'నామ్ తో సునా హెూగా'. ఈ చిత్రంలో రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: హరీష్ శంకర్, నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: మిక్కీ జె మేయర్, డీవోపీ: అయనంక బోస్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి.

విభిన్న ప్రేమకథా చిత్రం



మణికందన్, శ్రీగౌరి ప్రియ

మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'ట్రూ లవర్'. ఈ సినిమాను మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్‌పీ ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్స్ పై నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మించారు.

ఓ విభిన్న ప్రేమ కథగా దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ రూపొందించారు. ఈ సినిమాకు తెలుగులో మాస్ మూవీ మేకర్స్, మారుతి టీమ్ ప్రొడక్షన్ పై డైరెక్టర్ మారుతి, ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ ప్రెజెంటర్స్‌గా వ్యవహరిస్తున్నారు. గురువారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో గాయాలతో ఉన్న హీరో...ఆలోచిస్తూ ఎమో షనల్‌గా కనిపిస్తున్నారు. ప్రేమికుల రోజున ఈ లవర్‌ను మర్చిపోకండి అంటూ ఫస్ట్ లుక్ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీని ఈ సినిమాలో చూపిస్తామనే ప్రామిస్ మేకర్స్ ఇస్తున్నట్లుగా ఫస్ట్ లుక్ పోస్టర్ డిజైన్ చేశారు. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అఫీషియల్‌గా అనౌన్స్ చేయబోతున్నారు. తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా కచ్చితంగా ఓ భిన్నమైన ప్రేమకథని చూపిస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు.




సినిమాని అందమైన పాటలా తీశాడు : నాగ్

నాగార్జున నటించిన చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయమైన ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 14న విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి పర్ఫెక్ట్ సంక్రాంతి సినిమాగా బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. ప్రేక్షకులు, అభిమానులు, విమర్శకులు ప్రసంశలు అందుకొని 'సంక్రాంతి కింగ్' గా అలరిస్తోంది. ఈ నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ కంగ్రాట్స్ మీట్‌ని నిర్వహించింది. నాగార్జున, అల్లరి నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ ఈవెంట్‌లో అసోసియేషన్ తరఫున 'నా సామిరంగ' చిత్ర యూనిట్‌ని ఘనంగా సత్కరించారు.

నాగార్జున మాట్లాడుతూ,'మీ అందరి చిరునవ్వులు చూస్తుంటే మనసు ఆనందంతో పొంగిపోయింది. విజయ్‌తో వర్క్ చేయడం వండర్‌ఫుల్ ఎక్స్ పీరియన్స్. సినిమాని ఒక పాటలా చాలా అందంగా తీశాడు. ప్రతి షాట్‌ని మంచి ప్లాన్‌తో తీర్చిదిద్దాడు. నేను దాదాపు 95కి పైగా చిత్రాలు చేశాను. ఇందులో ఇలాంటి చక్కటి క్లారిటీతో ఉన్న కొద్దిమందిలో విజయ్ ఒకరు' అని చెప్పారు. 'విజయ్ రచ్చ గెలిచి ఇంట గెలిచాడు(నవ్వుతూ). దర్శకుడు కావాలనే తన కలని సక్సెస్ ఫుల్‌గా నెరవేర్చుకున్నారు' అని హీరో అల్లరి నరేష్ చెప్పారు. డైరెక్టర్ విజయ్ బిన్ని మాట్లాడుతూ,'నాగార్జున నన్ను దర్శకుడి ఎంచుకోవడం నా అదృష్టం. కొరియోగ్రాఫర్ కావడమే చాలా పెద్ద పని. ఒక పాట తెచ్చుకొని, ఆ పాటని హిట్ చేయడం అనేది చాలా కష్టంతో కూడుకున్న ప్రాసెస్. ఈ ప్రయత్నం చేస్తూనే డైరెక్టర్ కావాలనే నా డ్రీమ్‌ని పూర్తి చేసుకున్నాను. ఈ విజయాన్ని పురస్కరించుకొని నా ఫ్యామిలీ అందరూ కంగ్రాట్స్ మీట్‌ని నిర్వహించడం గొప్ప సంతోషాన్ని ఇచ్చింది. సినిమా హిట్టు కొట్టినప్పుడు ఎంత ఆనందంగా ఫీలయ్యానో.. ఇప్పుడూ అంతే ఆనందంగా ఉంది' అని తెలిపారు.

సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్



విశాల్

హీరో విశాల్ అంటే అందరికీ యాక్షన్ సినిమాలు గుర్తొస్తాయి. అలాంటిది యాక్షన్ డైరెక్టర్ హరితో విశాల్ మూవీ అంటే యాక్షన్ లవర్స్‌కు ఇక పండుగే. దానికి తగ్గట్టుగానే 'రత్నం' అనే మూవీ ఫుల్ యాక్షన్ మూవీగా రాబోతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి రిలీజైన కంటెంట్ చూసి మాస్ లవర్స్‌లో ఈ సినిమా మీద అంచనాలు పెరిగాయి.జీ స్టూడియోస్‌తో పాటు స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి హరి డైరెక్టర్‌గా, కార్తికేయన్ సంతానం నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కళ్యాణ్ సుబ్రహ్మణ్యం అలంకార్ పాండియన్ కో-ప్రొడ్యుసర్. ఈ మూవీలో విశాల్ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్‌ను అందిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ షాట్ టీజర్, పాటలు ఇలా.. ఇప్పటికే అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా ఈ మూవీ షూటింగ్ పూర్తయినట్టు మేకర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా చిత్రయూనిట్ రిలీజ్ డేట్‌ను లాక్ చేసింది. ఏప్రిల్ 26న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. సమ్మర్‌లో విశాల్ యాక్షన్ మూవీ థియేటర్లోకి రాబోతోందని తెలిపారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇకపై వరుసగా అప్‌డేట్స్‌తో ఈ చిత్ర టీమ్ సందడి చేయనుంది.

పిల్లలకూ నచ్చుతుంది



'నా చిన్నప్పుడు 'కోయి మిల్ గయా' సినిమా చూసి హృతిక్ రోషన్ ఫ్యాన్ అయ్యా. ఇప్పుడీ 'అయలాన్' విడుదల తర్వాత తెలుగు రాష్ట్రాలలో చిన్నపిల్లల అందరూ శివ కార్తికేయన్ అభిమానులు అయి పోతారు. ప్రచార చిత్రాలు బాగున్నాయి. సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది' అని యువ హీరో కార్తికేయ అన్నారు. శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'అయలాన్'.

రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్. శుక్రవారం తెలుగులో గంగ ఎంటర్‌టైన్ మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

దర్శకులు గోపీచంద్ మలినేని, వశిష్ఠ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాళ్ల చేతుల మీదుగా బిగ్ టికెట్ ఆవిష్కరించారు. కెజెఆర్ స్టూడియోస్ పతాకంపై కోటపాడి జె.రాజేష్ నిర్మించగా, ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించారు. ఆర్. రవికుమార్ దర్శకత్వం వహించారు.

'ట్రైలర్ చూసి ఉంటారు. 'అయలాన్' సినిమా సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ ఫిల్మ్. ఫాంటసీ ఫిలిమ్స్ ఎప్పుడూ ప్రేక్షకులకు నచ్చుతాయి.

నేను, ఏలియన్ కలిసి ఈసారి మిమ్మల్ని ఎంటర్టైన్ చేయడానికి ట్రై చేశాం.

ఈ సినిమాను పిల్లలు, ఫ్యామిలీ... అందరూ కలిసి చూడొచ్చు. అందరికీ నచ్చుతుంది. భారతీయ సినిమాల్లో ఇది ఒక కొత్త ప్రయత్నం. కొత్త ప్రయత్నాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ గొప్పగా ఆదరించారు' అని శివకార్తికేయన్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

'ట్రంప్ ఒక్కరే అమెరికాను రక్షించగలరు!



'న్యూయార్క్ : న్యూ హంప్‌షైర్ ప్రైమరీని కూడా అప్రతిహతంగా నిక్కీ హాలే మీద గెలిచిన తరువాత అధ్యక్షుడు జో బైడెన్‌పై డోనాల్డ్ ట్రంప్ కాలు దువ్వుతున్నాడు. ఐవోవా, న్యూ హాంప్‌షైర్ ప్రైమరీలను 1976 తరువాత వరుసగా గెలుచుకున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ మాత్రమేనని అంటున్నారు. ఊహాతీతమైన అవరోధాలమధ్య, తనకు వ్యతిరేకంగా ఐదు కోర్టు తీర్పులుండగా, రాజకీయ ప్రత్యర్థుల దాడుల మధ్య ఒక 77 ఏండ్ల వ్యక్తి ఇటువంటి విజయం సాధించటం చిన్న విషయం కాదు. నిజానికి మాజీ అధ్యక్షుల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు ట్రంప్ ఒక్కరే. అయితే ఈ దాడులు తమ ప్రత్యర్థిని మరింతగా బలపడేలా చేశాయన డెమోక్రాట్లు గ్రహించటానికి చాలా సమయం పట్టింది. ట్రంప్ అనుయాయులకు 2024లో జరగనున్న ఎన్నిక మరో ఎన్నిక కాదు. అది అమెరికాను రక్షించటానికి వారికి అందే చివరి అవకాశం. రిపబ్లికన్ పార్టీలో అమెరికా యుద్ధ పిపాసకు ప్రాతినిధ్యంవహిస్తున్న నిక్కీ హాలే ఓటమిని ఈ కోణంలోనే చూస్తున్నారు. మధ్యప్రాచ్యంలోను, తూర్పు ఐరోపాలోను యుద్ధాలు చెలరెగుతున్న స్థితిలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనుండటంతో అమెరికాలోని యుద్ధ పరిశ్రమ సంతోషంలో తలమునకలౌతోంది. ఈ స్థితిలో హాలే గెలవటాన్ని ఏమాత్రం ఊహించలేము. తన నాలుగేండ్ల పదవీకాలంలో అమెరికాను యుద్ధాల లో దింపకుండా చేయగలిగానని చెప్పుకునే అవకాశం ఒక్క ట్రంప్ కు మాత్రమే ఉంది. అమెరికా ప్రమాణాలను బట్టి చూస్తే ఇది అరుదైన విషయమే.

విశ్వ గురువు ఏడి ?

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశమంతా రామ మందిర మానియాలో మునిగిపోయింది. బాబ్రీ మసీదును కూల్చివేసి, ఆ ప్రదేశంలో నిర్మించిన రామాలయంలో జరిగిన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంపై ఇంత పెద్ద ఎత్తున ప్రచారం జరగడం మున్నెన్నడూ కానరాలేదు. ప్రింట్ మీడియా, టీవీ ఛానల్స్, సామాజిక మాధ్యమాలు...ఒకటేమిటి? అన్ని ప్రచార సాధనాలూ ఈ వేడుకకు విశేష ప్రచారం కల్పించాయి. అయోధ్యలో జరిగిన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం 'విశ్వగురువు'గా వందిమాగధులు పిలిచే ప్రధాని నరేంద్ర మోడీ కీర్తికిరీటంలో మరో కలికితురాయి అని ప్రశంసలు వెల్లువెత్తాయి. ఇదంతా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన భారత ప్రధాని ఈవెంట్ మేనేజ్‌మెంట్ నైపుణ్య వైభవమే !

విశ్వ గురువు ఈవెంట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాన్ని దేశ ప్రజలు గతంలోనూ చూశారు. గత సంవత్సరం జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా కానీ, 75వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలో కానీ అది మనకు కన్పించింది. గతంలోనూ మనం అనేక మంది విశ్వ గురువులను చూశాము. కానీ వెరెవ్వరికీ ఈ తరహా కీర్తికండూతి లేదు. గౌతమ బుద్ధుడు, అశోక చక్రవరి, అక్బర్ వంటి వారు తమ ప్రజానుకూల చర్యల ద్వారా విశ్వ గురువులుగా కీర్తి గడించారు. ఆధునిక కాలంలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా 1950, 1960 దశకాలలో ప్రపంచ నేతగా పేరు పొందారు. అణు యుద్ధం, విధ్వంసం, రెండో ప్రపంచ యుద్ధం, కొరియా యుద్ధం వంటి పరిణామాలతో అసాధారణ వినాశనానికి లోనైన ప్రపంచంలో ఆయన అలీనోద్యమాన్ని వ్యాప్తి చేశారు. యుద్ధోన్మాదులకు వ్యతిరేకంగా ఈజిప్ట్, యుగోస్లోవేకియా, ఘనా, ఇండొనేషియా వంటి దేశాల అధినేతలతో జట్టు కట్టారు.

అయితే ఈ రోజు మనం చూస్తున్నదేమిటి ? గాజాలో నరమేథం సాగుతుంటే దానికి కారణమైన, దానిని ప్రోత్సహిస్తున్న దేశాలకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన మన విశ్వ గురువు ఆ విషయాన్ని ఎంత మాత్రం పట్టించుకోకుండా లక్షదీవుల్లో సేద తీరారు. ఆయన మద్దతుదారులు మాల్దీవులపై విషం చిమ్మారు. వాస్తవానికి మాల్దీవులు మన దేశంలోని చిన్న రాష్ట్రాల కంటే చాలా చిన్నది. ఇక్కడ మనం దక్షిణాసియా నేత నెల్సన్ మండేలాను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన ఇజ్రాయిల్‌ను అంతర్జాతీయ న్యాయస్థానం ముందు దోషిగా నిలిపారు. తద్వారా మండేలా విశ్వ గురువు అయ్యారు. మన విశ్వ గురువు క్యాబినెట్ సహచరులు, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నేతలు మాత్రం కార్పొరేట్ వ్యాపార సంస్థలను ప్రసన్నం చేసుకునేందుకు దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశానికి హాజరయ్యారు.

అలీనోద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 120 దేశాల ప్రతినిధులు ఉగాండాలోని కంపాలాలో సమావేశమై గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలంటూ ఓ తీర్మానాన్ని ఆమోదించారు. విశ్వ గురువుగా చెప్పుకుంటున్న నాయకుడి ప్రాధాన్యతల జాబితాలో ఈ అంశమే లేదు. సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య చెలరేగిన ఘర్షణను నివారించేందుకు చైనా గతంలో నాయకత్వ పాత్ర స్వీకరిస్తే మనం మాత్రం ఇప్పుడు అలాంటి పనిని చేయలేకపోయాం. ఈ పరిణామాలను గమనిస్తే మన దేశంలో ఈ రోజు నిజమైన విశ్వ గురువు లేదని అనిపిస్తోంది కదూ !

ఆ కూల్చివేతలు ఆపాలి

- ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకునే వివక్షాపూరిత విధానాన్ని విడనాడాలి
- భారత్‌లోని అధికార యంత్రాంగాలకు ఆమ్నెస్టీ సూచన
- మహారాష్ట్రలోని మీరా రోడ్ బుల్డోజర్ చర్య తర్వాత స్పందించిన సంస్థ

న్యూఢిల్లీ : ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటూ కూల్చివేత చర్యలు సాగించే వివక్షాపూరిత విధానానికి భారత యంత్రాంగాలు వెంటనే ముగింపు పలకాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా తెలిపింది. మహారాష్ట్రలోని థానే జిల్లాలో గల పుర పాలక అధికార యంత్రాంగం 15 నిర్మాణాలను కూల్చివేసిన తర్వాతి రోజు ఆమ్నెస్టీ పై విధంగా స్పందించింది. రాష్ట్ర రాజధాని ముంబయికి దగ్గరలో ఉండే మీరా-భయందర్ మునిసిపాలిటీ యంత్రాంగం అక్రమ నిర్మాణాల పేరుతో మీరా రోడ్ నయా నగర్ ప్రాంతంలో కూల్చివేత డ్రైవ్‌ను చేపట్టింది. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవానికి ముందు ఆదివారం రాత్రి అక్కడ మత ఘర్షణలు జరిగాయయి. అయితే, మంగళవారం నాడు అధికార యంత్రాంగం ఒక వర్గాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకొని కూల్చివేత చర్యలకు దిగటం గమనార్హం.

" ఆ నిర్మాణాలు ముస్లిలవి. అయితే, ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం జరిగిన మత ఘర్షణల్లో అరెస్టయిన 13 మందితో వీటికి (నిర్మాణాలకు) సంబంధం లేదు" సామాజిక కార్యకర్త ఒకరు తెలిపారు. అయితే, ఈ నిర్మాణాలు ఫుట్‌పాత్‌లపై ఉండటం కారణంగానే వాటిని కూల్చివేసినట్టు డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ మారుతీ గైక్వాడ్ అన్నారు.

మత ఘర్షణల తర్వాత ముస్లింలకు సంబంధించిన నిర్మాణాలను కూల్చివేసే ఏకపక్ష, వివక్షాపూరిత విధానాన్ని భారత అధికారులు అమలు చేయటం ఆందోళనకరమని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియాకు చెందిన ఆకార్ పటేల్ తెలిపారు.

రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి




(ఫైల్)

పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ఎల్మల స్వామి(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. తనకు ఉన్న నాలుగెకరాల భూమిలో పత్తి, కంది పంటలను వేశాడు. రెండు సంవత్సరాలుగా సరైన పంట దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కూడా ఎల్లలేదు. బ్యాంకుల్లో, ప్రయివేట్‌గా అప్పులు పెరగడంతో ఆందోళనకు గురయ్యాడు. బుధవారం తన చేనులోనే పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా, కుమారుడు చూసి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. దాదాపు రూ.5లక్షల వరకు అప్పు ఉన్నట్టు రైతు భార్య కవిత తెలిపారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

పతనమైన మిర్చి ధర

సుమారు రూ.500 తగ్గుదల

- నిరాశలో రైతాంగం
- దాదాపు రూ.50 లక్షల నష్టం



నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో మిర్చి ధర పడి పోయింది.. ఈసారి పెట్టుబడి పెరిగింది.. దిగుబడులు తగ్గాయి.. కానీ మార్కెట్లో మాత్రం ఏరోజుకారోజు ధర తగ్గుతోంది. దీంట్లో వ్యాపారుల మాయాజాలంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు సరుకు తక్కువగా వచ్చినా ధర మాత్రం తగ్గిస్తున్నారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎనుమాముల మార్కెట్‌లో గురువారం మిర్చి ధర రూ.500 తగ్గింది. బుధవారం మార్కెట్‌లో తేజ రకం మిర్చి ధర క్వింటాల్‌కు రూ.20,200 వుండగా, గురువారం ధర రూ.200 తగ్గి రూ.20 వేలు మాత్రమే ధర నిర్ణయించడంతో రైతులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. తేజ రకం మిర్చికి అత్యధికంగా రూ.20 వేల ధరను నిర్ణయించారు. ఎక్కువ సరుకును రూ.18 వేలకే కొనుగోలు చేశారు. బుధవారం ఎక్కువ సరుకును రూ.18,500 కొనుగోలు చేయగా, గురువారం రూ.500 తగ్గించారు. దీంతో రైతులు రూ.50 లక్షల మేరకు నష్టపోయారు. ఈసారి గతంలో కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టినా, ధర తగ్గడంతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు 'నవతెలంగాణ'తో వాపోయారు. గత ఏడాది డిసెంబర్ మాసాంతం నుంచి ప్రారంభమైన మిర్చి రాబడులు జనవరి మాసాంతానికి చేరుకునే సరికి పెరిగాయి. ఏప్రిల్ మాసాంతం వరకు మిర్చి రాబడులు మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో వస్తూనే వుంటుంది.

రాబడులు తగ్గినా.. ధరలు పెరగకపాయే..

ఎనుమాముల మార్కెట్‌లో బుధవారం కంటే గురువారం మిర్చి రాబడులు తక్కువచ్చాయి. బుధవారం మార్కెట్‌కు 10 వేల 904 క్వింటాళ్ల మిర్చి రాగా, గురువారం 8 వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఒక్కరోజు తేడాతో 2 వేల పైచిలుకు క్వింటాళ్ల మిర్చి రాబడులు తగ్గినా వ్యాపారులు ధరను మాత్రం పెంచకపోవడం గమనార్హం. ఆర్థిక శాస్త్రం మూల సూత్రాన్ని మార్కెట్‌లో వ్యాపారులు నొక్కి చెబుతూనే వారి మార్క్‌లోనే ధరలను నియంత్రిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వ్యాపారుల మాయాజాలం..

మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బుధవారం 10 వేల 904 క్వింటాళ్ల మిర్చి వచ్చింది. ఈ క్రమంలో తేజ రకం మిర్చి ధర అత్యధికంగా రూ.20 వేల 200, అత్యల్పంగా రూ.14 వేల 500, ఎక్కువ సరుకును రూ.18 వేల 500 ధరతో కొనుగోలు చేశారు. వండర్‌హాట్ రకం మిర్చి రూ.19 వేలు-రూ.15 వేలు, అత్యధికంగా రూ.17 వేల 500 కొనుగోలు చేశారు. యుఎస్-341 రకం మిర్చి ధర రూ.16 వేల 800-రూ.13 వేల 500, అత్యధికంగా 15 వేలకు కొనుగోలు చేశారు. ఒక్కరోజుకే అంటే గురువారం మార్కెట్‌కు కేవలం 8 వేల క్వింటాళ్ల మిర్చి మాత్రమే వచ్చింది.

గురువారం మార్కెట్‌లో తేజ రకం మిర్చి ధర క్వింటాల్‌కు అత్యధికంగా రూ.20 వేలు, అత్యల్పంగా రూ.14 వేలు, ఎక్కువ సరుకును రూ.18 వేల ధరతో కొనుగోలు చేశారు. వండర్‌హాట్ రూ.20 వేలు-రూ.14 వేలు, ఎక్కువ సరుకును రూ.18 వేలకే కొన్నారు. యుఎస్-341 రకం మిర్చి రూ.16 వేల 500-రూ.13 వేలు, అధికంగా సరుకును రూ.15 వేలకే కొనుగోలు చేశారు. కేవలం ఒక్కరోజులోనే సుమారు 2 వేల పైచిలుకు క్వింటాళ్ల మిర్చి రాబడులు తగ్గినా, ఎనుమాముల మార్కెట్‌లో మిర్చి ధర పెరుగకపోగా, తగ్గించడం మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్ కుమ్మక్కై వ్యవహరిస్తున్న తీరుకు నిలువెత్తు నిదర్శనం.

రథసప్తమి రోజు సామూహిక సూర్య నమస్కారాలు

- ప్రభుత్వ పాఠశాలలకు రాజస్థాన్ ప్రభుత్వ ఆదేశం
- ప్రపంచ రికార్డు కోసం తాపత్రయం



జైపూర్ : రథసప్తమి పండుగ సందర్భంగా వచ్చే నెల 15వ తేదీన రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సామూహికంగా సూర్య నమస్కారాలు చేయించాలని రాజస్థాన్‌లోని బీజేపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, స్థానిక గ్రామస్థులు భాగస్వాము లయ్యేలా చూడాలని సూచించింది. ఈ కార్యక్రమానికి సన్నాహకంగా ఇకపై ప్రతి రోజూ పాఠశాలల్లో ప్రార్థన సమయంలో సూర్య నమస్కారాలు అభ్యాసం చేయించాలని జిల్లా విద్యా శాఖ అధికారులకు పంపిన ఆదేశాలలో రాష్ట్ర సెకండరీ విద్యా శాఖ తెలియజేసింది. సూర్య నమస్కారాలు చేయించడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాలని రాజస్థాన్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో కార్యక్రమంలో పాల్గొనే వారి వివరాలు సేకరించాలని ఆదేశించింది.

'విద్యార్థులు ఇప్పుడు సూర్య నమస్కారాలు ప్రాక్టీస్ చేయాలి. శరీర ఆరోగ్యానికి సూర్యకాంతి ఎంతో కీలకం. ఇది డి-విటమిన్‌ను అందిస్తుంది. సూర్య నమస్కారం ఓ ఎక్సర్‌సైజ్ వంటిది. దీనిని ఫిబ్రవరి 15వ తేదీ వరకూ కొనసాగించాలి. ఆ తర్వాత ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటాం' అని రాజస్థాన్ సెకండరీ విద్యా శాఖ డైరెక్టర్ ఆశిష్ మోడీ చెప్పారు. అంతకుముందు రాష్ట్ర పాఠశాల విద్యా మంత్రి మదన్ దిలావర్ విలేకరులతో మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రథసప్తమిని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. దేశంలోనే దీనిని అతి పెద్ద కార్యక్రమంగా మార్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రజలందరి సహకారం తీసుకుంటామని అన్నారు. పాఠశాలల్లో ప్రార్థనలు చేసే సమయంలో విద్యార్థులు ప్రతి రోజూ కనీసం పదిహేను నిమిషాల పాటు సూర్య నమస్కారాలు ప్రాక్టీస్ చేస్తారని తెలిపారు. సూర్యకాంతితో అనేక పనులు జరుగుతాయని, అందుకే ఆయన్ని భగవంతుడిగా భావిస్తామని దిలావర్ అన్నారు.

ఎవరీ దిలావర్ ?

రాష్ట్రంలో ఫైర్‌బ్రాండ్ హిందుత్వ వాదులుగా ముద్ర పడిన బీజేపీ నేతల్లో దిలావర్ ఒకరు. 64 సంవత్సరాల దిలావర్‌కు భజన్‌లాల్ శర్మ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలో కీలక శాఖ దక్కింది. ఆయన తరచూ తన ప్రకటనల ద్వారా వార్తల్లోకి ఎక్కుతుంటారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం పూర్తయిన తర్వాత దిలావర్ ఆనందంతో నృత్యం చేసిన దృశ్యాల వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. రామ మందిర నిర్మాణం పూర్తయ్యే వరకూ పూల దండలు ధరించబోనని 1990లో ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఇప్పుడు శ్రీకృష్ణుని జన్మస్థలమైన మథురలో కృష్ణ దేవాలయానికి ప్రాణ ప్రతిష్ట జరిగే వరకూ ఒంటి పూట భోజనం చేస్తానని చెప్పారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో షాహీ ఈద్గా మసీదు ఉన్న విషయం తెలిసిందే. వసుంధర రాజె ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దిలావర్‌ను పక్కన పెట్టారు. 2018 నుండి ఆయనకు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది ఆయనతో పాటు వసుంధర రాజె వ్యతిరేకులందరికీ పార్టీలో ప్రాధాన్యత పెరిగింది. దిలావర్ తరచూ వివాదాస్పద ప్రకటనలు చేస్తుంటారు. 2021లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశంలో రైతులు ఉద్యమించినప్పుడు దానిని ఓ కుట్రగా అభివర్ణించారు. బర్డ్ ఫ్లూను వ్యాపింపజేసేందుకు కుట్ర జరుగుతోందని, రైతులుగా చెప్పుకుంటున్న వారు నిరసన ప్రదేశంలో చికెన్ బిర్యానీ, డ్రై ఫ్రూట్లు తింటూ ఎంజాయ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి : పినరయి విజయన్



తిరువనంతపురం : భారతదేశ రాజ్యాంగ పునాదిని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న యత్నాలను తిప్పికొట్టాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చారు. దేశం నేడు 75వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఆయన 'వీక్లీ థాట్' పత్రికకు ఆయన ఒక వ్యాసం రాశారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమంలో భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం ఉంది. వివిధ కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలు, సంస్కృతులకు చెందినవారంతా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు భిన్నత్వంలో ఏకత్వం అనే భావన దీని నుండే ఉద్భవించిందని ఆయన ఆ వ్యాసంలో పేర్కొన్నారు.. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆలంబనగా గణతంత్ర భారత్ అవతరించింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, సమాఖ్య వ్యవస్థ జాతీయ విముక్తి ఉద్యమం అందించిన విలువలకు అది పట్టం గట్టింది. భారత రాజ్యాంగం జాతీయ స్వాతంత్ర్య సంగ్రామం విలువలను గ్రహించి, ప్రాథమిక హక్కులు, పౌర స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, నేడు వివిధ స్థాయిల్లో రాజ్యాంగ పునాదులను ధ్వంసం చేసేలా కొన్ని చొరబాట్లు జరుగుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సైతం కాలరాస్తున్నారు. ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

దేశంలోని ప్రజాస్వామ్యం, లౌకికవాదం, బహుళత్వ విలువలను, సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసేందుకు నిరంతరం దాడులు జరుగుతున్న తరుణంలో 75వ గణతంత్ర దినోత్సవంలోకి భారత్ అడుగిడుతోందని ఆయన పేర్కొన్నారు. సంఘ్ పరివార్ విద్వేష, విభజన రాజకీయాలను వ్యాప్తి చేస్తూ తమ రాజకీయ ఎజెండాను దేశంపై రుద్దుతోంది. మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని నిరాకరించాలని చూస్తోంది. దేశంలోని సమాఖ్య విలువలను నీరుగార్చడం ద్వారా రాష్ట్రాల అధికారాలను హైజాక్ చేసే క్రమబద్ధమైన ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాస్తున్నారు. ఈ దాడులు చాలావరకు బిజెపి యేతర పార్టీల పాలిత రాష్ట్రాలపైనే జరుగుతున్నాయని విజయన్ పేర్కొన్నారు.

'ఒక దేశం, ఒకే ఎన్నిక' అనే నినాదాన్ని ఈ కోణంలోనే చూడాలి. సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసి కేంద్రానికి సర్వాధికారాలు కల్పించడమే 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అసలు ఉద్దేశం. తమకు అనుకూలంగా లేని రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచి షార్ట్‌కట్ ద్వారా రాష్ట్ర పరిపాలనను చేజిక్కించుకునే ఎత్తుగడ ఇది. వివిధ దశల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ స్థానాల ద్వారా రాజ్యసభలో ప్రాతినిధ్యం నిరంతరం పునరుద్ధరించబడుతుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ద్వారా రాజ్యసభలో రాజకీయ వైవిధ్యం లేకుండా పోతుందని ఆయన ఆ వ్యాసంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంగా భారతదేశ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసే ఇలాంటి జోక్యాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఆయన కోరారు.లోక్‌సభ ఎన్నికలకు ముందు మళ్లీ పౌరసత్వ సవరణ అంశాన్ని ముందుకు తేవాలని సంఘ్ పరివార్ చూస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం కింద దరఖాస్తుల స్వీకరణ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేయడానికి పావులు కదుపుతోంది. పౌరసత్వ సవరణ నిబంధనలను రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన తుది ముసాయిదా మార్చి 30, 2024 నాటికి పూర్తవుతుందని కేంద్ర మంత్రులు చెబుతున్నారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని సంఘ్ పరివార్ హిందూత్వ మతపరమైన ఎజెండాలో భాగంగా చూడాలి. డిసెంబర్ 31, 2014 లేదా అంతకు ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్ , ఆఫ్ఘనిస్తాన్ నుండి భారతదేశానికి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వాన్ని మంజూరు చేసే చట్టం, ముస్లింలకు మాత్రం నిరాకరిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం. ఈ స్థితిలో రాజ్యాంగంలోని లౌకిక, సమాఖ్య లక్షణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన అవసరమెంతైనా ఉందని పినరయి విజయన్ పేర్కొన్నారు.

సర్పంచ్ ఎన్నికలు ఇప్పట్లో కష్టమే..

- కేటీఆర్.. నోరు అదుపులో పెట్టుకో.. : పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ - వేములవాడ

సర్పంచ్ ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించడం కష్టమే అని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. 'కేటీఆర్.. బుద్ధిగా నోరు అదుపులో పెట్టుకొని ప్రతిపక్ష హోదాలో పని చేయ్' అని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర ఆలయాన్ని గురువారం మంత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సర్పంచుల ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించడం వీలుకాదని మంత్రి అన్నారు. దానికి సంబంధించి ఎట్లా చేయాలనేది త్వరలో నిర్ణయిస్తామన్నారు. స్టేట్ ఫైనాన్స్ నిధులు ఇతర పనులకు వెచ్చించడం వల్లే సర్పంచులకు బిల్లులు పెద్దమొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిధుల లభ్యతను బట్టి పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లించనున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లు గడీల పాలన చేసిందని విమర్శించారు. కేటీఆర్ అహంకారమే బీఆర్ఎస్ ఓటమికి కారణమైందని.. అధికారం లేకుండా కేటీఆర్ ఉండలేకపోతున్నారని, అందుకే విధ్వంస రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచినా ఇంకా ప్రమాణ స్వీకారం చేయడం లేదని, కాంగ్రెస్‌పై విమర్శలు చేసేందుకు కేటీఆర్‌కు బుద్ధుందా అన్నారు. కుళ్లు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేస్తే జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు గమనిస్తారన్నారు. సర్పంచులకు బిల్లులు పెండింగ్ పెట్టింది ఎవరు.. గత ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తాము సక్రమంగా పని చేస్తేనే మళ్లీ అధికారం ఇస్తారు.. చేయకపోతే ఇవ్వరని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి పైసా ప్రజా సంక్షేమం కోసమే వెచ్చిస్తున్నట్టు స్పష్టం చేశారు. ప్రతినెలా మొదటి వారంలోనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. ఆమె వెంట ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఉక్రెయినే కూల్చింది..

యుద్ధ ఖైదీలతో పయనిస్తున్న రష్యా సైనిక విమానం కూలిన ఘటనపై రష్యా



మాస్కో : 65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలతో పయనిస్తున్న ఐఎల్-76 సైనిక రవాణా విమానం రష్యా-ఉక్రెయిన్ సరిహద్దుకు 90కిలోమీటర్ల దూరంలో బెల్గొరాడ్ ప్రాంతంలో కూలిపోయింది. ఉక్రెయిన్ సైన్యమే ఈ విమానాన్ని కూల్చివేసిందని రష్యన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. బుధవారం ఉదయం 11.15 నిముషాల కు(మాస్కో టైమ్) ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలో ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలతో ప్రయనిస్తున్న ఐఎల్-76 సైనిక విమానం బెల్గొరాడ్ ప్రాంతంలోని కొరొచాన్స్కీ జిల్లాలోని యాబ్లొనోవో గ్రామానికి సమీపంలో కూలిపోయిన విషయం తెలిసిందే.

ముందుగా తగినంత సమాచారం ఉన్నప్పటికీ ఉక్రెయిన్ ఉద్దేశపూర్వకంగా ఈ విమానాన్ని విమాన విధ్వంసక క్షిపణితో కూల్చివేసిందని రష్యా ఆరోపించింది. ఈ విమానం కూలిపోతుండగా తీసిన వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. విమానం ఉక్రెయిన్‌కు చెందిన యుద్ధ ఖైదీలతో చెకలోవ్‌స్కీ విమానాశ్రయం నుంచి బెల్గొరాడ్‌కు బయలుదేరింది. అక్కడ యుద్ధ ఖైదీల మార్పిడి జరగనున్నదనే సమాచారం ఉక్రెయిన్ సైనికాధికారులకు ముందేతెలుసు. ఆ విమానంలో యుద్ధ ఖైదీలతోపాటుగా ఆరుగురు సిబ్బంది, మరో ముగ్గురు యుద్ధ ఖైదీలను అనుసరిం చేవారున్నారు. విమానం కూలటంతో అందులోవున్న వారందరూ చనిపోయారని బెల్గొరాడ్ ప్రాంత గవర్నర్ వ్యాచస్లావ్ గ్లాడ్‌కోవ్ అన్నాడు. అయితే విమానం కూలిపోవటంవల్ల భూమిపైన ఎటువంటి నష్టమూ సంభవించలేదు. కూలిపోయిన విమానంతోపాటుగా 80మంది యుద్ధ ఖైదీలతో మరో విమానం కూడా ఆకాశంలో ఎగురుతూవుంది. ఈ సంఘటన తరువాత ఆ విమానాన్ని దారి మళ్ళించారని శాసన సభ్యుడైన ఆండ్రే కర్తపొలావ్ అన్నాడు.

గోవా వెళ్దామని చెప్పి అయోధ్యకు తీసుకెళ్లిన భర్త విడాకులకు సిద్ధమైన భార్య

న్యూఢిల్లీ : హనీమూన్ విషయం ఒక నవదంపతుల కాపురంలో చిచ్చు రేపింది. పెండ్లై ఏడాదైనా కాకుండానే విడాకుల వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. హనీమూన్ కోసం గోవా లేదా ఇతర దేశానికి వెళ్దామని చెప్పిన భర్త, దానికి బదులుగా అయోధ్య, వారణాసికి తీసుకెళ్లటంతో భార్య విడాకులకు సిద్ధమైంది. ఈ మేరకు ఫ్యామిలీ కోర్టునూ ఆశ్రయించింది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ ఘటన చోటు చేసుకున్నది. కాగా, భార్య, భర్తలు ఇద్దరూ ఐటీ ఉద్యోగులే కావటం గమనార్హం. దంపతులకు కౌన్సెలింగ్ సెషన్ నడుస్తున్నదని మ్యారేజ్ కోర్టు కౌన్సెలర్ షెయిల్ అవాస్తీ తెలిపారు. వీరిద్దరికీ గతేడాది మేలో పెండ్లైందని చెప్పారు. తామిద్దరమూ బాగా సంపాదిం చామనీ, కాబట్టి హనిమూన్ కోసం వేరే దేశానికి వెళ్లటం పెద్ద విషయం కాదని భార్య తన పిటిషన్‌లో పేర్కొన్నది. అయితే, తన తల్లిదండ్రులను చూసుకోవాల్సి ఉన్నందున హనీమూన్ కోసం గోవా కానీ, దక్షిణ భారత్‌కు కానీ వెళ్దామనుకున్నామని భర్త వివరించాడు.

బ్లడ్ క్యాన్సర్ నయమవుతుందని..

- గడ్డకట్టే చలిలో గంగా నది స్నానం
- ప్రాణాలు కోల్పోయిన ఐదేండ్ల బాలుడు
- ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఘటన

చండీగఢ్ : ప్రపంచంలో శాస్త్రసాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కి అనేక నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయి. వైద్యపరంగా అనేక రోగాలకూ పరిష్కారాలు దొరుకుతున్నాయి. కానీ, భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం మూఢనమ్మకాలు ఇప్పటికీ ఉన్నాయి. ఇందుకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో చోటు చేసుకున్న ఒక ఘటనే తార్కాణం. ఐదేండ్ల బాలుడికి గంగా నదిలో స్నానం చేస్తే అతనికి ఉన్న బ్లడ్ క్యాన్సర్ నయమవుతుందన్న తల్లిదండ్రుల మూఢనమ్మకం నిండు ప్రాణాన్ని బలిగొన్నది. ఎముకలు కొరికే చలిలో బాలుడిని గంగా నదిలో స్నానం కోసమని తీసుకెళ్లారు. ప్రార్థనలు చేస్తూ గంగా నదిలో బాలుడిని ముంచారు. నీటి లోపల చాలా సమయం పాటు అలాగే ఉంచారు. చలికి తట్టుకోలేక బాలుడు తీవ్ర నరకయాతనను అనుభవించాడు. చుట్టుపక్కల ఉండేవారు అది గమనించి బాలుడి మునకను ఆపాలని బాలుడి కుటుంబీకులను అడిగారు. అయినప్పటికీ, వారు ఎంతకూ వినకపోవటంతో అక్కడ ఉన్నవారు బాలుడిని గంగా నదిలో నుంచి బయటకు తీసుకొచ్చారు. బాలుడి పరిస్థితి విషమించింది. అది గమనించిన అక్కడి వారు బాలుడిని దగ్గరిలోని ఆస్పత్రికి తరలించారు.అయితే, బాలుడు అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు.

ఢిల్లీలో నివసించే బాధిత కుటుంబం ఈ పని కోసం హరిద్వార్‌కు వచ్చింది. గంగా నది స్నానం సమయంలో బాలుడితో తల్లిదండ్రులతో పాటు ఒక మహిళ సైతం ఉన్నది. బాలుడిని గంగా నదిలో స్నానం చేయించిన ఘటనకు సంబంధించిన వీడియోలో జరిగిన తతంగమంతా వెల్లడైంది. ఈ ఘటన తర్వాత పోలీసులు బాలుడి తల్లిదండ్రులు, ఒక మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.